# కస్తూరి కన్నడ కథలు

నవల

- చందకచర్ల రమేశ్ బాబు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 242

# కౌముది మాసపత్రికలో

# 2021జూలై నుంచి జూన్ 2022

# వరకూ

# వచ్చిన కస్తూరి కన్నడ కథలు


| క్రమసంఖ్య | కథపేరు | కన్నడ రచయి(త్రి)తపేరు | తెలుగు అనువాదం | పేజి |
|---|---|---|---|---|
| 1 | ఈ జీవనతరంగాలలో | శ్రీ నాగరాజ వస్త్రారే | చందకచర్ల రమేశ బాబు | 3 |
| 2 | అద్దం | శ్రీ నల్లతంబి | చందకచర్ల రమేశ బాబు | 13 |
| 3 | ఇకనైనా చావాలి | కేశవరెడ్డి హంద్రాళ | చందకచర్ల రమేశ బాబు | 20 |
| 4 | సుభద్రక్క | సునందా కడమె | చందకచర్ల రమేశ బాబు | 35 |
| 5 | కోవిడ్ పరిస్థితుల్లో ఒక రోజు | శ్రీ నాగరాజ్ వస్త్రారే | చందకచర్ల రమేశ బాబు | 42 |
| 6 | ఎగిరిపోతే ఎంత బాగుంటుంది.... | డా.గీతా వసంత్ | చందకచర్ల రమేశ బాబు | 49 |
| 7 | జారుడు జీవితం | దీప్తి భద్రావతి | చందకచర్ల రమేశ బాబు | 55 |
| 8 | మరణానికి ఒక నిమిషం ముందు | తమిళ మూలంః కలైసెల్వి, కన్నడ అనువాదం: నల్లతంబి | చందకచర్ల రమేశ బాబు | 58 |
| 9 | ఇంట్లో ఒంటరిగా.. | శ్రీ నల్లతంబి | చందకచర్ల రమేశ బాబు | 68 |
| 10 | అంతరంగం | ఎమ్.ఎస్.శ్రీరామ్ | చందకచర్ల రమేశ బాబు | 75 |
| 11 | లాస్ట్ బెంచ్ అమ్మాయి | శ్రీమతి కె.వి.రాజలక్ష్మి | చందకచర్ల రమేశ బాబు | 83 |

# ఈ జీవన తరంగాలలో.. శ్రీ నాగరాజ వస్త్రారే

## అనువాదంః చందకచర్ల రమేశ బాబు

**శర్లీ వర్కీ** పంపిన ఆ మెసేజ్ ఎప్పుడొచ్చినా బాగుండేది. అరగంట ముందుగా, లేదా, అరగంట తర్వాత, లేదా ప్రొద్దునో, సాయంత్రమో, నిన్ననో, రేపో.... ఇలా ఎప్పుడొచ్చినా బాగుండేది. కానీ చెప్పా పెట్టకుండా వచ్చే దేనికైనా దానివే అయిన నిబంధనలున్నాయన్నట్టు, అది తనదే అయిన వేళాపాళా చూసుకుని వచ్చింది ! అంతే ! అస్సలు అనుకోకుండా వచ్చింది ! అమ్మ, కుందగౌరిల బలవంతానికి, ఇప్పటిదాకా ఎప్పుడూ పట్టించుకోని నేను – మహాలయ అమావస్య రోజు సాంవత్సరిక పితృతర్పణానికి కూర్చున్నాను కదా – సరిగ్గా అప్పుడే వచ్చిందది.

కాకతాళీయమేమంటే, నేను రామచంద్రయ్య, బదరినాథయ్య – అంటూ వరసగా మా నాన్న, ఆయన చివరి తమ్ముడి పేర్లతో నువ్వులు నీళ్ళు వదలడానికీ, శర్లి వర్కి పంపిన మెసేజ్ రావడానికీ– సరిగ్గా అతికినట్టయి, ఒకదానికొకటి సంబంధం లేని బాంధవ్యం ఏర్పడడం మాత్రం నిజం. అలాగే దాని గురించిన కొన్ని మాటలు కూడా వినబడ్డాయి. "ఫోన్ చేయవా ప్లీజ్ " అన్న మెసేజ్ ను చదివిన కుంద గౌరికి " అరగంట తర్వాత చేస్తాను అని పంపించు ప్లీజ్ " అని చెప్పి, మళ్ళీ మహాలయ అమావాస్య రోజు పితృకైంకర్యానికి సిద్ధపడ్డాను. ఇంటి పురోహితుడు చెప్పే అనేక సవ్యాపసవ్యాల మంత్రోచ్చారణలతో, ఇంతోటి తిలాంజలి కార్యక్రమాలు ముగించేటప్పటికి – శర్లి వర్కి మరో రెండు మెసేజ్ లు పంపింది.

" ఓకే " అని ఒకటి " కానీ వీలైనంత తొందరగా ---" అని మరోటి.

ఈ రెండూ మెసేజ్ లను నా భార్య కుందగౌరి వెంటవెంటనే చదివి వినిపించింది. లేకపోతే నేనెక్కడ ఫోన్ ముట్టుకుని మైల పడిపోతానో అని - చాలా భయం అమెకు ! ఎంతైనా భార్య కదా ! "అందుకే చెప్పింది, ఫోన్ ఆఫ్ చేసెయ్యండి అని.... లేకపోతే ఆ చెయ్యి ఈ చెయ్యి అంటూ మైల.... " అంటూ చిన్నగా గొణగడం మొదలుపెట్టింది. " చేసేదేమో సంవత్సరానికొకమారు... శ్రాద్ధం అంటే ఏమిటి శ్రద్ధతో చేసేది అని అర్థం. కావాలంటే ఆయన్ను అడగండి " అంది నా కుడివైపున కూర్చున్న పురోహితుడి వైపు చూసి. ఆయన తలూపగానే ఉత్సాహంగా " అయినా మీ వ్యవహారాలున్నాయి చూశారూ ... ఛ,, " అంటూ చిరుకోపం చూపింది.

కుందగౌరి ఇబ్బందిని ఆమె కన్నుల్లోనే కనుగొన్న పురోహితుడు " ఏం చేస్తాం తల్లీ.. పాత కాలం సంప్రదాయాలు. ఎంతవరకూ సాధ్యమైతే అంతవరకూ జరపాలి మరి " అంటూ తనకు తానే సర్ది చెప్పుకుని నవ్వాడు. " అదీ కాకుండా ఈ రోజుల్లో సంబంధాలు ఎక్కడున్నాయి ? పాత రోజుల్లో అయితే ఉమ్మడి కుటుంబాలుండేవి... లేదా... అన్నదమ్ములంతా ఒకే ఊళ్ళో ఉండేవారు.... వచ్చి పోవడాలు ఉండేవి. సంబంధాలు నిలిచేవి. ఇప్పుడవన్నీ ఎలా కుదురుతుంది లెండి " అన్నాడు.

"మీరు చెప్పేది నిజమేనండీ." ఎదురుగానే కూర్చుని నేను, కుందగౌరి చేస్తున్న పనులను అజమాయిషి చేస్తున్న అమ్మ ఉన్నట్టుండి మాట్లాడసాగింది. " ఈ బదరీనాథయ్య ఉన్నాడే... మావారి చివరి తమ్ముడు. ఆరు నెలలయింది పోయి... ఎవరకీ పట్టని చావు అయిపోయింది అతడిది. ఒకరకంగా చూస్తే జీవితం కూడా.... " ఇలా అమ్మ బదరి అంకల్ గురించి ఏవేవో కథలు చెప్పసాగేసరికి " ష్... " అంటూ ఊరుకోమన్నాను. " చాలమ్మా. ఊరుకో " అంటూ చెప్పాను కూడా.

ఆమె ఎక్కడ వింటుంది ? తన ధాటీని కొనసాగించింది.

" ఎవరికీ పట్టని జీవితం " అని వినిపించేసరికి పురోహితుడి చెవులు కూడా నిమిరి నిలిచినట్టనిపించింది. " ఇంతకీ ఏమయిందమ్మా ?" అంటూ ఉబుకుతున్న తన కుతూహలాన్ని కనబరచాడు.

" ఏం జరగలేదని అడగండి. " అంటూ అమ్మ తన మొహంలోని ముడుతలన్నిటిలోనూ తన మరదిగారి వేదనల నీడలను నింపుకుని ఒక దీర్ఘమైన కథనానికి పూనుకుంది.

" బదరి ఇక్కడే దగ్గర ఒక అపార్ట్ మెంటులో ఉండేవాడు. ఇద్దరు అమ్మాయిలు. ఇప్పుడు ఇద్దరూ అమెరికాలో ఉన్నారు. భార్యాభర్తలిద్దరే ఇక్కడ. సంవత్సరానికొకసారి అమ్మాయిల ఇళ్ళకి వెళ్ళి– అక్కడో ఆరు నెలలు, ఇక్కడో ఆరునెలలు ఉండేవారు. నిరుడు పెద్ద అమ్మాయి దగ్గర ఉన్నప్పుడు బాత్రూమ్లో జారి పడ్డాడట. నిలవలేక పోయేవాడు. అంటే పూర్తిగా కాదు. కానీ తూలుతూ నడిచేవాడు. నా తోడికోడలు, ఇద్దరు అమ్మాయిలు కలిసి ఆయనని ఇక్కడే దగ్గర ఉన్న వృద్ధాశ్రమంలో చేర్చేసి – తమకిక ఆయనతో సంబంధమే లేనట్టుగా అమెరికా వెళ్ళిపోయారండీ ! ఇంత దగ్గర ఉన్న మాకైనా ఏ మాటా చెప్పకుండా ఒకే వారం వ్యవధిలో ఇవన్నీ ముగించి, ఇక్కడి అపార్ట్ మెంటును అమ్మేసి వెళ్ళిపోయారు. మూడు నాలుగు నెలల తరువాత బదరీయే ఫోన్ చేసి మాకు చెప్పడంతో సంగతి తెలిసింది. తను చనిపోయి ఆరు నెలలయింది... ఎంత గుండె తరుక్కుపోతుంది చూడండి.... "

మాటలు ముగించేటప్పటికి అమ్మ కంట్లో తడి కనిపించింది. గొంతు కూడా గద్గదమయ్యింది.

పురోహితుడు దీని గురించిన సంభాషణను మరింత పొడిగించాడు. బదరి అంకల్ గురించి అడుగుతూ " ఇంతకీ ఆయనకు ఏమయ్యింది ?" అన్నాడు. అంటే ఎందుకు పోయాడు అన్న ప్రశ్న! జవాబు వింటూ మధ్యమధ్యలో " ఛ ! పాపం ! " అంటూ మాట కలుపుతూ పోయాడాయన.

" డెబ్భై రెండండీ అంతే చనిపోయే రోజుకి " అంటూ అమ్మ అంటుండగానే కుందగౌరి అందుకుని " వయసయినాక అన్నీ సరిగ్గా ఉంటాయా చెప్పండి. అరవై దాటాక బ్రతికుండడమే ఒక బోనస్. ఏమంటారు ?" అంటూ తన మాట కూడా కలిపింది.

" అతడు చనిపోయాకనండీ !– నా తోడికోడలు వచ్చి చూడను కూడా చూడలేదు. బాధేస్తుంది. " అమ్మ పెదవి విరుస్తూ చెప్పింది. " ఇలా కూడా ఉంటారా అనిపిస్తుంది. పెద్ద అమ్మాయే వచ్చి దహన కార్యక్రమాలు చేయించి వెళ్ళింది... నేనే వాడి పేరున నలుగురు బ్రాహ్మలకి భోజనం పెట్టించాను. "

" అయ్యో ! పాపం !" పురోహితుడి పక్క తాళం.

దాంతర్వాత చనిపోయిన వారి గురించి మరిన్ని సంభాషణలు దొర్లాయి. మధ్యలో పురోహితుడు కూడా తన వంతుగా కొన్ని చావు ప్రకరణాలను ఏరుకుని ఏకరువు పెట్టాడు. అత్త కోడళ్ళు ఇలా ఎన్నో చావు సంగతులను ఉభయకుశలోపరి మాటల్లా, చెవులు రిక్కించి విన్నారు. ఆయన చెప్పినవి అమ్మ, అమ్మ చెప్పినవి కుందగౌరి ఇలా తమతమ బంధువర్గంలో చనిపోయిన ఆప్తుల నిధనవార్తలను నింపాదిగా చర్చించారు.

" మీ ఆయనకెంత మందమ్మా అన్నదమ్ములు ? " పురోహితుడు అడిగాడు.

"మా ఆయనే పెద్ద...." అమ్మ చెప్పసాగింది. " తరువాత ముగ్గురు తమ్ముళ్ళండీ. ఈ బదరీనాథయ్య చివరివాడు. రెండో మరది చిన్నప్పుడే ఇల్లు వదలి వెళ్ళిపోయి కొల్కత్తాలోనో ఎక్కడో సెటల్ అయ్యాడట. మాతో సంబంధాలు లేవు. ఇక మొదటి మరది చెన్నైలో ఉంటాడు. అతడికి సుమారు నా వయస్సే ఉంటుంది. డెబ్భై ఎనిమిది, లేదా డెబ్భై తొమ్మిది ఉండొచ్చు.. అతడికి మేమెవ్వరం అక్కరలేదు. అదేదో సామెత చెప్తారు కదా– పుట్టగానే అన్నదమ్ములు పెరుగుతూ దాయాదులు అని. అలా అన్నమాట " మాటలు ముగిస్తూ అమ్మ మరొక సంగతిని నావైపు చూస్తూ చెప్పింది. "వీళ్ళందరి మధ్య వీడొక్కడే మగ సంతానం– క్రియలన్నీచేయడానికి. పితృదేవతలంతా వీడు పెట్టే కాకి పిండానికై ఎంత కాచుకుంటారో మరి ? వీడికా అర్థం కాదు. " అని తనలో తనే చెప్పుకుని పెదవి విరిచింది. నాకు ఆశ్చర్యం వేసింది. మగవాడిగా పుట్టడమంటే పితృలకు పిండం పెట్టడానికేనా అన్న విషయం నన్ను ఎప్పుడూ వెంటాడేది. ఎవరితో చెప్పుకోను? అమ్మ అన్న మాటలు వినిపించనట్టుగా ఉండిపోయాను.

" రెండవ మరది అన్నారు కదత్తా. ఆయనను ఈయన చూశారా ? " కుందగౌరి ఉన్నట్టుంది అడిగింది. అంటే నేను నా రెండో బాబాయ్ ని చూశానా అని అడిగింది.

" నేనే చూడలేదు. ఇక వీడేం చూస్తాడు ? నా పెళ్ళికి ముందే ఇల్లు విడిచె వెళ్ళిపోయాడట. రామకృష్ణాశ్రమంలో చేరతాను అని వెళ్ళినవాడు తిరిగి రానేలేదట. తరువాత ఆయన అయిపూ అజా తెలీనే లేదు... " అమ్మ ఇలా విషయాన్నంతా చెప్పి నిట్టూర్చింది.

" అమ్మా ! నాకు లేటయిపోతోంది. " ముగ్గురి ఈ మాటల సరళిని తుంచుతూ అన్నాను.

" సగం రోజు దీని గురించే మాట్లాడుతూ గడిపెయ్యలేమమ్మా " అన్నాను విసుగ్గా.

" ఒక రెండు నిమిషాలండీ ప్లీజ్... ఇంకేం కుక్కర్ విజిలొస్తుంది " కుందగౌరి నైవేద్యానికి ఆయత్తం చేస్తూ అంది.

ఇంతకీ, ఈ సంభాషణంతా ఇంత నింపాదిగా జరగడానికి కారణం కుందగౌరి వంట ఇంకా కాలేదనే. ఈ పురోహితుడు చాలా నెమ్మదస్తుడు. అంతేకాకుండా కుందగౌరి అమ్మ వైపు బంధువు. ఇప్పుడైతే ఇంకా నింపాదిగా ఉన్నాడు. కూర్చున్న చోటునుండి లేవకుండా కబుర్లతో కాలం గడుపుతున్నాడు. ఆయన భార్య మూడో డెలివరీకి పుట్టింటికి వెళ్ళిందట.

" మళ్ళీ మీరు వంట చేసుకోవడం ఎందుకండీ ? మీ కోసం వేరేగా వంట చేస్తాను." అంటూ నా భార్య ఇక్కడే భోజనం చేసి వెళ్ళమని బలవంతం చేసింది. అందుకని పితృదేవతల నైవేద్యానికి చేసిన వంట కాకుండా ఆయనకు ప్రత్యేకంగా వంట చేస్తోంది.

" లేటవుతోంది కుందా " అంటూ నేను గునిసేటప్పటికి " ఒక పని చెయ్యండి. ఎలాగూ తర్పణం వదిలేశారుగా... ఇప్పుడు ఆమెతో మాట్లాడి వచ్చెయ్యండి. అంతలోపల వంట కాస్త అయిపోతుంది. " అని పర్మిషన్ ఇస్తూ తన పక్కన పెట్టుకున్న ఫోనును నా వైపుకు తోసింది.

తనకు కావలసినట్టు నియమాలను సడలించే ఆమె విధానానికి "ఔరా " అని ఆశ్చర్యపడ్డాను. ఫోనును తీసుకుని శర్లి వర్కి మెసేజ్ లను చూసి చదువుకున్నాను. "అరగంట తర్వాత చేస్తాను అని పంపించు " అని నేను చెప్పిన దాన్ని తనకు కావలసినట్టు మార్చుకున్న మా ఆవిడ " మధ్యాహ్నం భోజనం తర్వాత చేస్తాను " అని చేసింది కనిపించింది.

★★★★★★★★

శర్లి వర్కి నా కాలేజ్ రోజుల సహపాఠి. కేరళ వైపు క్రిశ్చియన్. సన్ని వర్కి అని దుబైలో ఒక బిసినెస్ టైకూన్ ఉన్నాడు– కావాలంటే గూగల్ లో వెతకొచ్చు.. అతడి కసిన్ ఈమె. విరాట్ జక్కరియా అనే ఒక మలయాళి క్రిశ్చియన్ ను పెళ్ళాడింది. ఈమె ఆర్కిటెక్ట్. అతడు సివిల్ ఇంజినియర్. ఇద్దరూ కలిసి తమతమ ఇంటి పేర్లను సంకరించి

'వర్కరియా' అనే పేరుతో ఇంటీరియర్ డిసైన్ కాంట్రాక్టులు చేస్తారు. ఆ కంపెనీకి మంచిపేరుంది. ఆర్థికంగా కూడా కంపెనీ గట్టిదే.

తొంభైయారవ సంవత్సరంలోని బి ఎమ్మెస్ కాలేజ్ ఆర్కిటెక్చర్ విభాగంలో చేరిన మేమంతా– అంటే పదముగ్గురు మగపిల్లలు, ఇరవై ముగ్గురు ఆడపిల్లలు, వెరసి ముప్పై తొమ్మిది మందిది ఒక వాట్సప్ గ్రూప్ మా మొబైల్ ఫోన్ల పైన ఈ రోజు సందడి చేస్తుందంటే దాని పూర్తి శ్రేయస్సు శర్లి వర్కి దే అని చెప్పుకోవచ్చు. ఆ గుంపుకు " దర్టి థర్టీ నైన్ " అని పేరు పెట్టింది. దాంట్లో జరిగే చర్చల కీర్తి అంతా ఆమెదే. గ్రూపులో కొన్ని పోకిరి జోకులే కాకుండా గంభీరమైన తాంత్రిక విషయాలను కూడా శర్లి ఆ గ్రూపులో పంచుతుంది. తరగతిలోనే అత్యంత తక్కువ వాచాలుడైన నాతో సహా అందరినీ ఈ చర్చల్లో పాల్గొనేటట్టు చేస్తుంది. కొన్ని సార్లు నిర్ణయాలను చేయించి, విషయాన్ని ప్రభుత్వం దాకా తీసుకెళ్ళి భవన నిర్మాణాల్లోని కష్టాలపై తన గొంతు వినిపిస్తుంది. అంతో ఇంతో నివారణా మార్గాలు కూడా కనుక్కుంది.

ఈ వాట్సప్ చాట్ చేసే సదుపాయం ప్రారంభం కావడానికి ముందు – శర్లి వర్కి మమ్మల్నందర్నీ ఈ మెయిల్ ద్వారా కలిపిన సంగతిని ఇక్కడ తలచుకోవచ్చు. కాలేజిలోని ఐదు సంవత్సరాల మా విద్యాభ్యాసంలో ఈమే మా ప్రతినిధిగా ఉండింది కూడా అనేది అంతే ముఖ్యమైన విషయం. కాలేజి తరువాత గడచిన ఈ ఇరవై చిల్లర సంవత్సరాలలోనూ మమ్మల్నందర్నీ కలిపింది కూడా ఈమే.

శర్లి వర్కి ఒక విధంగ చూస్తే మగ గుండెగల స్త్రీ. దిట్ట. ఈ ప్రపంచంలోని ఏ మగవాడి సరసనైనా దీటుగా నిలబడగల స్త్రీ ! మగవారే ఉన్న ఈ కాంట్రాక్ట్ పనుల్లో తను ఒక్కతే నిలదొక్కుకుందంటే నమ్మొచ్చా మరి ? విరాట్ జక్కరియాను పెళ్ళి చేసుకోవడానికి ముందు " వర్కి కాంట్రాక్ట్స్ " అనే పేరుతో ఒక కంపెని పెట్టి విజయం సాధించింది.

మిగిలిన విషయాలకు వస్తే ఈ శర్లి వర్కి, నాతో ఎక్కువగా కాంటాక్ట్ పెట్టుకోలేదు. ఆ మాటకొస్తే నేను కూడా ఎవరితోనూ అంత ఎక్కువగా కమ్యునికేట్ చెయ్యను. నా గురించి నేనే చెప్పుకోవాలంటే అత్యంత ముభావ వ్యక్తిని ! ఎంతో అంత, ఇంత చాలు. ఇంత మాట్లాడితే అంతా మాట్లాడినట్టే అనుకునే వాణ్ణి. అత్యంత హాస్యాన్నైనా, పరిహాసాన్నైనా కొలిచి పంచడం, అందులోనూ వీలైనంత కత్తిరించి అందించే ఆసామిని ! టోటలి టోటలి టీటోటలర్ నైన నన్ను ఎవరైనా, సాయంత్రాల తర్వాత జరిగే పార్టీలకు తమాషాకైనా పిలుస్తారా చెప్పండి. ఖచ్చితంగా నో ! పార్టీలు జరిగితే నా పేరు టోటలి టోటలి ఔట్ !

ఇలాంటి నన్ను ఈ శర్లి వర్కి ఎందుకు తలచుకుంది అని ఆశ్చర్యం అనిపించదా మరి ! అలాగే నేను నా జీవితంలో మొదటి సారిగా తలపెట్టిన అమావాస్య తర్పణంలాగానే ఆశ్చర్యకరమే అన్నుకోవచ్చు !!

---

ఫోన్ చెయ్యి.... వీలైనంత తొందరగా... అన్న శర్లి వర్కి మెసేజ్ లను మరోసారి చదువుకుని, నాతో మాట్లాడేంత అర్జెంట్ పనేమై ఉంటుందబ్బా అని నాలో నేనే అనుకున్నాను. బహుశా ఈ నా నలభై సంవత్సరాల జీవితంలో మొట్టమొదటి సారిగా ఈమెతో సూటిగా మాట్లాడడం జరుగుతోంది అని అనుకుని చివరికి ఫోన్ చేశాను.

“ హే సరస్.... “ అంటూ ఆమె మాటల్లోకి దిగింది. “ ఎలా ఉన్నావ్ ? ఇదే మొదటిసారి కదూ మనమిలా మాట్లాడుకోవడం ? “ అంటూ ఉభయకుశలోపరి ముగిశాక “ ఏమంటే నీ వద్ద నుండి ఒక ఫేవర్ కావాలి “ అంటూ విషయంలోకి దిగింది.

ఆశ్చర్యమేసింది !

ఈ బెంగళూరు మహానగరం సంప్రదాయాలను తన హక్కులా భావించిన ఈమెకు, ఈమెతో స్నేహ బంధం కానీ, కనీసం మాట్లాడుకోవడం కానీ చేయని నేను ఏ విధంగా ఆమెకు సాయపడగలను ? నానుండి ఆమె ఏం కోరుకొంటోంది ? తనలో లేని దేన్ని నానుండి కోరుకొంటోంది ?

“ హౌ ఎట్ ఆల్ కెనై శర్లీ ? నాకు చేతనైతే తప్పకుండా చేస్తాను “ ఏవేవో ఆలోచనల మధ్య అన్నాను.

“ ఏం లేదు. కెన్ యు ఫిక్స్ అప్ సమ్ డెత్ రిచువల్ ఫార్ ఎ ఫ్రెండ్ ఆఫ్ మైన్ ?” అంటూ శర్లీ వర్కి అడగ్గానే నేను ఒక విధంగా ఉలిక్కిపడ్డాను. తలా తోకా అర్థం కాలేదు. ఉన్నట్టుండి ఫోన్ చేసి తన స్నేహితుడి అంత్యక్రియలకు ఏర్పాటు చేయగలవా అని అడిగితే ఏమనాలి !

“ షాక్ అయ్యావు కదూ ! “ శర్లి వర్కి అన్నది. “ ఉండు.. లెట్ మి ఎక్స్ ప్లెయిన్.. నాకు ఒక స్నేహితుండుడేవాడు. ఎ సీనియర్ జెంటిల్ మేన్.. డెబ్బై అయిదు ఉండొచ్చు.. ఉండేవాడు అని ఎందుకన్నానంటే ఆయన నిన్న చనిపోయారు... అంటే ఇప్పుడాయన మన మధ్య లేరు. నేనే ఆయన్ను క్రిమేట్ చేసి వచ్చాను. ఆయన నాకు మాత్రం స్నేహితుడు కాడు... హి వాస్ ఎ ఫ్రెండ్ ఆఫ్ మై హస్బెండ్ విరాట్ టూ.... హి వాస్ మోర్ ద్యాన్ ఎ ఫ్రెండ్ టు అస్ ! “ సంగతేమిటో పొడుపుకథ మాదిరిగా అనిపించింది. విషయం పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఇద్దరి మధ్య కొన్ని సంభాషణలు వినిమయమయ్యాయి !

“ వెల్... నేను అతన్ని కలిసింది... ఇక్కడే మా ఇంటి ఎదురుగా ఒక పార్క్ ఉంది. అక్కడ..”

“ శర్లి...శర్లి... కెన్ ఐ ఇంటర్రప్ట్ ? నువ్వు ఎక్కడ ఉన్నావో నాకు తెలీదు... ఇంతకీ సందర్భం ఏమిటి అని కూడా చెప్పగలవా ?”

“తప్పకుండా... నేనూ విరాటూ బాణసవాడిలో ఒక ఫ్లాట్లో ఉంటాము. ఆ బిల్డింగ్ ఎదురుగ్గా ఒక పార్క్ ఉంది. అక్కడ మేమిద్దరం పొద్దున లేకపోతే సాయంత్రం వాక్ చేస్తుంటాం....”

“ ఒకే ! “ సన్నివేశాన్ని నిదానంగా అర్థం చేసుకుంటూ అన్నాను.

" ఈ పార్కుకు అవతల వైపు మరొక అపార్ట్ మెంట్లో ఈ కేట్ ఉండేవారు. కేట్ అనేది మేము ఆయనకు పెట్టిన పేరు. మేము అంటే ఆ పార్కులో వాకింగ్ చేస్తున్నవాళ్ళు, ఒక పది పన్నెండుగురం ఫ్రెండ్స్.. మేమంతా ఆయన్ని కేట్ అని పిలిచేవాళ్ళం. ఆయన అసలు పేరు సాకేత రామ్ అని. మేము కేట్ అని పిలిచేవాళ్ళం. ఇప్పుడర్థమయిందా ?"

" అవునా... అయితే ఈ కేట్ అనే ఆయనేనా నిన్న చనిపోయింది ?" ఏ మాత్రం భావుకత కనబరచకుండా అడిగాను. అడిగాక... అలా అడిగింది తప్పయిందేమో అని గొణుక్కున్నాను.

" ఎస్. ఎస్స.... యు ఆర్ రైట్. నిన్న ఉదయం అనేదాని కంటే మొన్న రాత్రి అనవచ్చు అని డాక్టర్ గారు అన్నారు... నిద్రలోనే పోయారు. మ్యాసివ్ హార్ట్ అట్యాక్ ! మొహంలో అదెంత శాంతి అనుకున్నావ్ ! హి లుక్డ్ వెరి పీస్ ఫుల్ ! "

" సరే "

" కేట్... నాకు, విరాట్ కు చాలా దగ్గరి స్నేహితుడిగా ఉండేవారు. రోజూ పొద్దున, సాయంత్రం పార్కులో కలిసేవారు.. సాయంత్రాలు, ఆల్మోస్ట్ అంటే ఆల్మోస్ట్ ప్రతి రోజూ –

వి వుడ్ డెపినిట్లీ మీట్ ఓవర్ ఎ డ్రింక్. ఇలా సుమారు నాలుగైదు సంవత్సరాల నుండి జరుగుతోంది. ఐ మీన్ జరుగుతుండేది.. "

" ఒక్కరే ఉండేవారు. పెళ్ళి చేసుకోలేదు. అండ్ వి హ్యాడ్ లాట్సఫ్ కామన్ ఇంటరెస్ట్స్. కొంచెం ఆధ్యాత్మిక చింతన ఉండేది... కొంచెం కాదు. పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో ఉండేవారు. వి వుడ్ ఆఫన్ డిస్కస్ భగవద్గీతా ఓవర్ ఎ పెగ్ ఆర్ టు. బాగా చదువుకున్నవారు. ఆయనకు తన అంటూ ఎవ్వరూ లేరు. స్పిరుచువల్ గా అవేకన్ అయినప్పుడు – అంటే ఆధ్యాత్మికంగా చైతన్యం పొందినప్పుడు – తనలోని చైతన్యానికి ప్రపంచమంతా కారణం అనిపించేదట.. అలా చెప్పేవారు. తన గతం తనకు ముఖ్యం కాదనేవారు.. "

" ఐ సీ "

" సమ్ హౌ మి అండ్ విరాట్ వర్ డ్రాన్ టు హిమ్... ఆ మనిషిలో ఏదో ఒక ఆకర్షించే శక్తి ఉండేది. రోజులు గడిచే కొద్దీ మమ్మల్ని మరింత దగ్గర చేసుకున్నారు. ఆకర్షిస్తూనే పోయారు. మన మధ్య ఒక కాస్మిక్ సంబంధం ఉంది అనేవారు. "

" సరే "

"సరస్. ఇదీ ఆయన గురించి.. దీనికంటే ఆయన గురించి మాకేమీ తెలియదు. నిన్న ఉదయం ఎప్పటిలా ఆయన పార్కుకు రాలేదు. సరే. ఫోన్ చేశాము. కలవలేదు. మేము ముగ్గురం నిన్న... ఇక్కడే చింతామణి దగ్గర గురు ఫ్రెడ్డి అని ఒకాయన ఉన్నారు, ఆయనను కలవాల్సింది."

" పేరేమన్నావు ?"

"గురు ఫ్రెడ్డి..."

"గురూప్ రెడ్డినా ?"

"నో నో... ఆయన పేరు ఫ్రెడ్డి అని. జర్మనీ ఆయన.. సాధువులాంటి మనిషి.. చింతామణి దగ్గర ఒక కొండపైన కుటీరం నిర్మించుకుని అందులో ఉన్నారు. అందరూ ఆయనను గురు ఫ్రెడ్డి అని పిలుస్తారు."

" ఓహ్ ! సరే !!"

" కేట్, ఫ్రెడ్డి చాలా మంచి స్నేహితులు. ఆధ్యాత్మిక సంగతులను చర్చించేవారు. "

" ఒకే గో ఆన్ ..."

" హా... నిన్న.. మేము ముగ్గురం గురు ఫ్రెడ్డి వద్దకు వెళ్ళాల్సింది. ఈ కేట్ మాకు ఫోన్లో ఎప్పుడైతే కలవలేదో, విరాట్ ఆయన్ను వెతుక్కుంటూ ఆయన ఇంటికెళ్ళాడు.. చూస్తే పడుకున్నట్టే కనిపించారట... కానీ హి వస్ నో మోర్... పోయారు. " శర్లి వర్కి కొంచెం ఆగి చెప్పసాగింది.. " అండ్ యు నో వాట్.. వి మిస్ హిమ్ ఎ లాట్ !! "

ఆ చివరి మాటను చెప్పేటప్పుడు శర్లి వర్కి కంఠం కొంచెం గద్గదమయిందనిపించింది. కొంచెం ఏడ్చినట్టు కూడా అనిపించింది. " పడుకున్నట్టే కనిపించారు సరస్.. తలదిండు క్రింద ఒక చీటీ కనిపించింది. బహుశా ఆయనకు చనిపోతానని అనిపించిందేమో మరి.. నేను చచ్చిపోతే తలదిండు క్రింద ఏదైనా వ్రాసి పెట్టుంటాను అని అప్పుడప్పుడు మాతో అనేవారు.. మొన్నటికి మొన్న విరాట్ తో కూడా అన్నారట !" ఈ మాటలు చెప్పేటప్పుడు స్త్రీ సహజమైన దుఃఖం క్లియర్ గా విన్పించింది. ఒకటో రెండో సార్లు వెక్కింది కూడా !

" నువ్వే నాకు దహన సంస్కారాలు చెయ్యాలి అని కూడా వ్రాశారు సరస్.. ' అంత్యేష్టి అని ఒక చివరి సంస్కారం ఉంది. అది చేయాలి ' అని రాసి, ఒక పురోహితుడి నంబర్ ఇచ్చారు. ఆయనకు ఫోన్ చేస్తేనేమో, ఆయన ఇంట్లోకూడా ఎవరో చనిపోయరని చెప్తూ ఇంకో నంబర్ ఇచ్చారు. ఆయన్ను పట్టుకుని నిన్న ఈయనకు దహన సంస్కారమేమో ముగించాము. నేనే చితకు నిప్పు ముట్టించాను. రేపు బూడిదను తీసుకుని నదికి వెళ్తున్నాము.. "

" ఓహ్. సో సారి శర్లి... ఇప్పుడు నా నుండి ఏం కావాలి చెప్పు ?"

" వెల్... అనూప్ అన్నాడు నాతో. మీ ఇంటి వద్ద ఆర్యావర్తం అని ఏదో ఉన్నదట కదా. అక్కడ కేట్ తరువాతి సంస్కారాలు చేయించాలి. అక్కడి మేనేజ్ మెంట్ నీకు తెలుసట కదా. కాస్త హెల్ప్ చేస్తావా ?"

" అదా ! ఒకె. ఆర్యావర్తంలో నాకంటే మా అమ్మకు, మా ఆవిడకు బాగా తెలుసు. అడిగి చూస్తాను. "

" ఉత్త అడగడం కాదు సరస్.. నేను అంటే శర్లి వర్కి అనే క్రిశ్చియన్ ఆవిడ ఆ సంస్కారాలు చేసే కర్త అని వారికి క్లియర్గా చెప్పాలి.. చెప్పి ఒప్పించాలి.. సరేనా ?"

“......”

“ ఇది నాకు చాలా ముఖ్యం సర్స్.. కేట్ ఆత్మకు శాంతి లభించేటట్టు చేయడం నా కర్తవ్యం కదా... ?” అంత ధైర్యస్తురాలు. వెక్కెక్కి ఏడవసాగింది.

నాకు పెద్ద చిక్కు వచ్చి పడ్డట్టయింది. ఇప్పటి దాకా ఎవరు ఈ ఆర్యావర్తం వారు అని తెలియనినాకు, వారితో మాట్లాడి, దీని గురించి చెప్పి ఒప్పించాలి అంటే !!

నేనే నమ్మని సంగతిని వాళ్ళకు చెప్పి ఒప్పించాలి అంటే ఎలా ?! ఎక్కడ లేని చిక్కే ! నా దృష్టిలో ఇది కల్లబొల్లి నాటకమే ! ఎవరికైనా ఇలాగే అనిపిస్తుంది అని నా భావన. ప్యూర్ హిపొక్రసీ !!

అన్నిటికంటే నన్ను సందిగ్ధానికి ఒడ్డిన విషయమంటే నేనైనా ఈ రోజు నా బాధ్యతే అయిన పితృదేవతల తర్పణాలు బలవంతంగా చేస్తున్నప్పుడు – ఈ అమ్మాయి, అదీ అన్య మతస్తురాలు. తన రక్త సంబంధీకుడైనా కాదు, ఉత్త పరిచయస్తుడి అంత్యేష్ఠిని– తనదే బాధ్యత అనేటట్టు చేయాలనుకుంటోంది అనే విషయం !!

విచిత్రమే మరి ?!

ఎందుకో తెలీదు, శర్లి వర్కి పట్ల నాకు కొంచెం గర్వంగా అనిపించింది. నాకు కూడా గొంతు మూగబోయి, తెలియకుండానే నేను కూడా వెక్కుతూ  నా మాటా మనసు తడబడ్డాయి.

చివరిగా “ ఈ రోజు ఉదయం నేను కేశముండనం కూడా చేయించుకున్నాను “ అని కూడా శర్లి వర్కి అన్నప్పుడు – నాకు మాటలు రాకపోవడం అటుంచి మౌనం కూడా సతాయించింది.

కొంచెం సేపు అలానే ఉండిపోయి, ఆఖరున “ సరే... నేను మా అమ్మతో మాట్లాడి మళ్ళీ నీకు ఫోన్ చేస్తాను శర్లి “ అంటూ మొబైల్ కట్టేశాను.

★★★★★★★★★★★★★★★

మా అమ్మ, మా ఆవిడ ఎదుట ఈ ప్రస్తావన పెట్టినప్పుడు ఇద్దరూ ఒక క్షణం పాటు ముఖాలు చూసుకున్నారు. తరువాతా ఒక్కొక్కరూ నాకు ప్రైవేటు చెప్పేశారు

( రమణగారికి సారీ చెబుతూ )

“ మన సంస్కృతి అంటే ఏమని ఇప్పుడైనా అర్థం చేసుకో సరసూ... ఏమొచ్చినా మన నమ్మకాలను మనం వదులుకోకూడదు.. అప్పుడే మనకు శ్రేయస్కరం.. ఇదే కారణంగానే నేను బదరీనాథ్ చనిపోయినప్పుడు వాళ్ల వీళ్ళ కాళ్ళు పట్టుకుని బ్రాహ్మణార్థం నెరవేర్చాను. పుట్టినప్పటికంటే చచ్చిపోయిన తర్వాత చేసే క్రియాకర్మలు చాలా ముఖ్యం  తెలుసా ? ఎవరో ఏమో ఆ పిల్ల, ఇంత శ్రద్ధతో క్రియాకర్మలు చేయాలని అనుకుందంటే ఇంటికి మగపుట్టుక పుట్టిన నీకు ఇంకెంత

శ్రద్ధ ఉండాలి చెప్పు ?" అంటూ అమ్మ తగులుకుంది. " సంస్కారం అంటే పితృయజ్ఞం అది అని తెలుసుకో. ఆ అమ్మాయి ఎవరైతేనేమిటి, ఆమెకు ముందు దణ్ణం పెట్టుకో "

కుందగౌరి అయితే శర్లి వర్కిని మనసారా పొగడసాగింది.

"ఆ పోయినాయన ఎవరే కానీ, పుణ్యం చేసుకున్నారండీ. రెండు రకాల పుణ్యాలు. ఏమాత్రం బాధపడకుండా చావడం ఒకటైతే, ఎవరూ లేని ఆయనకు ఈ రకంగా సంస్కారం చేస్తోంది ఈమె అంటే అదెంత పుణ్యమో మీరే చెప్పండి. " అంటూ అటు చనిపోయిన పెద్ద మనిషినీ, ఇటు క్రియా కర్తృవునూ ఒకే సారి పొగిడి పారేసింది. " ఏదీ ? ఆమెకు ఫోన్ కలపండి. నేనే మాట్లాడ్తాను. ఇంతకంటే మంచి కార్యం ఇంకోటి లేదని ఆమెకు చెబుతాను "

ఇంతలో అనూప్– అంటే నాకు ,శర్లికి కామన్ ఫ్రెండ్ పోన్ చేసేప్పటికి విషయం అంతటితో ఆగిపోయింది. ఆగిపోలేదు, మరో రకంగా తయారయింది.

నేను అనూప్ తో మాట్లాడేటప్పుడే, కుందగౌరి తన ఫోన్ నుండి ఎవరికో డయల్ చేసి మాట్లాడసాగింది. కొద్ది సమయం క్రింద నాతో శర్లి వర్కిని పొగిడింది కదా అవే మాటల్ని ఇప్పుడు ' ద్వితీయ పురుష ' లో చెప్తూ ఫోన్లో చెప్పడం విన్న నాకు, ఆమెకే ఫోన్ చేసిందని అర్థమయింది. అరె... మరి నంబరెలా దొరికింది అని ఆశ్చర్యపడుతుండగానే, ఆమె చేతిలో ఉన్న చిన్న చీటీ కనిపించి, అందులో శర్లి వర్కి నంబర్ కనిపించింది. నాకూ ఇంకా ఆశ్చర్యమేసింది. కుందగౌరి ఆర్యావర్తానికి ఫోన్ చేసి శర్లి వర్కి గురించి చెప్పగానే వాళ్ళే ఆమె నంబర్ ఇచ్చారని తరువాత నాకు తెలిసింది. అంటే శర్లి ఇంతకు ముందే వాళ్లతో మాట్లాడి ఉండాలి.

శర్లి వర్కితో కుందగౌరి మాటలు ముగిసేసరికి అనూప్ తో నా సంభాషణ కూడా అయిపోయింది. అనూప్ కూడా శర్లి చెప్పిన విషయాల్నే మళ్ళీ చెప్పాడు. సాకేతరామ్ గారి క్రియాకర్మలు సక్రమంగా నెరవేరడానికి కావలసిన సహాయాన్ని అందించమని నాతో మనవి చేశాడు.

నేను ఇలాంటి క్రియా కర్మల గురించి నాకున్న సందేహాని వ్యక్తపరచినప్పుడు " ప్రపంచం మారుతోంది బ్రో... మన దేశం మనం అనుకున్న దాని కంటే ఎక్కువ మతపిచ్చిదయింది. అందరూ తమ పురాతన సనాతన ఆచారాలకు మొదటికంటే ఎక్కువగా వేలాడడం జరుగుతోంది. ఏది తప్పు ఏది ఒప్పు అని అర్థంకావడం లేదు..." అంటే నన్ను ఒప్పిస్తూ మాట్లాడాడు. అతని మాటలు నాకు వైయక్తికంగా సరిపడకపోయినా, ఇప్పటి మన దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా అనిపించింది. " ఏది మతం, ఏది రాజకీయం అని అర్థంకాని పరిస్థితుల్లో ఉన్నాం ! అట్టర్లీ కన్ఫ్యూసింగ్ రైట్ ?! " ఈ మాటల్ని మాత్రం తలాడిస్తూ విన్నాను.

అనూప్ వివరణ గురించిన అర్థానర్థాలను నేను ఒంటబట్టించుకుంటున్నప్పుడే — ఇటు మా అమ్మ ఇంకో విషయాన్ని కెలికిందేమో లేదా తేనెపట్టునే కదిపిందో అనిపించింది.

మా అమ్మ “ ఎవరట చనిపోయింది ? పేరేమిటట ?” అని మా ఆవిడను అడిగింది. నా ఫ్రెండ్ శర్లి వర్కి చెప్పిన నిర్గతికుడి చావు ఒక సాధారణ విషయమే అయినా, మా ఎదురుగా అదొక విస్ఫోటక సమాచారంగా పరిణమించింది. మా మనస్సుల్లోని ప్రేలుడు పదార్థామే తానన్నట్టు సతాయించింది.

“ ఎవరో సాకేతరాం అట అత్తగారూ “ అని కుందగౌరి చెప్పడమే ఆలస్యంగా, అమ్మ తనలోనే ఏవేవో లెక్కలు వేసుకుని, వెంటనే చెన్నైలోని తన ఇంకో మరదికి ఫోన్ కలిపింది.

చూస్తూ చూస్తూ ఉండగానే మా కళ్లముందు కదులుతున్న చీమ ఏనుగై మారింది. తాను నడిచిందంతా తన దారేనన్నట్టు అక్కడా ఇక్కడా నడిచింది. చివరికి మా క్రిందికే తన తొండాన్ని తెచ్చి అల్లాడించింది. నాకేకాదు, మా అమ్మకు కూడా ఏమాత్రమూ తెలియని సాకేతరాం అనే ఆయన చావు ఉన్నట్టుండి, మా ఇంటికి సంబంధించిన వార్తగా మారింది.

“ ఆస్తంతా ఆయన మీ ఫ్రెండ్ కే రాశారట కదరా ! ఇంకేం మరి ? ఈ బెంగళూర్లో ఉత్తుత్తి పుణ్యాన మూడో నాలుగో కోట్ల ఆస్తి వస్తుంటే ఇంకేం ? అదృష్టమే మరి ! ఆమె ఈ పన్లు చేయడం ఏం గొప్ప కాదులే ! నిజం చెప్పాలంటే ఈ సంస్కారాలు నువ్వు చెయ్యాల్సింది. తెలుసా ?! “ అమ్మ విలవిల్లాడింది.

ఇప్పుడైతే నేనూ కుందగౌరి ఇద్దరూ ఉన్నట్టుండి తన వరస మార్చిన అమ్మవైపే చూస్తూ ఉక్కిరిబిక్కిరి కాసాగాము.

## అద్దం శ్రీ నల్లతంబి

## అనువాదంః చందకచర్ల రమేశ బాబు

కొందరు మాట్లాడరు. మరికొందరు మాట్లాడుతూనే ఉంటారు. మాట్లాడడం తెలియనివారు, మాట్లాడడం సహించనివారు, ఎలా మాట్లాడాలో తెలియకుండా మాట్లాడేవారు, మాట్లాడాలన్నా మాట్లాడలేనివారు, అవసరం లేని చోట మాట్లాడేవారు, అవసరమున్న చోట కూడా మాట్లాడనివారు, నోటికొచ్చినట్టు మాట్లాడేవారు, నోటి నుండి రాకూడనివి మాట్లాడేవారు, చూచిందల్లా మాట్లాడేవారు, చూడనిదాని గురించి కూడా మాట్లాడేవారు, చక్కగా మాట్లాడేవారు,

పొగరుగా మాట్లాడేవారు, అహంకారంతో మాట్లాడేవారు, మెత్తగా మాట్లాడేవారు, నాజూకుగా మాట్లాడేవారు, వినయంగా మాట్లాడేవారు, ప్రేమగా మాట్లాడేవారు, మొరటుగా మాట్లాడేవారు, ద్వేషంతో మాట్లాడేవారు, కోపంగా మాట్లాడేవారు, విషపూరితంగా మాట్లాడేవారు, విషమంగా మాట్లాడేవారు, సంబరంగా మాట్లాడేవారు, క్రుంగి మాట్లాడేవారు, తగ్గి మాట్లాడేవారు, ముగ్ధంగా మాట్లాడేవారు, ముద్దుగా మాట్లాడేవారు, అలకతో మాట్లాడేవారు, మొహం మీద కొట్టినట్టుగా మాట్లాడేవారు, మౌనంగానే మాట్లాడేవారు, మనసులోనే మాట్లాడేవారు, బాధతో మాట్లాడేవారు, బాధపెట్టేట్టుగా మాట్లాడేవారు, బాధ పెట్టాలనే మాట్లాడేవారు, బాధపడి మాట్లాడేవారు, మ్రగ్గిపోయి మాట్లాడేవారు, తమాషాగా మాట్లాడేవారు,ఆకతాయిగా మాట్లాడేవారు

ఇలా మాట్లాడడంలో ఇంకా ఎన్నెన్ని రకాలో........

కానీ మనిషి తనలో తాను మాట్లాడుకునేటప్పుడు మాత్రం నిజమే మాట్లాడుకుంటాడా ? మనుషులు నిజాన్ని మాట్లాడడానికి చాల కష్ట పడతారు.

గందరగోళంగా ఉంది.

అతడికి యాభై అయిదు దరిదాపుల వయస్సు. సుగర్ పేషెంట్. అప్పుడప్పుడు టాయ్లెట్ కి పోయి రావలసి వస్తుంది. చలి కాలమైతే ఇక చెప్పనక్కరలేదు. పెద్ద తలకాయ నొప్పి. ఆ రోజు కూడా అలాగే. అర్ధరాత్రి లేచి టాయ్లెట్ కి వెళ్ళాడు. అప్పుడు ఆయన భార్య వచ్చిపక్కన పడుకుంది.

పని ముగించి, చేతులు కడుకోవడానికి వాష్ బేసిన్ దగ్గరకు వచ్చాడు. అద్దంలో చూడగానే గుండె ఝల్లుమంది. వెంటనే తలుపు తెరిచి మంచం పైనున్న తన భార్యను చూశాడు. ఆమె నిద్రపోతూ కనిపించింది. హడావుడిగా మళ్ళీ బాత్రూంలోకి వచ్చాడు. అద్దంలోకి చూశాడు. తనే కనిపించాడు. అలాగయితే ఇంతకు ముందు దానిలో కనిపించిన తన భార్య ? అయితే అద్దంలో కనిపించింది తన భ్రమా ? తానే గందరగోళానికి గురి అయ్యాడా ? ఏదీ అర్థం కాక వచ్చిపడుకున్నాడు.

నిద్ర పట్టలేదు. రాత్రంతా దొర్లుతూనే గడిపాడు. అద్దంలో తనకు కనిపించింది తన భార్యే అని మనసు చెప్తోంది. కాదు అని బుద్ధి తర్కించింది. తను అద్దంలో ఏమో చెప్తోంది కదూ ?!

పొద్దున లేచేటప్పటికి అంతా మరుగున పడింది. ఎప్పటిలాగే ఆఫీసుకి బయలుదేరాడు. అతడు ఒక ప్రైవేట్ కంపెనీలో మేనేజర్. కారున్నా బస్సులోనే వెళ్తాడు. డీలర్ల విజిట్లకెళ్ళేటప్పుడు మాత్రం కారు తీస్తాడు. ఈ ట్రాఫిక్ రద్దీలో కారులో వెళ్ళడం కంటే బస్సులో వెళ్తేనే తొందరాగా ఆఫీసుకు చేరుకోవచ్చు. రోజూ లాగే బస్సెక్కాడు. కూర్చోవడానికి సీటు దొరకలేదు. నిలబడే ఉన్నాడు. కొంచెం దూరం వెళ్ళిన తరువాత డ్రైవర్ ముందున్న ఆ చిన్న అద్దంలోకి అకస్మాత్తుగా చూశాడు. అక్కడ అనేక ముఖాలు కనిపించాయి. అన్నీ ఏమేమో చెపుతున్నాయి. ఆశ్చర్యం వేసింది. కళ్ళు మూసుకుని

తలను మేకవలె తిప్పాడు. మళ్ళీ అద్దంలోకి చూశాడు. ఇప్పుడు ఆ ముఖాలేవీ కనిపించలేదు. అనేక కోణాలలో మొహాన్ని తిప్పి తిప్పి చూశాడు. కానీ అద్దం ఖాళీగానే కనిపించింది. తలలో వేయి సమ్మెటలతో బాదినట్లనిపించింది.

ఆఫీసుకు రాగానే తన అద్దాల క్యాబిన్ లోకి వెళ్ళి, తన సంచిని టేబల్ పైనుంచి, టాయ్లెట్ లోకి వచ్చాడు. అక్కడి పని ముగించి చేతులు కడుక్కోవడానికి వాష్ బేసిన్ ముందుకు వచ్చి నిలుచున్నాడు. అందులోకి చూసి గాభరా పడ్డాడు. అందులో కనబడింది తన క్రింద పనిచేసే నారాయణ. కళ్ళు విప్పార్చుకుని చూశాడు. నారాయణ అదేమో చెపుతున్నాడు. చెవులు నిమిరించి విన్నాడు. స్పష్టంగా వినిపించసాగింది.

" పాపిష్టి నా కొడుకు ! ప్రాణం తీస్తాడు. వీడు మార్కెట్ కి వెళ్తే కదా తెలిసేది. ఏసి రూములో కూర్చుని నామీద పెత్తనం చేస్తాడు. టార్గెట్, కలక్షన్ అంటూ గంటకోసారి తల తింటాడు... వీణ్ణి....." అంటూ నారాయణ పళ్ళు కొరకడం అద్దంలో కనిపించింది.

అంతలోనే ఎవరో లోపలికి రావడంతో చేతులు కడుక్కొని బయటికి వచ్చాడు.

ఆ రోజు అతడికి పని చేయడం కుదరలేదు. నిన్న రాత్రి తన బాత్రూం అద్దంలో కనిపించింది తన్న భార్యే కదా ! నారాయణ ఎందుకలా కోపగించుకుంటున్నాడు? ఎవర్ని అలా దులిపేస్తున్నాడు? ఆలోచించగా అది తననే అని అర్థమయ్యింది. నారాయణ తననే తిడుతున్నాడు.

నారాయణ మార్కెట్ విజిట్ కని వెళ్ళినప్పుడల్లా తను ఫోన్ చేసి అడుగుతూనే ఉంటాడు. " ఆ డీలర్ ఈ రోజు నాలుగు వాషింగ్ మెషేన్లు ఆర్డర్ ఇస్తానన్నాడు. ఇచ్చాడా? అతడి వద్ద నుండి క్రితం నెల బ్యాలన్స్ చెక్కు మరచిపోకుండా తీసుకున్నావా ? ఆయనేమైనా సాకు చూపితే గొర్రె మాదిరి తలూపి వచ్చెయ్యొద్దు. అర్థమైందా ?"

ఈ సేల్స్ వాళ్ళున్నారే ? వాళ్ళకేమిటి? మార్కెట్ కు వెళతామని చెప్పి, అందరి డీలర్లకూ ఐదు నిమిషాలు మొహం చూపించేసి, ఏ అమ్మాయితోనో కాఫి షాప్ లో చొంగ కారుస్తూ కూర్చుంటారు. అబ్బబ్బా! వీళ్ళని అదుపుచేసేంతలో ఇలా

షుగర్ వచ్చి ఎప్పటికప్పుడు జిప్ విప్పాల్సి వస్తోంది. "మేనేజ్ మెంట్ కు వీళ్ళ తాతలు వచ్చి సంజాయిషీ ఇస్తారా?" అంటూ గొణుక్కున్నాడు.

" నా గురించి ఆఫీసులో ఇలా మాట్లాడుకుంటారా?" అని అనుకుని నవ్వుకున్నాడు. ఆ నవ్వు ఆగలేదు. అతడు ఈ పదవికి రాక ముందు ఇలాగే సంచిపట్టుకుని ఊళ్ళు, వీధులు తిరుగుతూ, మ్యానేజర్లను మనసులోనే తిట్టుకున్నది గుర్తుకొచ్చింది.

కానీ అతడికి ఆశ్చర్యం వేసింది. అద్దంలో నారాయణ మాట్లాడేది తనకెలా వినిపిస్తోంది? తనకేమైనా భ్రాంతా అనుకుంటూ గాబరా పడ్డాడు. లేదా ఈ పనుల ఒత్తిడిలో ఇలా గందరగోళంగా ఉంటోందా? ఆ రోజు సేల్స్ మేనేజర్ల మీటింగ్ లోనూ మంచి డోసే పడింది. " ఏం సేల్స్ మేనేజర్ సార్ ! ఇలా నెలా నెలా సేల్స్ పడిపోతూ ఉంటే ఎలాగండీ ?

కలెక్షన్లు కూడా సరిగ్గా రావడం లేదు. క్యాష్ ఫ్లో టైటయింది. కానీ మీ సేల్స్ టీమ్ కు జీతం, డైలి అలవెన్స్, టూర్ అలవెన్స్ అంటూ ఒకటో తేదీ ఠంచనుగా చెక్ రాసిచ్చేస్తారు... ఇలానే అయితే ఎలా సార్ ? బోర్డ్ మీటింగ్ లో ఉతికి ఆరేస్తారు మమ్మల్ని ! ఏం సంజాయిషీ చెప్పమంటారు చెప్పండి" అని అరటిపండులో సూది దించినట్టు మాట్లాడారు ఎం.డి.

దీన్నే కర్మ అంటారేమో ! నారాయణను నేను చివాట్లు పెట్టడం, ఎండి నన్ను చివాట్లు పెట్టడం.... ఈ కర్మ వర్తులం ఇలా తిరుగుతూ ఉంటుందేమో !

" ఇలా సేల్స్ లేవు, కలెక్షన్లు లేవు అంటూనే పది సంత్సరాలు లాగాడీ పెద్దమనిషి ! అవేవీ లేకపోతే వీడు కంపెనీని ఇన్నిసంవత్సరాలు నడపగలిగేవాడా ? ఎప్పుడో మూత పెట్టేసేవాడు కదా ! ఈ ఓనర్ మొసళ్ళకు ఎంత పోసినా చాలదు ! పైన తిన్నదంతా కింద జారిపోతుందనుకుంటా. లేకపోతే ఇలా బ్రాంచ్ పైన బ్రాంచ్ తెరుస్తూ పోతారా ఏమిటి ?!"

నారాయణ అద్దంలో ఇదే కదా మాట్లాడింది. నారాయణ మాట్లడింది తనకు వినిపించినట్టే ఇప్పుడు తను అనుకుంది ఎండికి వినిపించి ఉండవచ్చా అనుకుని గాబరాగా ఆయన వైపు చూశాడు. ఆయన తన వైపే గుర్రుగా చూస్తుండడం కనిపించింది.

ఆ రోజు రాత్రి భోంచేసి పడుకునే ముందు బాత్రూముకు వెళ్ళాడు. అద్దంలోకి చూశాడు. అతడు మాత్రమే కనిపించాడు. నిట్టూర్చి వచ్చి పడుకున్నాడు. భార్య తన పనులు ముగించి పడుకునే ముందు బాత్రూంకు వెళ్ళింది. కొంత సేపు కాచుకుని, పొత్తి కడుపులో ఒత్తిడి లేకున్నా బాత్రూం కు వెళ్ళాడు. అద్దంలోకి చూసినప్పుడు అక్కడ ఏమీ కనిపించలేదు. " ఇప్పుడీమె బాత్రూ౦ం నుండి వచ్చి పడుకుంది కదా ! అప్పుడు అద్దం ముందు నిలబడలేదా ? తనకు పరిశుభ్రంత గురించి చాలా చాదస్తం. చేతులూ కాళ్ళూ కడుక్కోకుండా బయటికి రాదు. తనో, కొడుకో చేతులూ కాళ్ళు కడుక్కోకుండా బయటికి వస్తే నోరు పడిపోయేలా అరుస్తుంది. బాత్రూం నుండి బయటికి వచ్చేటప్పుడు కొద్దిగా ఎత్తుగా కనిపించే తన పృష్ఠ భాగానికి తన చేతులను తుడుస్తూ రావడం చూశాను కదా ! పొద్దున ఇంట్లోనూ, బస్సులోనూ, ఆఫీసులోనూ జరిగింది నిజమే అయితే ఇప్పుడు తను కిటికీలో కనిపించి ఉండాలి కదా ?" అని ఆలోచించాడు. సరే ఏదో భ్రమ అనుకుని అద్దంలోకి చూస్తే అక్కడ ఒక బల్లి కనిపించింది. వెంటనే తిరిగి చూస్తే అద్దానికి ఎదురుగ్గా ఉన్న గోడను చూశాడు. అక్కడ బల్లి కన్పించలేదు. మళ్ళీ అద్దంలోకి చూశాడు. అక్కడ బల్లి కనబడలేదు. ఇప్పుడు అతడికి మొదటికంటే రెట్టింపు భయమేసింది. మొదటి సారి అద్దాన్ని చూసేటప్పుడు బల్లి ' చ్చొ చ్చొ చ్చొ' అంటూ ఏదో చెప్పింది కదా ! అది ఏమి చెప్పుండొచ్చు అని ఆలోచించాడు. భయపడుతూనే వచ్చి మంచం పైన పడ్డాడు.

నిద్ర దరికి రాలేదు. "ఏదైనా మనసులో అనుకునేటప్పుడు నేను చ్చు చ్చు అంటే దాన్ని శకునం అనుకుంటారెందుకో ఈ మనుషులు ! మూర్ఖులు " అని ఈ బల్లి ఏమైనా చెప్పిందా? అని ఆలోచిస్తూనే నిద్రపోయాడు. పొద్దున్న లేవగానే అదే జ్ఞాపకం. అతడికి ఒకటి అర్థమయింది. ఎవరు తను చూడడానికి ముందు అద్దంలోకి చూస్తుంటారో

వారు తనకు ఒక్కసారి మాత్రమే కనబడతారు అన్నది. అలా అయితే రాత్రి తన భార్య బాత్రూం నుండి బయటికి రాగానే బల్లి అద్దంలోకి చూసిందా ? గోడ పైకి చూసి మళ్ళీ అద్దంలోకి చూసినప్పుడు అందుకే అది కనబడలేదా? జుట్టు పీక్కున్నాడు.

ఆఫీసు పని మీద ముంబైకి వెళ్ళి బెంగళూరుకు విమానంలో తిరిగి వస్తున్నాడు. విమానంలో అతడు ఎప్పుడూ ఐల్ వైపు సీటునే తీసుకునేవాడు. అప్పుడప్పుడు టాయ్లెట్ కు వెళ్ళాల్సిన అవసరం ఉంటుంది కదా అందుకే అదైతే తనకు సౌకర్యంగా ఉంటుంది అని. అలా ఐల్ సీట్ లో కూర్చోగానే బ్లాడర్ నిండినట్టు అనిపించింది. టాయ్లెట్ కు వెళ్ళి పని ముగించుకుని చేతులు కడుక్కోవడానికి వాష్ బేసిన్ ముందు నిలబడినప్పుడు అద్దంలోకి చూసి గాబరా పడ్డాడు. అందులో ఒక యువకుడు ఓ అని ఏడుస్తూ ఏమేమో చెబుతున్నాడు. " నందిని నన్ను వదిలేసి వెళ్ళిపోయింది అనుకుంటే నువ్వూనా కల్పనా ? నా ఫ్రెండ్ ఆ కృష్ణవేణి నీకు తెలుసా ? తనేమైనా చెప్పిందా, నేను తనను ప్రేమించానని..... అందుకే నీకు నా పైన కోపమా ? నేను నీతో దీని గురించి చెప్పాను కదా ! ఇలా నన్ను అందరూ వదిలేస్తే నా గతి ఏంటి? నాకెందుకో బ్రతకాలని లేదు. ఈ ప్లేన్ ఇక్కడే పేలిపోయి నేను చచ్చిపోకూడదా అనిపిస్తుంది కల్పనా...." అంటూ ఇంకా ఏమేమో పేలుతున్నాడు.

వీడు నిజంగానే ఇదంతా మాట్లాడాడా ? లేదా వాడి మనసులోనిదంతా నాకు వినిపించిందా ? ఇదంతా అద్దం ఎలా గ్రహిస్తోంది–ఎలా ప్రతిధ్వనిస్తోంది ? నాకు మాత్రమే ఇలా జరుగుతోందా ? లేక అందరికీ ఇలానేనా? మళ్ళీ గందరగోళం మనసులో.

"తను ఒక్కరినైనా ప్రేమించలేక పోయాడు. ఈ వెధవ నలుగిరినో ఐదుగురినో ప్రేమించి, ఒక్కరూ అందలేదని ఏడుస్తున్నాడు. వీడికి అదొక్కటే తక్కువ. ప్రేమనంతా ఒకమ్మాయి దగ్గరే వెతికితే దొరకదని ఇలా చాలా మందిని ప్రేమిస్తున్నాడా ? ఒకవేళ చావాలని అనిపిస్తే, ఉరేసుకునో, విషం తాగో చనిపోవాలి కానీ– ఇదేమిటి ఇలా విమానం పేలి చావాలనుకుంటున్నాడు ! కైలాసమో, వైకుంఠమో ఈ ఎత్తుకు దగ్గర అనుకుంటున్నాడేమో ! వాడు చావడం కాకుండా అందరినీ కైలాసానికి చేర్చి పుణ్యం కట్టుకోవాలని చూస్తున్నాడేమో పాపిష్టి వెదవ ! "

చాలా సేపు లోపలే ఉండకూడదని బయటకు వచ్చాడు. విమానంలో అటూ ఇటూ తిరుగుతూ ఆ వెధవ మొహాన్ని వెతికాడు. ఒక మూలలో మొహం వేలాడేసుకుని కూర్చుంది కనిపించింది. వాడు కనిపించినప్పుడు పెదాల మీదికి వచ్చిన చిరునవ్వును బలవంతాన ఆపుకున్నాడు.

తన కుర్చీకి వచ్చి కూర్చున్నాక, విమానం ఎప్పుడు దిగుతుందో అని తపన పడ్డాడు. దానికి ఏమీ కాకూడదు దేవుడా అంటూ తను నమ్మని దేవుళ్ళనంతా ప్రార్థించుకున్నాడు. భయపడ్డాడు. మళ్ళీ టాయ్లెట్ కి వెళ్ళాలనిపించినా భయంతో అలాగే కూర్చున్నాడు.

★★★★★★★★

పడుకోవడానికి ముందు అతడి భార్య బాత్రూం కు వెళ్ళొచ్చింది. తను వెళ్ళి బాత్రూం లో అద్దాన్ని చూడనా అనుకున్నాడు. మళ్ళీ వద్దనుకున్నాడు. ఆమె అద్దం ముందు తన గోడేదయినా వెళ్ళబోసుకుందేమో ! అది తనకు వ్యతిరేకంగానో, నచ్చనట్టో ఉంటే ! తనకు భయం,బాధ, వ్యథ కలగవచ్చు. దాంతో తమిద్దరి మధ్య కళ్ళకు కనిపించని ఒక చిన్న చీలిక వస్తుందేమో ! భయం– అలా సంబంధాలలో మనస్పర్థలు రాకూడదనిపించింది. అందరి ఆశయం సంబంధాలు బావుండాలనే కదా !

ఆమె ఏదైనా మంచిదే చెప్పుండ వచ్చు అని ఎందుకనిపించదు ? మంచిదయితే నేరుగా చెప్పెయ్యొచ్చు. ఇలాంటివాటినే కదా చెప్పలేరు !

★★★★★★★★★

కొడుకు తన బాత్రూం శుభ్రం చేస్తున్నప్పుడు అద్దాన్ని తుడిచాడేమో ! గోడకు కొట్టిన మేకు వదులై అద్దం జారి పగిలిపోయింది. ముక్కలు తీస్తున్నప్పుడు గాజు ముక్క తగిలి వేలు కోసుకుని రక్తంకారుతున్నా పట్టించుకోకుండా భార్య " ఇంట్లో అద్దం పగిలిపోయింది. ఈ ఇంట్లో ఏం విపరీతాలవుతాయో ! ఉన్న సమస్యలు చాలవన్నట్టు ఇంకేం ఖర్మ కాచుకుందో " అంటూ అద్దం పగలిపోవడం అన్నది మూఢ నమ్మకం అన్నట్టు ప్రతిబింబిస్తోంది. ఈ ప్రపంచంలోని మనుషులంతా ఇంతే ! ఏదో ఒక మూఢ నమ్మకాన్ని పట్టుకుని వేలాడుతుంటారు.

అతడు కొడుకు వేలికి మందు రాయడం కోసం ప్రథమ చికిత్స పెట్టేను వెతుకుతున్నాడు.

"మనం ఇలా గాజు పగిలితే అపశకునం అనుకుంటుంటే, విదేశీయులు మంచిది కావాలని తాగిన గ్లాసులను కిందికేసి పగలగొడతారు. మనం దేముడి ముందు కొబ్బరికాయ కొట్టినట్టు వాళ్ళు పడవనో, విమానాన్నో పరీక్ష చేసేటప్పుడు వాటి ముందు శాంపేన్ బాటల్ ను పగలగొడతారు. బాబు వేలు కోసుకుని బాధ పడుతున్నాడు. దాన్నిగమనించకుండా శకునం గురించి చెప్తోంది" అని భార్యను కసురుకోగా, ఆమె " మీరయితే నాస్తికులు. ఇలాంటివి నమ్మరు. మీకెలా అర్థమవుతాయి లెండి" అంటూ అతడిని అంటరానివాడిగా చూసింది.

★★★★★★★★★

మరుసటి రోజు ఒక కొత్త అద్దాన్నితీసుకురావడానికి తనే కొట్టుకు వెళ్ళాలి. అబ్బాయో, మా ఆవిడో ఈ పనులు చెయ్యరు. ఆ అంగడి గోడలు అద్దాలతో కట్టినట్టనిపించింది. అ అంగడ్లో నించున్నప్పుడు తను స్కూల్ మ్యాగజైన్లో రాసిన రెండు లైన్ల కవిత గుర్తుకొచ్చింది. " అంగట్లోని అద్దాలలో కనిపించాయి నావే వంద ప్రతిబింబాలు, ఇందులో నా ముఖం ఏది?" ఇప్పుడూ అలాగే. వంద ముఖాలు కనిపించాయి. కానీ ఆ అంగట్లో ఉన్నవారు ఒక్కళ్ళో ఇద్దరో. వాళ్ళ ముఖాలు

తను రాక ముందు వచ్చిపోయిన ముఖాలుండాలి. అన్నీ ఏమేమో చెపుతున్నాయి. వినబడడం లేదు. అర్థం కూడా కాలేదు. చిన్న పిల్లల అరుపుల మాదిరి వినిపించింది. తలలో వెయ్యి గాజు పెంకులు గుచ్చుకున్నట్టయింది.

కొడుకు బాత్రూం గోడకు మేకు గట్టిగా కొట్టి అద్దాన్ని అమర్చాడు. అది కూడా తనే చేయాలి. ఆవిడ, కొడుకు అద్దం బాలేదు అని మొహం చిట్లించారు. అద్దం ప్రతిబింబం చూపితే చాలు కదా....! అందమైన అద్దం అందరినీ సుందరంగా చూపిస్తుందా ఏమిటి ?!

కుటుంబ యజమాని తన సంసారంలోని అందరికోసం అన్నీ చేస్తాడు. చివరికి దూషించేది అతన్నే ! ఈ ఇంటి యజమాని రాతే అంత ! నమ్మకం అనే బాధ్యతను మోస్తూ క్రుంగి పోతాడు

★★★★★★★★★★★

ఆ రోజు పక్కింటి పేరంటానికి వెళ్ళడానికి భార్య డ్రెస్సింగ్ టేబల్ అద్దం ముందు నిల్చుని సింగారించుకుంటోంది. తను ప్రక్కనున్న మంచం పైన కూర్చుని ఆమెను చూస్తున్నాడు. ఆమె చెవుల ప్రక్కన నెరిసిన కురులు ఆమె అందానికి ఒక గాంభీర్యం సంతరించి పెట్టాయి. ఆమె వజ్రాల ముక్కరకు ఆమె కంటి మెరుపులు కనిపించలేదు. పెదాలకు లిప్స్టిక్ రాసుకుని పెదాలను కలిపి ముడిచి తన వైపు చూస్తూ మాట్లాడకుండా “ బావుందా” అంటూ కనుబొమ్మలు ఎగరేసింది. తను తన బొటనవ్రేలును, తర్జనిని కలిపి సున్నా చుడుతూ “ సూపర్” అన్నట్టు సంజ్ఞ చేశాడు. ఆమె చిరునవ్వులో సంతోషం, గర్వం రెండూ కనిపించాయి.

ఆమె వెళ్ళిపోయాక ఆ అద్దం ముందు నిలబడ్డాడు “ ఈ రాత్రి విందు అడుగుతాడు. లేదనకూడదు” అని అనుకున్నది వినిపించింది. ఆశ్చర్యం, నవ్వూ రెండూ కలిగాయి. రాత్రి కోసం కాచుకున్నాడు.

ఈ మధ్య పడుకున్నాక ఆమె పైన చెయ్యి వేస్తే “ ఊరికే పడుకోండి. వేరే పనీ పాటా లేదా! సదాశివుడికి అదే ధ్యానమన్నట్టు “ అంటూ ఆమె నడుము చుట్టూ వేసిన చేతిని దూరంగా విసిరి, పడకేసే ఆమె మనసులోనూ ఇలాంటి ఆలోచనలు వస్తాయా ? ఈ ఆడవాళ్ళ ఆలోచనలను ఎలా అర్థం చేసుకోవాలి?

కొన్ని పరిచితుల, కొన్ని అపరిచితుల ముఖాల గోడును అద్దంలో వినేటప్పుడు వారి పైన జాలి కలుగుతుంది. కానీ వాటన్నిటిని సహించడం మాత్రం చేత కావడం లేదు. వారి దుఃఖాలను, అవసరలాను తీర్చడం అద్దానికి సాధ్యం కాదని వారికి బాగానే తెలుసు. కానీ అద్దం ముందు గోడు వెళ్ళబోసుకుని ఏడిస్తే తమ మనసులోని బరువును దించుకోవచ్చు అని అనుకుంటారు. అలా దాని ముందు ఆరాటపడడం వలన సమస్యలు పరిహారమవుతే మంచిదే. అదెవరో తమిళ నటుడన్నట్టు “ దేవుడుంటే మంచిదే” అని.

మనుషులు తమ బరువును ఇంకొక్కరి భుజం పైన మోపి అలుపు తీర్చుకుంటారు. కానీ, తరువాత ఆ బరువును వాళ్ళే ఎత్తుకుని వెళ్ళాలి. ఎవరైనా కానీ ఇంకొక్కరి బరువును మొయ్యలేరు.

ఇలా అద్దంలోని ప్రతిబింబాలు అతడికి కనిపించి మాట్లాడడం అతనికి సమస్యగానే మారింది. దీన్నుండి విముక్తి పొందాలి..... లేకపోతే ? ఆలోచించాడు. ఎవరికైనా చెప్పేసేదా అనుకుని, మళ్ళీ వాళ్ళు వీడికేమైనా పిచ్చి పట్టిందా అనుకుంటే..... సైకాలజిస్ట్ దగ్గరకి వెళితే..... అదీ ఇదీ అంటూ ఏవేవో తన మెడికల్ డిక్షనరీలోని పదాలు వాడి బుర్ర తినేస్తారు. వద్దు. వెనుకడుగు వేశాడు. భార్యతో అంటే.....అప్పుడప్పుడు కోపంలో ఉన్నప్పుడు చేతికందినవి విసిరేది చూసి, పిచ్చివాడనుకున్న ఆమె ఇక కన్ఫర్మ్ చేసేస్తుంది.

అతడికి రాత్రంతా నిద్ర పట్టలేదు. విపరీతమైన కోపం, అసహాయకత. తల బ్రద్దలయినట్టనిపించింది. ఉదయం లేవగానే అద్దాన్ని తీసి క్రిందికి విసిరి కొట్టాడు. అద్దం పగిలి ముక్కలు నేలంతా పరచుకున్నాయి... అన్నిట్లోనూ అనేక ముఖాలు మౌనంగా చెదిరిపోయి కనిపించాయి..

వంటింట్లో నుండి భార్య “ మళ్ళీ ఏ గ్రహచారం కాచుకునుందో “ అంటూ అరిచింది.

****************

## ఇకనైనా చావాలి — కేశవరెడ్డి హంద్రాళ

## అనువాదంః చందకచర్ల రమేశ బాబు

గుహాంతరాళాలనుండి ఏదో జంతువు అరచినట్లయ్యి, ప్రొఫెసర్ ఋగ్వేదిగారికి మెలకువ వచ్చినప్పుడు రాత్రి ఒకటిన్నర అయ్యిండింది. మంచం ప్రక్కనే ఉన్న సోఫా పైన ఉంచిన ఫోన్ రింగవుతూ కనిపించింది. నిద్ర మత్తులో ఏదో జంతువు అరుపులా వినిపించిన శబ్దం తన ఫోన్ దని తెలుసుకున్న ఋగ్వేది నెమ్మదించారు. ఋగ్వేది గారు సాధారణంగా పడుకునేటప్పటికి రాత్రి ఒంటి గంటే అవుతుంది. ఆరు సంవత్సరాల క్రితం రిటైరైన ఋగ్వేదిగారు పెద్ద ఇంట్లో ఒక్కరే ఉంటారు. ఇంకేం రిటైర్ అవుతారు అనే సంవత్సరంలో ఆయన భార్యను పోగొట్టుకున్నారు. పిల్లలిద్దరూ అమెరికాలో సెటిల్యార్యారు. పెద్దవాడు డాక్టర్. చిన్నవాడు సాఫ్ట్వేర్ ఇంజనియర్. ఇద్దరికీ ఇద్దరేసి పిల్లలు. వాళ్ళు అమెరికన్ సిటిజన్స్. ఋగ్వేది పెద్దవాడి భార్య పంజాబి రెండో అబ్బాయి భార్య పఠాన్. కాబట్టి ఇద్దరి భార్యలూ అందంలో అమెరికావాళ్ళను తలదన్నేలా ఉంటారు. వారు మాట్లాడే ఇంగ్లీష్ భాష కూడా అంతే. వారి మాటలు వింటే వారిని

భారతీయులు అని అనుకోవడం కష్టమే. ఆ ఇద్దరూ కూడా మంచి కంపెనీలలో పని చేస్తూ ఉండడం వలన పిల్లలిద్దరూ ఇల్లు, కారు, బ్యాంక్ బ్యాలన్స్ వాటితో ' వెల్ టు డు' లిస్ట్ లో ఉన్నారు. ఋగ్వేదిగారి అర్థిక పరిస్థితి కూడా బాగానే ఉంది. సొంత ఇల్లు, కారు, వచ్చే పెన్షన్, డిపాజిట్ల పైన వచ్చే వడ్డీలు కలిపి నెల నెలా ఒక లక్షకు పైగానే ఆదాయం వస్తుంది.

ఆరు నెలల క్రితం ఫోన్ చేసినప్పుడు పెద్ద అబ్బాయి " ఏమన్నా డబ్బులు అవసరమా నాన్నా?" అని అడిగితే, పక్కనే ఉన్న కోడలు " ఉన్నది ఆయనొక్కరే. లక్షకు పైగా డబ్బు వస్తుంది. ఎంత విచ్చలవిడిగా ఖర్చు పెట్టినా మాక్సిమమ్ నలభై వేలు దాటదు. ఇండియా చీప్ కదా. ఊరకే ఎందుకు డాలర్లు వేస్ట్ చేస్తారు? ఎక్కువ అనిపిస్తే నాకివ్వండి. ఏదైనా మంచి కంపెనీలో షేర్లు కొంటాను.పిల్లలకైనా వస్తుంది" అన్నది వినిపించింది. ఋగ్వేది గారు " నాకెందుకు డబ్బులు! నాకొచ్చేదే చాలా ఉంది. అమెరికాలో చాలా కాస్ట్లీ కదా! నువ్వే వాడుకో " అంటూ సమాధాన పరచారు.

ఆయన రాత్రి రెండు గంటలకు పడుకుని పొద్దున ఎనిమిది గంటలకు నింపాదిగా లేచి ట్రెడ్ మిల్ పైన ఒక గంట సేపు వ్యాయామం చేసి, ఎప్పుడైనా తనే టిపిన్ చేసుకోవడం, లేదా దగ్గరి హోటల్ కెళ్ళి టిఫిన్, కాఫీ ముగిస్తారు. సాయంత్రం ఐదు నుండి ఏడు దాకా మంచి కునుకు తీస్తారు. మిగిలిన సమయమంతా అక్కడ ఇక్కడ తిరుగుతూ, టీవీ చూస్తూ కాలక్షేపం చేస్తారు.

ఫోన్ తీసి హలో అన్నారు. " పెట్టేయ్ నాన్నా ! విడియో కాల్ చేస్తాను" అని కొడుకు ఫోన్ కట్ చేసి విడియో కాల్ చేశాడు. బహుశా క్లినిక్ నుండే అయ్యుంటుంది. ఇంట్లోనే పెద్ద క్లినిక్ పెట్టుకోవడమే కాకుండా ఐదారు నర్సింగ్ హోంలకు విసిటింగ్ డాక్టర్ గా కూడా వెళ్తూ మంచి పేరు సంపాదించుకున్నాడు.

"ఏంటి నాన్నా ! ఇంత తొందరగా పడుకోవడం? ఒంట్లో బావుందా ? అదేంటి మొహం అలా డల్ గా ఉంది. ఏమైనా అనీజిగా అన్పిస్తోందా? ఏం తిన్నావ్? డాక్టర్ విక్రం కు చెప్పనా? చూసి వెళ్తాడు. ఇల్లు ఎవరికైనా అద్దెకిచ్చేసి ఇక్కడికి వచ్చేయమంటే వినవు. ఇక్కడ చూడు. ఇండియన్ పేరెంట్స్ అందరూ కలిసి ఒక సంఘం పెట్టుకుని ఎంత హ్యాపీగా ఉంటారో తెలుసా ! అందులో సగం మంది సీనియర్ సిటిజన్సే. యూనివర్సిటీ ప్రొఫెసర్స్ కి ఇక్కడ మంచి రెస్పెక్ట్ తెల్సా...." అంటూ ఏకధాటిగా మాట్లాడాడు.

కొడుకు ప్రశ్నలకు ఏం జవాబు చెప్పాలో అర్థం కాని ఋగ్వేదిగారు కొద్దిగా తికమక పడ్డారు. వెంటనే సర్దుకుని "అలాంటిదేమీ లేదురా చక్రపాణీ ! ఏదో చదువుకుంటూంటే నిద్ర పట్టింది. నిద్రనుండి లేచిన మనిషి మొహం డల్ గా ఉండడం కామన్ కదా ! నువ్వేం డాక్టరువో అర్థం కాదు నాకు. ఈ రోజు క్లబ్ లో ఓ అరగంట ఎక్కువే స్విమ్మింగ్ చేశాను తెల్సా " అంటూ అబద్ధం ఆడారు.

కానీ ఈ రోజు ఆయన ముఖం అలా ఉండడానికి వేరే కారణం ఉంది.

" ప్లీజ్ టేక్ కేర్ నాన్నా ! రెండు నెలల్లో అక్కడికి వస్తాం కదా. అప్పుడు డిసైడ్ చేద్దాం " అంటూ ఫోన్ కట్ చేశాడు కొడుకు.

ఋగ్వేదిగారు వేణ్ణీళ్ళు అరగ్లాసు తాగి, బాత్రూం కు వెళ్ళొచ్చి ఇంకేం పడుకోవాలి, మళ్ళీ ఫోన్ మ్రోగింది: వాట్సాప్ కాల్: రెండో కొడుకు చక్రవర్తి చేస్తున్నాడు. ఋగ్వేది చూసినప్పుడు చక్రవర్తి తెరపై కనిపించి " అన్నయ్య ఫోన్ చేస్తున్నాడు. నాకూ కంగారు కలిగింది. దేనికీ టెన్షన్ పడద్దు నాన్నా ! ఇక్కడికొచ్చేస్తావేమో చూడు. ఎనిమిది రోజుల్లో అంతా అరేంజ్ చేద్దాం. అన్నయ్య ఇంట్లో ఒక వారం, మా ఇంట్లో మరో వారం గడిపినా చాలు " అన్నాడు.

ఋగ్వేదిగారు కాస్త కోపంగానే " నాకంటే మీ ఇద్దరికీ టెన్షన్ ఎక్కువగా ఉన్నట్టనిపిస్తోంది. నాకు వర్రీ అవడానికేముంది చెప్పు ! ఇక్కడ నా మట్టుకు నేను హాయిగా ఉన్నాను. ఇక ఆ పరదేశానికి వచ్చి మీలాగ పరదేశిని కమ్మంటావా ఏమిటి ! యూ బోత్ డోంట్ వర్రి అబౌట్ మి " అన్నారు.

" నీకు ఎవరు చెప్పాలి నాన్నా! ఫొపెసర్లు అంతే. వాళ్ళు చెప్పిందే జరగాలి. ఇక్కడ కూడా కొంతమంది ప్రొఫెసర్లను చూశాను కదా. ఇగో ఎక్కువ. ఎనివే టేక్ కేర్ నాన్నా! బాయ్" అంటూ ఫోన్ పెట్టేశాడు.

అన్నట్టు చక్రపాణి, చక్రవర్తి ఇద్దరూ కవలలు. ఐదు నిమిషాలు ముందుగా పుట్టి చక్రపాణి అన్నయ్యయ్యాడు. చక్రవర్తి తమ్ముడయ్యాడు. సాధారణంగా అందరు కవలల్లో ఉన్నట్టుగా వీరిద్దరికీ కూడా ఒకే రకమైన బుద్ధి కుశలత, మంచి గుణాలు ఉన్నాయి. ఋగ్వేదిగారు ఇద్దరినీ మంచి క్రమశిక్షణతోనే పెంచారు.

ఆయన ఫోన్ సోఫా పైన పెడుతూ, సోఫా పక్కనునున్న భార్య ఫోటో వైపు చూస్తే ఆమె కిసక్కుమని నవ్వినట్టనిపించింది. ఆయన మళ్ళీ ఆమె ఫోటోను నిశితంగా చూశారు. అనేక సంవత్సరాల పాటు టైం టైంకు ఆయనకు రుచికరమైన టిఫిన్లు, వంట చేస్తూ, చెప్పిన మాట జవదాటని ఆమె ఏ రకమైన ముందు సూచన ఇవ్వకుండా హృదయాఘాతంతో చనిపోయినప్పుడు పిల్లలిద్దరూ అమెరికాలో ఉన్నారు. ఫోన్ చేసి చెప్పినప్పుడు అమెరికా నుండి బయలుదేరి రావడానికి కనీసం నాలుగు రోజులైనా పడుతుందనీ, బాడీని ఏదైనా ఆస్పత్రిలో ఉంచమని అన్నారు.

వాస్తవ వాదియైన ఋగ్వేదిగారు, " చూడండి బాబులూ! బాడీని ఆస్పత్రిలో ఉంచి తినడం, నిద్రపోవడం నా చాత కాదు. కావాలంటే అమ్మను విడియో కాల్ లో చూసుకోండి. దినాలకు రండి " అంటూ ఫోన్ వాట్సాప్ విడియో కాల్ చేసి ఆమెను చూపించారు.

ఇద్దరూ అబ్బాయిలు తమ సంసార సమేతంగా కన్నీరు కార్చారు. తరువాత ఇద్దరూ తమ సంసారాలతో దినాలకు వచ్చి ఒక వారం పాటు ఉన్నారు. ప్రైమరి చదువుతున్న పెద్దాడి కొడుకు " తాతా ! నాన్నమ్మ చనిపోయినరోజు నాకు ఫైనల్ ఎక్జాం జరుగుతూ ఉండింది. మూడు రోజుల క్రితమే ముగిసింది. అందుకే రాలేదు " అంటూ చెప్పి, అందరినీ ఇరుకున పెట్టాడు.

ఋగ్వేదిగారే “ సర్లే ఫర్లేదు. ఇప్పుడు జరిగే నష్టాల కంటే ముందు ముందు కలిగే లాభాలే మనుషులకు ముఖ్యం ఇప్పుడు. దె హ్యావ్ డన్ అ గుడ్ జాబ్” అంటూ సర్దారు. ఇవన్నీ తెలిసిన ఫోటోలోని తన భార్య నవ్వినట్టనిపించి తామూ నవ్వేశారు.

ప్రియమైన పాఠక మహాశయా, మన జీవితంలో ఇలాంటి సన్నివేశాన్నిఅనుభవిస్తున్న వారు మన ప్రొఫెసర్ ఋగ్వేదిగారి మాదిరిగా ప్రపంచంలో లక్షలకొలదీ ఉన్నారు. అలాంటివారిలో మీరు కూడా ఒక్కరు కావచ్చు. నేనూ ఉండొచ్చు. అలా చూస్తే ఋగ్వేదిగారు అంత కలిగిన కుటుంబంలో జన్మించిన వారేమీ కాదు. ఆయన తండ్రి కొబ్బరికాయల కొట్లో లెక్కలు రాసే గుమాస్తాగా ఉండేవారు. కాబట్టి ప్రైమరి స్కూలు చదవడం అయిపోగానే, ఈయన తల్లి ఎంత పోరినా వినకుండా ఇతనిని ఒక మఠంలో వేశారు. అక్కడ తెల్లవారు జామున నాలుగు గంటలకే లేచి, చన్నీళ్ళ స్నానం చేసి సంస్కృత శ్లోకాలు చదవాల్సి ఉండేది. ప్రారంభంలో ఋగ్వేదికి ఎంత కష్టంగా ఉండేదంటే అక్కడ చేరిన ఒక వారంలోనే నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని మూడు సార్లు అనుకుని, ఎందుకో చాలా భయం వేసి మానుకున్నాడు. పది పదిహేను రోజుల తరువాత శరీరం, మనసు రెండూ చాలా తేలికయి అక్కడి పనులకు అలవాటు పడ్డాయి. మఠంలో చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కలాపాలన్నింటిలోను ఋగ్వేది ప్రథముడుగా ఉండడం వలన స్వామీజీ ప్రీతి, విశ్వాస పాత్రుడయ్యాడు. దాంతో ఎంతవరకూ చదివితే అంతవరకూ మఠంవారే ఆ ఖర్చును భరించడానికి తీర్మానించారు. ఫైనల్ ఇయర్ ఎంఎస్సిలో ఉండగా తల్లి ఆస్తమాతో పోయింది. తండ్రి మరొక్కరిని పెళ్ళి చేసుకున్నాడు. దాంతర్వాత ఋగ్వేది ఆ ఇంటికి వెళ్ళలేదు. ఎంఎస్సి కెమిస్ట్రీలో గోల్డ్ మెడల్ సంపాదించిన ఋగ్వేదికి మఠంయొక్క స్వామీజీ శిఫారసుతో యూనివర్సిటీలో అధ్యాపక ఉద్యోగం దొరికింది. ఏక వచన ఋగ్వేది బహువచన ఋగ్వేదిగారుగా మారారు. ఉద్యోగంలో చేరిన రెండు నెలలలోనే మఠం స్వామీజీ నిర్యాణం చెందారు. ఆరోజు అక్కడికి వెళ్ళి కన్నీళ్ళు కార్చి వచ్చిన ఋగ్వేది మళ్ళీ మఠం గడప తొక్కలేదు. తరువాత పిహెచ్ డి చేసి తన వృత్తిలో పేరు గడించారు. పెళ్ళి చేసుకుని ఇద్దరు అబ్బాయిల తండ్రయి, వాళ్ళు కూడా బాగా చదువుకుని జీవితంలో సెటిల్ అయ్యారు. ఈ అన్ని సంఘటనలూ ఇటీవల జరిగినట్టు అనిపించసాగింది ఆయనకు.

ప్రస్తుతానికి ఆర్థికంగా కానీ, సామాజికంగా కానీ ఉన్నత స్థాయిలో ఉన్న ఋగ్వేదిగారికి తనకు తెలియకుండానే ఏదో బలమైన కొరత సతాయిస్తున్నట్టు అనిపించసాగింది. అలా అనిపించినప్పుడల్లా ఆయన యూనివర్సిటిలోని సైకాలజి డిపార్ట్ మెంట్ లో తనతో పాటు చాలా సంవత్సరాలు పని చేసిన ప్రొఫెసర్ నాగరాజ మూర్తిగారి వద్దకు వెళ్ళేవారు. నాగరాజమూర్తిగారు రిటైర్ అయిన తరువాత కాలక్షేపానికని ఒక కౌన్సెలింగ్ సెంటర్ పెట్టుకుని బాగానే సంపాదిస్తున్నారు. రోజుకు నలుగురికి మాత్రమే అపాయింట్ మెంట్ ఇచ్చే నాగరాజ మూర్తిగారు ఒక్కొక్క కౌన్సెలింగ్ కు రెండున్నర వేలు ఛార్జ్ చేస్తారు.

ఈ రెండు సంవత్సరాల క్రితం మొదటి సారి నాగరాజ మూర్తిని కలవడానికి వెళ్ళినప్పుడు ఆయన తీరికగానే కనిపించారు. ఋగ్వేదిగారిని చూసి చాలా సంతోషించడమే కాకుండా ఆయన చాలా సంవత్సరాలనుండి మెంబర్ గా ఉన్న మల్లేశ్వరం క్లబ్ కు తీసుకెళ్ళారు. ఒక పిక్చర్ డ్రాట్ బీరుతో పాటు వెజెటబల్ వడ, ఫిష్ ఫ్రై చెప్పారు.

ఒక గ్లాసు బీరు తాగిన ఋగ్వేదిగారు " మూర్తీ! ఒక విషయం చెప్పితే నీకు ఆశ్చర్యం కలగవచ్చు. నాకెందుకో ముందు నుండీ భూమి తిరుగుతోందని నమ్మ బుద్ధి కావడం లేదు. ఎందుకంటావ్ ?" అన్నారు.

నాగరాజ మూర్తిగారు బీరు ముగించి " ఏమిటయ్యా నువ్వనేది ? ముప్పై ఐదు సంవత్సరాలు కెమిస్ట్రీ పాఠాలు చెప్పిన నువ్వు, సైన్సే చదవని సైకాలజి ప్రొఫెసర్ ను ఎలాంటి ప్రశ్న అడుగుతున్నావు? తమాషా చేస్తున్నావా లేదా ఒక గ్లాసు బీరుకే చిత్తయిపోయావా " అంటూ ఆయనే గ్లాసులను బీరుతో నింపారు.

" మూర్తీ! నేను లిటరల్లీ సీరియస్. చాలా రోజుల నుండి నన్ను ఈ సమస్య పీడిస్తోంది" అన్నారు ఋగ్వేది గంభీరంగా.

నాగరాజ మూర్తికి ఇదేదో తేడాగా ఉన్న  విషయం అనిపించింది. " ఋగ్వేదీ! నీకు ఇలా అనిపించడానికి కారణం నీ పేరేనేమో అనిపిస్తోంది నాకు. మన పూర్వీకులు కూడా ఇలానే నమ్మేవారు. సూర్యుడు, నక్షత్రాలు రోజూ పుట్టి మాయమవుతాయి అనుకునేవారు. భూమి తిరుగుతోందా లేదా సూర్యుడు తిరుగుతున్నాడా అనేది మనకు అక్కర్లేదు. సృష్టి, ప్రతిసృష్టి జరిగే పుణ్యగ్రంహం పైన మనం ఉన్నామన్నది ముఖ్యం. నువ్వు కెమిస్ట్రి ప్రొఫెసర్ వి. నీళ్ళలో ఆక్సిజన్, హైడ్రోజన్ ఉన్నాయని నువ్వు చెప్తావు. కానీ ఆ రెండూ మనకు కనిపించవు. అదేం పెద్ద విషయం కాదు. పెద్ద విషయమేమిటంటే మనం బ్రతకడానికి నీళ్ళు అవసరమన్నది. మనం దాన్ని త్రాగడం వలన మనకు తృప్తి కలుగుతోంది అన్నదే ముఖ్యం. రేపో, ఎల్లుండో రా. ఒక మాత్ర రాసిస్తాను. ప్రతి రోజూ రాత్రి తీసుకుని పడుకో. మళ్ళీ ఇలాంటి అనుమానాలు రావు " అన్నారు.

అలాగే మరుసటి రోజు ఋగ్వేది వెళ్ళినప్పుడు మాత్ర రాసిచ్చారు. తనకు అవసరం అనుకున్నప్పుడు మాత్రమే ఆ మాత్ర తీసుకునేవారు ఋగ్వేది. పాఠక మిత్రులారా, ఋగ్వేదిగారి గురించి కొన్ని వివారాల్ని చెప్పడం నా ధర్మం అని చెప్పాను. ఎందుకంటే, కథా రచయిత అనేవాదు కథలోని పాత్రలకు, అవి పాసిటివ్ వి అయినా నెగటివ్ వి అయినా ఆ పాత్రలకు ప్రాణం పోయకపోతే కథకు ఒక ఘనత సులభంగా లభించదు. ఇప్పుడు మనం ఋగ్వేదిగారున్న చోటికి వెళ్దాం. కథ ఏ దిశలో వెళ్తుందో ఎవరికి తెలుసు? కొన్ని సమయాలలో అది రచయిత మాటలు వినదు. రచయితలను తమకు నచ్చినట్టు రాయడానికి కూడా ప్రేరేపిస్తాయి. ఋగ్వేదిగారు బహుశా అలాంటి పాత్రేమో అని నా అనుమానం.

విడియో కాల్ లో పిల్లలిద్దరితో మాట్లాడాక ఋగ్వేదిగారికి నిద్ర పట్టలేదు. క్షణకాలం పిల్లలతో మాట్లాడింది నిజమా కాదా అనిపించింది. పిల్లల ముఖాలను గుర్తుకు తెచ్చుకున్నారు. రాలేదు. లైట్ ఆన్ చేసి హాల్ లోకి వచ్చారు. పిల్లలు అమెరికా వెళ్ళిన మూడవ సంవత్సరంలో భార్యతో కలిసి ఋగ్వేది అమెరికాకు వెళ్ళి ఒక నెలపాటు వాళ్ల ఇళ్ళలో ఉండి వచ్చారు. అప్పుడు వారు తమను తీసుకుని అనేక స్థలాలకు తిప్పారు. అక్కడ గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. వాటిలో ముఖ్యంగా లిబర్టి స్ట్యాచూ, నయాగరా జలపాతాల వద్ద తీసుకున్న ఫోటోలను పెద్దదిగా చేయించి, ల్యామినేట్ చేయించి హాల్లో గోడకు వేలాడ తీశారు. ఋగ్వేదిగారు ఆ రాత్రి రెండు గంటల సమయంలొ చాలా దగ్గరకు వెళ్ళి ఫోటోలను చూశారు. శరీరాలు పెరిగినట్లే, మనసులు కూడా మారతాయి.... ఏదో ఒక మహత్తర విషయాన్ని కనిపెట్టిన వాడి మాదిరిగా ఋగ్వేదిగారు నవ్వుకుని మళ్ళీ వచ్చిపడుకున్నారు. ఫోటోలో ఉన్నవాళ్ళు వంద శాతం తమ పిల్లలే అయినా, విడియో కాల్ లో మాట్లాడినవాళ్ళు మాత్రం తన పిల్లలు కారేమో అనుకున్నారు. ఈ నాలుగు రోజుల్లో జరిగిన కొన్ని సంఘటనలు వద్దనుకున్నా మనోపటలం పైన చోటు చేసుకోసాగాయి.

క్రితం ఆదివారం నుండి ఋగ్వేదిగారు రోజూ క్లబ్ కు వెళ్తున్నారు. రిటైర్ అయిన సంవత్సరంలోనే పిల్లలిద్దరూ ఇక్కడికి వచ్చినప్పుడు రెండు క్లబ్ లలో సభ్యుడిగా చేర్చారు. ఋగ్వేదిగారు ఒక వారం ఒక క్లబ్ కు వెళ్తే, ఇంకో వారం మరోక్లబ్ కు వెళ్ళేవారు. రెండూ క్లబ్ లలోని బిజినెస్ మేన్, రాజకీయ వ్యక్తులు, ఐఎ ఎస్ ఆఫీసర్లు స్నేహితులయ్యారు. క్లాస్ మేట్లు, కొలీగ్స్ కూడా అప్పుడప్పుడు కలిసేవారు. రెండూ క్లబ్ లలో ఆయనకు ఒక కామన్ సంగతి కంట పడింది. అదేమిటంటే సుమారు ఇరవై వృద్ధ జంటలు మధ్యాహ్నం ఒంటిగంటకు క్లబ్ కు వచ్చి భోంచేసి సాయంత్రం దాకా అక్కడే గడిపి, రాత్రి ఎనిమిదింటికి మళ్ళీ భోజనం చేసి ఇళ్ళకు వెళ్తారు. తన లాంటి ఒంటరి వ్యక్తులు కూడా వస్తారు. వాళ్ళ పిల్లలు విదేశాల్లో ఉండడమే ఈ దినచర్యకు కారణం. కానీ ఋగ్వేది గారికి ఆ సమస్య లేదు. అనేక సంవత్సరాలు మఠంలొ పెరిగినందువల్ల అన్నిరకాల వంటలు నేర్చుకోవడమే కాకుండా అరభై ఆరవ వయసులో కూడా గట్టిగానే ఉన్నారు. ఇప్పుడు కూడా ఆయన చలికాలంలోను చన్నీళ్ల స్నానమే చేస్తారు. తమ ఈ స్థితికి కారణమైన ఆ మఠాన్నీ, స్వామీజీని అప్పుడప్పుడు తలచుకుంటారు. కానీ ఆ మఠానికి ఇన్ని సంవత్సరాలలోనూ ఒక్క పైసా కూడా చందా ఇవ్వలేదు. అలా ఆయనకు అనిపించలేదేమో ఎవరికి తెలుసు ?

అది సరే, పోయిన ఆదివారం పన్నెండున్నరకు క్లబ్బుకు వెళ్ళినప్పుడు తన క్లాస్మేట్ ప్రజ్ఞా జోశి కనిపించింది. ఆమె రిటైర్డ్ ఐఎ ఎస్ ఆఫీసర్. ఆమె రిటైరవడానికి ఇంకా ఐదు సంవత్సరాలు ఉందనగా రాష్ట్ర ప్రభుత్వంలోని ఏదో డిపార్ట్ మెంట్ లో అధికారిగా ఉన్న ఆమె భర్త గుండెపోటుతో మరణించాడు. కొందరు ప్రజ్ఞా జోశి టార్చర్ వలన ఆయన చనిపోయారని, అది హత్య అని మాట్లాడుకున్నారు. ఆయన తరుపున వాళ్ళు పోలీస్ కంప్లెయింట్

ఇచ్చారు కూడా. ప్రజ్ఞ జోశి పెద్ద పోస్టులో ఉండడం వలన పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు దాఖలు చేసుకోలేదు. బిఎస్సిలో ఋగ్వేది క్లాస్మేటయిన ప్రజ్ఞా జోశి నేరుగా ఐఎ ఎస్ పరీక్షలు తీసుకుంది. ఇద్దరూ అప్పుడప్పుడు టచ్ లో ఉన్నారు కూడా.

ఆయన్ను చూసిన ప్రజ్ఞా జోశి బాబ్ కట్ చేసుకున్న తన జుట్టును వెనిక్కి తోసుకుంటూ "ఏంటోయ్ ఋగ్వేదీ ! చాల రోజులైంది నిన్ను చూసి. బాగున్నావా? రా. కలిసి భోంచేద్దాం" అని పిలిచింది.

ఋగ్వేది ఆమె టేబల్ వద్దకు వెళ్ళి కూర్చున్నారు. ఆమె రెండు పెగ్ లు జిన్ చెప్పింది. ఋగ్వేది మూడు పెగ్గులు రెడ్ వైన్ చెప్పారు. రెండు గుక్కలు తాగిన ఆమె" మన జూనియర్ ముకుంద రావ్ తెలుసు కదా ! అదే బ్యాడ్మింటన్ ఛాంపియన్. డిఆర్ డిఒ లో సైంటిస్ట్ గా ఉండేవాడు. నాకు చాలా క్లోజ్. మొన్నరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పిరికి వెధవ " అంటూ మాటలు ప్రారంభించింది.

" ఆ తెలుసు. ఏమయిందట" వైన్ సిప్ చేస్తూ అడిగారు ఋగ్వేది. ఆమె రెండు గుక్కలు తాగి " అరే ! కారణం వింటే నవ్వి పోతావు నువ్వు. ఆయన ఇంటికి ఒక పాతికేళ్ళామె పని చెయ్యడానికి వచ్చేదట. ముకుంద రావ్ భార్య కోడలు డెలివరి అని ఆరు నెలలు ఆస్ట్రేలియాకు వెళ్ళిందట. ఈయన ఆ ఆరునెలలూ దిల్దార్ గా ఉన్నారట. కావలిస్తే ఇంకో రెండు నెలలు ఉండి రమ్మన్నారట. కానీ ఆమెకు విసుగేసి ఒక వారం క్రితం తిరిగి వచారట. మరుసటి రోజు పనామె ఇంటికి వచ్చినప్పుడు వాష్ బేసిన్లో వాంతి చేసుకుందట. తను వెళ్ళేటప్పుడు సన్నగా ఉన్నమనిషి ఇప్పుడేమో నున్నగా తయారయ్యిందట. పొట్ట ముందుకు వచ్చి కనిపించిందట. అడిగితే కడుపుతో ఉన్నానన్నదట. ఎప్పుడు పెళ్ళి చేసుకున్నావు అని అడిగితే " పెళ్ళి చేసుకోలేదు అమ్మగారూ ! మీరు పోయినప్పటి నుండి అయ్యగారే నాకు ధైర్యం చెప్పి ఇలా చేశారు. ఊళ్ళోని రెండెకరాల పొలం రాసిస్తారట. కడుపు తీయించొద్దు. పర్మనెంటుగా నాతోనే ఉండేట్టు చూస్తాను అన్నారు" అందట. అంతే. ఒక వారం నుండి డిప్రెషన్ లోకి వెళ్ళిన రావ్ నిన్న తన భార్య చీరతోనే ఉరేసుకున్నాడట" ప్రజ్ఞా జోశి రసవత్తరంగా ఒక సినిమా కథలాగా చెప్పింది.

ఋగ్వేది గుండె లయ తప్పింది. తనే బిల్ పే చేస్తూ ప్రజ్ఞా జోశి " సిల్లి అనిపించదా. మనిషి దేహాలన్నీ జీవకణాలతోనే అయ్యాయి అని ఆ మనిషికి తెలియదా. భార్యనే కన్విన్స్ చేసుంటే అయిపోయేది. లేదా డబ్బు ఖర్చు పెట్టి అబార్షన్ చేయించినా పోయేది. నన్నే తీసుకో. ఒక ఐదారుగురు సీనియర్స్ తో ఏవేవో పనులకోసం పడుకునుంటాను. అఫ్ కోర్స్, ఎంజాయ్ కూడా చేశాను.ఇప్పుడు ఎంజాయ్ చేయడానికి ఏముంది ? పుట్టేటప్పుడు ఒంటరిగానే పుడతాం, చచ్చేటప్పుడు ఒంటరిగానే పోతాం. మధ్యలో ఇంకో శరీరంతో సుఖపడితే వాట్ మ్యాటర్స్?" అంటూ విశాలంగా నోరు తెరిచింది.

పళ్ళు తళుక్కున మెరిసాయి. బాత్రూం లో పడి ముందరి మూడు పళ్ళు రాలినప్పుడు ఆమె బంగారు పళ్ళు కట్టించుకుంది. ఆమె మాటలో ఒక రకమైన లాజిక్ ఉందనిపించింది. అలాగే ఒక సిస్టమ్ కు కంట్రోల్ లేకపోతే ఎలా కూలిపోతుంది అనే నిజం కూడా తొంగి చూసింది.

ఆ రోజు రాత్రి ముకుంద రావ్ చాలా సతాయించాడు. మనిషి దేహంలో ఉన్నది డెబ్బై శాతం నీళ్ళు ! భూమిపైన ప్రవహించే నీరు పరస్పరం చేరి నది అవుతుంది, సరోవరమవుతుంది, సముద్రమూ అవుతుంది. అలాగే ఏ శరీరం ఏ శరీరంతో కలిసినా, అందులో పవిత్రత, అపవిత్రత ఎక్కడ ఉంది? తృప్తి మాత్రమే ముఖ్యం. ఏ రసాయనిక పదార్థమైనా ఇంకో రసాయనిక పదార్థంతో కలిస్తే ఏం... చివరి రిజల్టే కదా ముఖ్యం. ప్రాణిజగత్తులో మనుషులకే పరిమితులున్నది. అలాంటి పరిమితులను దాటినప్పుడు మనిషి అపరిమిత ఆనందాన్ని పొందడమెందుకు అనే ప్రశ్న ఋగ్వేదిగారికి అనిపించిన ఆ క్షణం ఇప్పటికీ ఆయనలో పులకలు రేపుతుంది తలచుకుంటే. ఆయన తన ఉద్యోగ అవధిలో పద్ధెనిమిది విద్యార్థులకు గైడ్ గా ఉన్నారు. వారంతా ఇప్పుడు మంచి పోస్ట్ లలో ఉన్నారు. అలా గైడ్ గా ఉన్న ఎవరి వద్ద నుండి కూడా ఆయన ఎలాంటి ప్రతిఫలం ఆశించలేదు, నిధి అలెగ్జాండర్ మినహా ! ఆమెకు ఆయన గైడ్ అయ్యింది ఆయన యాభై ఐదవ సంవత్సరంలో. ఎంఎస్సిలోనూ ఆమె తన విద్యార్థినిగా ఉండింది. ఎం ఎస్సి ముగించి, ఒక సంవత్సరం ఎక్కడో ఉద్యోగం చేసొచ్చి, పెహెచ్ డి కి చేరి, తనను గైడ్ గా ఉండమని రిక్వెస్ట్ చేసినప్పుడు ఋగ్వేదిగారు ఒప్పుకున్నారు.

“ ఏదో ఒక అంతర్జాతీయ ఫార్మస్యూటికల్ కంపెనీలో పెద్ద ప్రాజెక్ట్ దొరకబోతోంది. ఒక్క సంవత్సరంలోనే పెహెచ్ డి తీసుకుని వస్తాను అని మాట ఇచ్చి వచ్చాను సార్. ఇట్స్ మై ఛాలెంజ్ ఆల్సో, ప్లీస్ హెల్ప్ మి” అంటూ వేడుకుంది.

“ తప్పకుండా సహాయపడతాను. కానీ  కాల పరిమితి గురించి నేను ఏమీ చెప్పలేను. నీ ఎనర్జి, ఇన్వాల్వ్ మెంట్ చాలా ముఖ్యం” అన్నరాయన. సిలబస్ గురించి, విషయ నిరూపణ గురించి, రెపరెన్స్ బుక్స్ గురించి తన చేంబర్ లోనే చాలా రోజులు లెక్చర్ ఇచ్చారు. ఆమె కళ్ళల్లో ఎంతటివారినైనా ఆకర్షించే మెరుపు. ఒక్కొక్కసారి ఋగ్వేదిగారు విచలితులయ్యేవారు. ఒక సారి ఇంటికి భోజనానికి పిలిచింది. ఋగ్వేది తను నాన్ వెజ్ తిననని తమాషా చేశారు. కానీ ఆయనకు మఠంలో ఉండి చదువుకుంటున్నప్పుడే మాంసాహారం గురించి కుతూహలం ఉండింది. ఎం ఎస్సికి యూనివర్సిటీకి చేరిన తరువాత చికన్ తిన్నారు. తరువాత ఉద్యోగంలో చేరాక చికన్, ఫిష్ తినడం నేర్చుకున్నారు. అలాగే పరిమితంగా రెగులర్ గా మద్యం కూడా తాగడం నేర్చుకున్నారు. ఎవరైనా “ ప్రొఫెసర్ ! మీరు తాగుతారా” అని ఆశ్చర్యం ప్రకటిస్తే “ అది కూడా ఒక కెమికల్ కదండీ! కెమికల్స్ లేకుండా ప్రాణులు బ్రతుకుతాయా ? అలాంటి కెమికల్స్ అవసరం ప్రొఫెసర్స్ కే కదా” అంటూ జోక్ చేసేవారు.ఆయన భార్యకు ఈయన బయట మాంసం తింటాడని సందేహం ఉండింది. కానీ ఆయనను ఎప్పుడూ ప్రశ్నించలేదు. ఇప్పుడయితే పిల్లల ఇంట్లో రోజూ నాన్ వెజ్జే. బీఫ్ కూడా చేస్తారట.

ఆ రోజు నాన్ వెజ్ తినను అన్నదానికి నిధి మొహం నిండా నవ్వు నింపుకుంటూ “ నాకు తెలుసు రండి సార్. కెమిస్ట్రీ ప్రొఫెసర్ నాన్ వెజ్ తినరు అంటే నేను నమ్ముతానా? వాట్ అ జోక్ సర్. అమెరికాలో మీ పిల్లలు టన్నుల కొలదీ నాన్ వెజ్ తినేది నాకు తెలియదనుకున్నారా? ఇంతకీ ప్రాణి ప్రపంచమంతా మాంసం తోనే కదా సార్ సృష్టి జరిగింది. మేడం గారిని తీసుకు రాకండి. మీరొక్కరే రండి” అన్నప్పుడు అదెలాంటిదో సమ్మోహనానికి లోనైనట్టు ఒప్పుకున్నారు ఋగ్వేదిగారు.

ఒక వర్కింగ్ డే మధ్యాహ్నం లంచ్ కి వెళ్లాలి అని డిసైడ్ అయింది. ఆ రోజు నిధి అలెక్జాండర్ ఇంట్లో ఒక్కతే ఉంది. “రండి సార్. వంట చేసిపెట్టినాక ఏదో అర్జెంట్ మెసేజ్ వస్తే అమ్మా నాన్న దగ్గరి బంధువులను చూడడానికి ఆస్పత్రికి వెళ్ళారు” అంటూ స్వాగతింతించింది. కొద్దిగా పారదర్శక దుస్తుల్లోనే ఉన్న ఆమె ఫ్రెంచ్ మస్క్ స్ప్రేతో ఘుమఘుమలాడుతోంది. ఋగ్వేదిగారికి వడ్డించి, తానూ వడ్డించుకుని జతగానే భోంచేసింది. వంట అద్భుతంగా ఉండింది. అలా కూర్చున్నప్పుడు ఆమెను దగ్గరగా చూస్తుండడం వల్ల ఆమె అద్భుత సౌందర్యం ఆయన కళ్ళనీ మనసునీ ఆవరించుకుని విచలితుడ్నిచేసింది. భోజనం అయి కూర్చోగానే నిధి నాన్న నుండి తాము రావడం సాయంత్రం ఐదున్నర అవుతుందని, అప్పటిదాకా ప్రొఫెసర్ ను ఇంట్లో ఆపమని ఫోన్ వచ్చింది. నిధ ఆయనకు చెప్పింది. ఇంకోసారి వస్తానని చెప్పినా ఋగ్వేది మనసు ఉండమని చెప్తోంది. నిధి ఆయన్ను ఉండిపొమ్మని కళ్ళతోనే అర్థించింది. ఆయన ఒప్పుకున్నారు. ఒకే సోఫాలో ఇద్దరూ కూర్చున్నారు. ఋగ్వేది తను ఏం చేస్తున్నానన్నది మరచి పోయి నిధిని హత్తుకుని ముద్దుపెట్టుకున్నారు. నిధి బదులుగా ఆయనను ఇంకా గట్టిగా అదుముకుని బెడ్రూంలోకి తీసుకెళ్ళింది. తరువాత రెండు గంటల పాటు ఋగ్వేదిగారు నిధినుండి సుఖం పొందారు. ఇలా నెలకోసారి నిధి తలిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఋగ్వేదిగారిని ఇంటికి పిలిపించుకుని సుఖాన్నిచ్చింది. ఒక సంవత్సరంలోనే పిహెచ్ డి తీసుకుని, రెండు నెలల్లో విదేశాలకు వెళ్ళిపోయింది. తరువాత ఆమెనుండి ఫోన్ కానీ, మెసేజ్ కానీ రాలేదు. ప్రజ్ఞ జోశి మాటలనుంచి వెనుకటి ఇలాంటి మధురమైన జ్ఞాపకానికి వెళ్ళిన ఋగ్వేదిగారికి తరువాత ఆ జ్ఞాపకం ఎందుకో అసౌకర్యం అనిపించి రాత్రి చాలా సేపటిదాకా నిద్ర రాకుండా చేసింది.

మరుసటి రోజు సోమవారం పొద్దున తొమ్మిది గంటలదాకా నిద్రపోయిన ఋగ్వేదిగారు రెడి అయ్యి, హోటల్ లో టిపిన్ చేసి డాక్టర్ నాగరాజ మూర్తిగారు కౌన్సెలింగ్ సెంటర్ కి వెళ్ళారు. అక్కడ ఆయన తన ట్రీట్మెంట్ రూంలో ఎవరికీ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. బయట కూర్చున్న అమ్మాయి ఇప్పుడే ప్రారంభం అయ్యిందనీ, కనీసం గంటైనా పడుతుందని చెప్పి, ఆయన్ను కూర్చోబెట్టి ఆయన ముందు నాల్గైదు వార్తా పత్రికలను పెట్టి, బ్లాక్ టీ చేసిచ్చింది. ఆయన నిదానంగా టీ తాగుతూ అవి చూస్తూ కూర్చున్నారు. ఒక పత్రికలోని వార్త ఆయనను కలవర పరచింది. వెంకటేశ్ యాదవ్ అనే, ఆయన పాత విద్యార్థి ఆత్మహత్యకుపాల్పడి చావుబ్రతుకుల మధ్య ఆస్పత్రిలో ఉన్నాడు. వెంకటేశ్ యాదవ్

రాజధానిలోని ప్రఖ్యాత ఉద్యమి. ఈ పది పన్నెండు సంవత్సరాలో అనేక వెంచర్లు చేసి రియల్ ఎస్టేట్ లో పెద్ద పేరు తెచ్చుకున్నాడు. ఋగ్వేదిగారిని కలిసి తాను కట్టిన అనేక విల్లాల గురించి చెప్పున్నాడు. లెక్కలేనన్ని అపార్ట్ మెంటులను కట్టించి రాజకీయ నాయకులతో పార్ట్ నర్ గా అయ్యాడు. అతడి విజయం గురించి, వ్యవహారాల గురించి నెలకొకసారైనా పత్రికలలో వచ్చేవి. రాజకీయ నాయకుల అపారమైన నల్ల ధనం ఇతని వద్ద ఉంది అని చెప్పుకునేవారు. ఏ డిపార్ట్ మెంట్ అధికారినైనా ఎలాంటి వాడైనా వెంకటేశ్ యాదవ్ బుట్టలోవేసుకునేవాడు. చిన్న పల్లె నుండి వచ్చిన యాదవ్ ఈ స్థాయి ఎదిగింది చూసి ఋగ్వేది ఆశ్చర్య పోయేవారు. తన పరిచయస్తులకు యాదవ్ నుండి తక్కువ ధరలకు సైటు,ఫ్లాటులను ఇప్పించారు అప్పుడప్పుడు యాదవ్

" మీరొక విల్లా తీసుకోండి సార్. డబ్బులేం వద్దు. గురుదక్షిణ అనుకోండి" అంటూ బలవంతం చేసినా

ఈయన ' నాకెందుకయ్యా ! ఈ మహల్ ను మెంటెన్ చేయడమే కష్టంగా ఉంది. నా పిల్లలు పర్మనెంట్ గా విదేశాల్లోనే ఉంటారు" అంటూ నిరాకరించారు. ఇంతకూ వెంకటేశ్ యాదవ్ ఋగ్వేదిగారికి అంత నిష్టాపరుడవడానికి కారణం యూనివర్సిటిలో జరిగిన ఒక సంఘటన. యాదవ్ తన విద్యార్థి దశలో లీడరే కాకుండా రాష్ట్ర స్థాయి సంస్థకు నిర్వహకుడుగా కూడా ఉన్నాడు. ఒకసారి అతడి విరోధులు ఆయుధాలతో దాడి చేసినప్పుడు ఋగ్వేదిగారు అతడిని కాపాడడమే కాకుండా పోలీస్ దాకా తీసుకెళ్ళి వాళ్ళతో సంధి కుదిర్చారు. ఆరోజు కొద్దిగా ఏమరపాటు జరిగినా వెంకటేశ్ యాదవ్ తన ప్రాణాలు పోగొట్టుకునే వాడు.

భుజం పైన ఎవరో చెయ్యి పెట్టినట్టయి తల ఎత్తి చూశారు ఋగ్వేది. డాక్టర్ నాగరాజ మూర్తి కనిపించారు. "రావయ్యా ప్రొఫెసర్ ! ఎంత సేపయ్యింది ఏం కథ?" అంటూ ప్రశ్నిస్తూ ట్రీట్మెంట్ రూముకు తీసుకెళ్ళారు.

" చాలా బిజీగా ఉన్నట్టుంది" అన్న ఋగ్వేది మాటకు

" ఈ రోజు సోమవారం కదా ! మామూలువి నాలుగు అపాయింట్ మెంట్స్ ఉన్నాయి. పన్నెండు దాకా తీరికే. త్రాగడానికి ఏమైనా చెప్పేదా? మొహంలో ఏదో గాభరా కన్పిస్తోంది. రాత్రి సరిగ్గా నిద్రపోయినట్లు లేదు" అంటూ కనుక్కున్నారు. " ఇప్పుడేం అక్కర్లేదు. మీ రిసెప్షనిస్ట్ మంచి బ్లాక్ టీ ఇచ్చిందిలే" అంటూ "మనిషి శరీరంలోని మనసు ఘనరూపంలోనూ ఉండదంట, ద్రవ రూపంలోనూ ఉండదంట, వాయు రూపంలోనూ ఉండదంట. మరింకే రూపంలో ఉంటుంది? అది మన మెదడులో మాత్రమే వేర్లు విడిచి ఉంటుందా లేదా దేహంలోని అన్ని భాగాల్లోనూ చలిస్తూ ఉంటుందా?" ఋగ్వేదిగారి మాటల్లో అదెలాంటిదో ఆతురత కనిపించింది.

నాగరాజ రావ్ గారు " నీ ఇద్దరు పిల్లల్లో ఎవర్నైనా ఒక్కర్ని ఇక్కడికి పిలిపించవయ్యా! అమెరికాలో ఏమైనా ముత్యాలు, రత్నాలు తింటున్నారా? నీకు ఇలాంటి సందేహాలు రానే రావు. " ఆయన మాటల్లో గంభీరత కనిపించింది.

" మూర్తీ! నువ్వన్న మాటలకీ, నా మాటలకీ సంబంధం ఏమైనా ఉందనిపిస్తుందా నీకు? ఆర్ యు నాట్ ఫూలింగ్ మి?" ఆయన మాటల్లోనూ గంభీరత కనిపించింది.

" ఉండనీయవయ్యా ప్రొఫెసర్ ! ఇప్పటివరకూ మనిషి మనసును ఎవరూ ఖచ్చితంగా నిర్వచించలేదు. సైన్సు దక్కించుకున్న జ్ఞానం ప్రకారం మనిషి మెదడు రెండు నుండి రెండున్నర శాతం మాత్రమే మనం ఉపయోగిస్తున్నాం. ప్రపంచంలోని అత్యంత మేధావులని అనిపించుకున్నవారి మెదడు మూడు శాతం మాత్రమే ఉపయోగ పడుతుందట. ప్రపంచపు అన్ని సిద్ధాంతాలు, కల్పనల పైన వాటి పరీక్షల అధారాల పైన కట్టినవే. సైకాలజి సిద్ధంతాలూ అంతే. అది సరే. లండన్ నుండి నా ఫ్రెండ్ మృత్యుంజయ ఈ రోజు పొద్దున ఎనిమిది గంటలకు ఫోన్ చేశాడు. నీ పిహెచ్ డి స్టూడెంట్ నిధి అలెగ్జాండర్ గురించి చాలా చెప్పాడు" అంటున్న మూర్తి మాటలను కట్ చేస్తూ

" అరె మూర్తీ ! ఎంత కాకతాళీయమో చూడు. చాలా సంవత్సరాల తర్వాత నిన్ననే ఏదో విషయానికి ఆమెను తలచుకున్నాను. రాత్రి కూడా గుర్తుకు వచ్చింది. లండన్ లో ఉందటనా? పిహెచ్ డి వచ్చాక ఆమె అడ్రస్, ఫోన్ నంబర్ ఏదీ ఇవ్వలేదు. చాలా అంబిషస్. ఎలా ఉందట ఇప్పుడు ?" కుతూహలంగా అడిగారు ఋగ్వేది.

" నువ్వు చాలా క్లోజ్ గా ఉండేవాడివి కదా. యూనివర్సిటీలో మీ ఇద్దరిగురించి ఏదేదోమాట్లాడేవారు. నిజమేనా?" నాగరాజ మూర్తిగారి మాటలకు కొద్దిగా కంగారు పడిన ఋగ్వేది

" ఏం చెప్పాలో అర్థం కావడం లేదు మూర్తీ ! నువ్వు చెప్పింది నిజమే. అందుకే నేను అడుగుతోంది, మనసు అనేది ఎలా ఉంటుంది, అది దేహంలోని అన్నిభాగాలకూ సంచరిస్తుందా అని" ఋగ్వేది మాటలు కాస్త మెత్తబడ్డాయి.

అంతలో రిసెప్షనిస్ట్ ముక్కలు చేసిన మామిడి పండు ప్లేటును తెచ్చిపెట్టింది. " మా తోటలోని పండినవయ్యా. ఆర్గానిక్ పండు. కెమికల్ ఫ్రీ. తీసుకో ప్రొఫెసర్" అంటూ ఒక ముక్కను నోట్లో పెట్టుకున్నారు నాగరాజ మూర్తి.

ఋగ్వేదిగారు కూడా ఒక ముక్కను నోట్లో వేసుకుని " చాలా తియ్యగా ఉందయ్యా మూర్తీ ! మొత్తానికి కెమిస్ట్రీ ప్రొఫెసర్ కు కెమికల్ ఫ్రీ పండు తినిపిస్తున్నావు. కొన్నికెమికల్స్ ప్రాణులను బ్రతికిస్తే, కొన్ని చంపుతాయి. అది సరే ! నీ మిత్రుడు మృత్యుంజయ నిధి గురించి ఇంకేం చెప్పాడు?" ఎప్పుడో సుఖాన్నిచ్చిన శరీరం గురించిన కుతూహలం ! శరీరంనుండే మనసులు సుఖాన్ని, సంతృప్తిని పొందేది, వైస్ వర్సా!

" నిన్న సాయంత్రం నాలుగుగంటలకు ఉరేసుకుని ఆత్యహత్య చేసుకుందంట. పోలీసులు ఆమె అమెరికా మొగుడ్ని అరెస్ట్ చేశారంట. తలిదండ్రులు, అన్నయ్య అక్కడే ఉండడం వలన ఈ రోజు పన్నెండు గంటలకు లండన్లోనే

అంత్యక్రియలు కానిచ్చేశారట. ఫార్మస్యూటికల్ కంపెనీ ఓపన్ చేసి బాగా బిజినెస్ చేసేదట. నువ్వు ఈ రోజు ఇక్కడికి వచ్చావని ఈ మ్యాటర్ చెప్పాను. లేకపోతే మరచిపోయేవాణ్ణి" అంటూ చివరి మామిడి ముక్కను నోట్లో వేసుకున్నారు.

ఒక్క క్షణం ఉలిక్కిపడిన ఋగ్వేదిగారు " ఆత్మహత్య చేసుకోవాలంటే ఎన్ని మార్గాలున్నా అదేమిటో అనాది కాలం నుండి ఇప్పటిదాకా ప్రపంచంలోని ప్రజలంతా ఉరేసుకుంటారు ఎందుకో" అంటూ సర్దుకున్నారు. " ఆత్మహత్య ఎప్పుడూ అకస్మాత్తుగా నిర్ణయం కాదు. ఆత్మహత్య చేసుకునే మనిషి ముందుగా ప్రిపరేషన్ చేసుకునుంటాడు. అలా రెడీ అయిన మనిషి ఉరేసుకుంటాడు. ఉరేసుకున్న మనిషి బ్రతికి బయటపడడం తక్కువ. నిద్ర మాత్రలు, విషం తీసుకున్నవారిని బ్రతికించే అవకాశాలు కొంతమట్టుకైనా ఉంటాయి. "

డాక్టర్ నాగరాజ మూర్తిగారి విశ్లేషణ విని ఋగ్వేది ఆశ్చర్యపడ్డారు. " ఈ వెంకటేశ్ ఒక అవివేకి. బెడిసికొట్టింది "

ఋగ్వేది తమలో తాము గొణుక్కున్నారు. " ఎవరయ్యా ఈ వెంకటేశ్ యాదవ్?" అని మూర్తి అడిగితే ఋగ్వేది యూనివర్సిటీ రోజుల గురించి చెప్పారు.

" అం. గుర్తుకొచ్చింది. వాడికేమయ్యింది? కొన్ని రోజులు సినిమా తీస్తానని ఎవర్నో హీరోయిన్ ని వెంటేసుకుని తిరిగేవాడని వినిపించింది. ఆడపిల్లల్ని అడ్డు పెట్టుకుని సర్కార్ పనులు ఏవైనా చేయించేవాడట. నా పేషెంట్ ఒకాయన క్లోజ్ ఫ్రెండ్. వాడి పరాక్రమాల గురించి చెప్తూ, తను ఆ స్థాయికి ఎదగలేదు అని బాధ పడేవాడు. నా ఆ పేషెంట్ ముఖ్య వ్యాధే అది. ఇప్పుడే దారిలోకి వస్తునాడు లే " అన్నారు.

ఇద్దరి సంభాషణ ముగిసిందనిపించి,నాగరాజ మూర్తి రెస్ట్ రూం వైపు నడిస్తే, ఋగ్వేది బయటికి వచ్చి, కారు వైపు నడిచారు.

మధ్యాహ్నం రెండు గంటలయ్యేటప్పటికి క్లబ్ కు వెళ్ళి భోజనం ముగించేద్దామనుకుని కారు అటు తిప్పారు ఋగ్వేదిగారు. ఒకసారి ఆస్పత్రికి వెళ్ళి యాదవ్ ను పలకరిద్దామా అన్న అలోచన వచ్చి, కారును పక్కగా ఆపి అతడికి ఫోన్ చేశారు. చాల సేపు రింగయిన తర్వాత ఎవరిదో మగ గొంతు వినిపించింది. ఋగ్వేదిగారు తమ పరిచయాన్ని చేసుకున్నారు. అటు వైపు వ్యక్తి యాదవ్ తమ్ముడట.

" సార్ ! అన్నయ్య ఐసియు లో ఉన్నాడు. ఔట్ ఆఫ్ డేంజర్. రేపు చర్మానికి సంబంధించిన ఏదో ఆపరేషన్, ట్రీట్మెంట్ ఉందట. మాట్లాడుతున్నాడు. ఎల్లుండి రండిసార్. మాట్లాడొచ్చు. థ్యాంక్యు ఫర్ కాలింగ్ సర్" అంటూ చాలావినయంగా మాట్లాడాడు.

కష్టాల్లోఉన్నప్పుడు ఎటువంటి మనిషికైనా వినయం పుట్టుకొస్తుంది. క్లబ్ వైపు బయలుదేరిన ఋగ్వేది మనసు మార్చుకుని బియర్ క్లబ్ వైపుతిప్పారు. కారు పార్క్ చేసి మెట్లెక్కారు. క్రితం పదిహేను సంవత్సరాల నుండి నెలకో

సారో, రెండు నెలలకోసారో ఇక్కడికి రావడం కద్దు. ఇక్కడ వివిధ విధాల డ్రాట్ బియర్ తో పాటు బటర్ మిక్స్డ్ పొటాటోచిప్స్ తినేది ఆయనకు అత్యంతానందకరమైన సంగతి. బియర్ క్లబ్ లో సుమారు ఎనభై శాతం టేబళ్ళ పైన యువతీ యువకులే ఉన్నారు. మూడు మగ్గులు బియర్ తాగి, ఒక ప్లేట్ జీరా రైస్ తిని నాలుగున్నరకు ఇంటికి చేరుకుని మంచంపై పడి ఏడుగంటల వరకూ నిద్రపోయారు. తరువాత లేచి ముఖం కడుక్కొని టివీ ఆన్ చేశారు. క్యాస్టవే సినిమా వస్తోంది. దాన్నప్పుడే చూశారాయన. హీరో టామ్ హ్యాంక్స్ అద్భుత నటనతో కూడిన మంచి సినిమా. రాత్రి కొన్ని డ్రై ఫ్రూట్స్ తిని, పాలు తాగి పడుకున్నది బాగా నిద్రపోయారు.

మరుసటి రోజు పొద్దున పది గంటలకల్లా టిఫన్ తిని సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళారు. డిగ్రి, మాస్టర్స్ చేసేటప్పుడు సెంట్రల్ లైబ్రరిలో గంటలకొద్దీ కూర్చుని చదివింది గుర్తుకొచ్చింది. అపారమైన జ్ఞానాన్నిప్రసాదించిన సెంట్రల్ లైబ్రరిని చూస్తే ఋగ్వేదిగారికి ఇష్టం, గౌరవం. క్రొత్త విద్యార్థి చదివే మాదిరిగానే ఈ రోజు సైన్స్, సోషియల్ సైన్సెస్, జియోగ్రఫి, హిస్టరి, ఫైన్ ఆర్ట్స్ మొదలైన అన్నివిభాగాలలోను తిరిగి పుస్తకాలను తిరగేశారు. సమయం మధ్యాహ్నం రెండు గంటలయ్యింది. నడుస్తూనే సెంచురీ క్లబ్ చేరుకున్నారు. లైమ్ జ్యూస్ తో పాటు రోటీ, మష్రూమ్ మసాలా ఆర్డర్ చేశారు. ఎదురుగా ఉన్న టేబల్ పైన సుధాకర్ ఒక్కడే కూర్చున్నది కనిపించింది. సుధాకర్ ఢిగ్రీలో క్లాస్ మేట్. అతడి నాన్న ఆ కాలంలోనే ఎంఎల్ ఎ అయిన కారణంగా అతనూ రాజకీయాల్లోకి ప్రవేశించి నాలుగు మార్లు ఎంఎల్ ఎ అయ్యి, ఒకసారి మంత్రి కూడా అయ్యాడు. ఈ సారి ఎన్నికల్లో ఓడిపోయాడు.

ఋగ్వేదిగారిని చూసి సుధాకర్ ఆయన టేబల్ వద్దకు వచ్చి కూర్చుని " ఏం ప్రొఫెసర్ ఎలా ఉన్నారు" అంటూ మాటలు కలిపాడు.

ఋగ్వేది " ఫైన్. మీరెలా ఉన్నారు" అని అడిగారు.

" ఏదో ఒక రకమైన విసుగు ప్రొఫెసర్. ఒక్కొక్కసారి ఎందుకు బ్రతికి ఉన్నామా అనిపిస్తుంది" అన్నాడు.

అంతలో సుధాకర్ వైపు వాళ్ళు రావడం వల్ల " ఓకె ప్రొఫెసర్, మీరు కొనసాగించండి. మళ్ళీ కలుద్దాం" అంటూ వాళ్లతో పాటు వెళ్ళిపోయాడు.

ఋగ్వేదిగారు భోంచేసి ఇంటికి వెళ్ళినప్పుడు మూడున్నర అయింది. రేపు ఏమైనా కానీ ఆస్పత్రికి వెళ్ళి వెంకటేశ్ యాదవ్ ను చూసుకుని రావాలని తీర్మానించుకుని, రాత్రికి రెండు బ్రెడ్ ఆమ్లెట్లు చేసుకున్నారు. పెద్దబ్బాయినుండి విడియో కాల్ వచ్చింది. కానీ, విడియో కాల్ కట్ చేసి మామూలు కాల్ చేసి " హలో" అన్నారు.

"ఎందుకు నాన్నా? విడియో కాల్ కట్ చేశావు. బాగున్నావా?" అన్నాడు కొడుకు.

" బాగున్నాన్రా. పాడు విడియో కాల్ లో ముఖాలు ఒరిజినల్ గా కనిపించవు " అన్నారీయన.

" నువ్వెందుకో ఇన్ కొహెరెంట్ గా మాట్లాడుతున్నావు నాన్నా ! నేను, తమ్ముడు ఒక నిర్ణయానికి వచ్చాము. మేము ఇండియాకు వచ్చి మూడు సంవత్సరాలైంది. ఇక రెండు నెలల్లో అమ్మ ఆబ్దీకం. అక్కడే చేయాలని అనుకున్నాం. తరువాత మిమ్మల్ని ఇక్కడికి పర్మనెంట్గా తీసుకురావాలనుకున్నాం. నీకు తెలియదు. ఒంటరితనం ఎలాంటి మనిషినైనా మెత్తబరుస్తుంది. ఇంకా ఎక్కువ తక్కువైతే చంపేస్తుంది." అన్నాడు.

" నువ్వు చెప్పేది కరక్టే. ఇంకా రెణ్ణెల్లుంది కదా. చూద్దాం " అన్నారు ఋగ్వేది.

ఆ రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలకు వెంకటేశ్ యాదవ్ ను చూడడానికి ఆస్పత్రికి వెళ్ళినప్పుడు యాదవ్ స్పెషల్ వార్డులో ఉన్నాడు. అక్కడక్కడ కట్లు కట్టి ఉన్నాయి. ఋగ్వేదిగారిని చూసి కళ్ళతోనే నవ్వుతూ పలకరించాడు. అతడి మంచం ప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చుంటూ ఋగ్వేది " ఏంటయ్యా! పిల్ల వేషాలు వేసే వయసా నీది? ఇంతకూ అంతటి పరిస్థితి ఏం వచ్చింది?" అన్నారు.

"మూడొందల కోట్లు లాస్ సార్ బిజినెస్ లో. తట్టుకోలేక ఇలా చేసేశాను" క్షీణమైన ధ్వనితో అన్నాడు.

మూడొందల కోట్లా! శివశివా ! తల గిర్రున తిరిగింది ఋగ్వేది గారికి. ఆయన యాదవ్ వైపు వంగి " ఎంత అవివేకివయ్యా నువ్వు ! ఎక్కడైనా నిప్పు అంటించుకుని ఆత్మహత్య చేసుకుంటారా ? దేనికైనా తగు సిద్ధత కావాలయ్యా. నువ్వు ఉరేసుకున్నావనుకో. పదిహేను సెకెండ్లలో ప్రాణం పొయ్యుండేది. మొన్న లండన్ లో నా పిహెచ్ డి స్టూండెంట్ నిధి అలెగ్జాండర్ నీ మాదిరిగానే బిజినెస్ లో లాస్ అయి ఆత్మహత్య చేసుకుందట. కానీ నీ మాదిరి బెడిసికొట్టేట్టు కాదు. ఉరేసుకుంది. జాగ్రత్త. మరోసారి ప్రయత్నిస్తే ఉరేసుకో. నువ్వు ఫెయిల్ కావు" అంటున్న ఋగ్వేదిమాటలను వెంకటేశ్ యాదవ్ తో పాటు అక్కడున్నవారంతా అవాక్కై విన్నారు.

అదేం లక్ష్యపెట్టకుండా ఋగ్వేది అక్కడనుండి లేచి బయటకు వచ్చారు. ఆ క్షణంలో ప్రజ్ఞా జోశి గుర్తుకొచ్చింది. మొన్న కలిసినప్పుడు తన ఫోన్ నంబర్ ఫీడ్ చేసుకున్నారు. నంబరు నొక్కారు. " ఏం ప్రొఫెసర్ ఏం కబుర్లు? చివరికి గుర్తుకు వచ్చాను నేను" ప్రజ్ఞా జోశి నవ్వు గాల్లో తేలివచ్చి ఋగ్వేదిగారి చెవిని తాకింది.

" సెంచురికి వస్తావా ! లంచ్ చేద్దాం. నాదేబిల్లు" అన్నారు.

" ఫైన్. నువ్వు పిలవడమూ నేను రాక పోవడమూ నా. షార్ప్ ఒక గంటలో అక్కడుంటాను" అన్నారు జోశి.

చెప్పినట్టుగానే ఒక గంటలో వచ్చారు. స్కర్ట్, ప్యాంట్ లో ఉన్న జోశి తలకు రంగేసింది. కానీ వేలాడుతున్న జబ్బలు, చెంపలు ఆమె వయస్సును బయట పెడుతున్నాయి. ఆమె మామూలుగా రెండు పెగ్గు జిన్ చెప్పింది. ఈయన హాఫ్ బాటల్ రెడ్ వైన చెప్పారు. తినడానికి పెప్పర్ చికన్, కైమా మసాలా, దోశలు చెప్పారు. మూడు గుటకలు నింపాదిగా లాగి

ఋగ్వేదిగారు “ ప్రజ్ఞా ! నీతో ఒక విషయం చెప్పాలనుకున్నా. మొన్న నువ్వు ముకుందరావ్ గురించి చెప్పావు కదా . అలాంటి ప్రాబ్లంలో నేను ఇరుక్కున్నాను “ అన్నారు.

“అదేంటలాంటి ప్రాబ్లం ? నువ్వు జీనియస్ కదా. పరిష్కరించే కెపసిటి నీకు లేదా ప్రొఫెసర్ “ అంటూ చికెన్ ముక్క నోట్లో వేసుకుని నమిలింది జోశి.

ఋగ్వేది “ నా ఇంట్లో పనిచేసే పనిమనిషికి నలభై ఆరు సంవత్సరాలు. అది ఆమె ఆధార్ కార్డ్ లో ఉన్న డేట్ ప్రకారం అనుకో. ఈ ఐదు సంవత్సరాల నుండి మా ఇద్దరిదీ కొనసాగుతోంది. నా భార్యనుండి పొందిన సుఖానికంటే ఎక్కువ సుఖాన్నే పొందాను. నేను కూడా అమెను బాగానే చూసుకున్నాననుకో. ముకుందరావ్ మాదిరిగా నేను అవివాహితను ప్రెగ్నెంట్ చెయ్యలేదు. నా పనిమనిషికి ఆపరేషన్ అయ్యింది. మా ఇద్దరి సంబంధం ఆమె భర్తకు కూడా తెలిసుండచ్చు. దాని గురించి భయం, గాబరా లేవు. కానీ, ఈ మూడు నెలల నుంచీ ఆమె తన భర్తను చంపించవలసిందిగా ప్రాధేయపడుతోంది. వాడు రోజూ తాగి వచ్చి హింసిస్తాడట. వాడ్నిచంపించకపోతే తనే ఉరేసుకుని చస్తానని బెదిరిస్తోంది....” నిట్టూరుస్తూ చెప్పారు.

ప్రజ్ఞా జోశి “నువ్వదేం చెయ్యద్దు. నీ పిల్లల దగ్గరకువెళ్ళిపో. అంతా సరిపోతుంది. ఇక్కడున్నంత వరకూ నెలకోసారి నేనే వచ్చి నీకు రాత్రంతా కంపెని ఇస్తాను” అంటూ గట్టిగా నవ్వినప్పుడు ఆమె పళ్ళు మోహనంగా అనిపించాయి. తానొక సిగరెట్ ముట్టించి ఋగ్వేదికొకటిచ్చింది. ఆయన రెగ్యులర్ గా స్మోక్ చెయ్యరు. కానీ ఈ రోజు సిగరెట్ మాత్రం మజానివ్వసాగింది.

“ సిగరెట్ లో భంగ్ కలిపాను జాగ్రత్త. ఈరోజు రాత్రి ఎంత తేలికవుతుందో చూస్కో. స్వర్గానికి ఎగిరినా ఎగరవచ్చు” అంటూ బాయ్ చెప్పి వెళ్ళిపోయింది. ఋగ్వేదిగారు ఒక రకంగా తేలికవుతూనే ఇల్లు చేరారు.

ఆదివారం నుండి ఈరోజు దాకా జరిగిన అన్ని సంఘటనలు ఋగ్వేది మనసులో కోలాహలం రేపి నిద్రకు దూరం చేసాయి. ఉదయం ఐదున్నరయింది. ఎవరో గేటు తట్టినట్టయి వెళ్ళి తలుపు తెరిచి చూశారు. ఎవరూ కనిపించలేదు. రూముకు వచ్చి ఏదో వెతికేవారిలా భార్య అల్మైరా తెరిచారు. అల్మైరాలో భార్య మూడు చీరలు కనిపించాయి. సుమారు అరవై, డెబ్బై చీరలు పనిమనిషికి అప్పుడప్పుడు ఇచ్చేశారు. నగలను కోడళ్ళిద్దరూ ఆమె పోయినప్పుడే సగం సగం పంచుకున్నారు. ఉన్న మూడు చీరల్లో ఒకటి చాలా బాగుంది. బయటకు తీసి ముఖం తుడుచుకున్నారు. అందులోనుంఛి వచ్చిన వాసనకు ఒళ్ళు ఝల్లుమంది. చీర చేతిలో పెట్టుకుని ఫ్యాన్ వైపు చూశారు. ఏదో స్ఫురించినట్టయింది. అవును ఒక సారి ఎందుకు ప్రయత్నించకూడదు? ఏదో విచిత్రమైన కుతూహలంతో తేలికగా ఉన్న టీపాయ్ ని ఎత్తి పరుపుపైన ఉంచి, టీపాయ్ పైన నిలబడి చీరను ఫ్యాన్ కు బిగించారు. క్రిందికి దిగి ఏదో ఆలోచించి వంటింట్లోకి వెళ్ళి నీళ్ళు తాగారు.

మళ్ళీ ఇంకేదో వెతుకుతున్నట్టు ఇల్లంతా పది నిముషాలు తిరిగి, అదేమో అర్థంకాక రూముకు తిరిగి వచ్చారు. టీపాయ్ ఎక్కి చీరను తన మెడకు చుట్టుకున్నారు. మెడ చుట్టూ ఉన్న చీర ఉరి మెత్తగా అనిపించింది. తన ప్రిపరేషన్ బాగుంది అని తమను తామే మెచ్చుకున్నారు. పరుపుపైన పెట్టిన ఫోన్ రింగయ్యింది. టీపాయ్ పైనుండే ఎవరని చూశారు. పెద్ద కొడుకు చక్రపాణి పేరు కనిపించింది. రెండు నిమిషాల తరువాత రెండో అబ్బాయి చక్రవర్తిది. అది ఆగిన రెండు నిమిషాలకు డాక్టర్ నాగరాజ మూర్తిగారిది. తరువాత ఇంటి పనిమనిషిది. ఋగ్వేదిగారు వీరంతా ఈ సమయంలో ఎందుకు ఫోన్ చేస్తున్నారో తెలుసుకోవాలనే కుతూహలంతో ఫోన్ తీసుకోవడానికి వంగి చెయ్యి చాస్తున్నారు. క్షణమాత్రం లో ఆయన నిలుచున్న టీపాయ్ పక్కకు జరిగి ఋగ్వేదిగారి మెడ భార్య చీర ఉరికి గట్టిగా బిగుసుకుంది. శరీరం ఏడెనిమిది సెకెండ్లు జోరుగా తన్నుకుని చివరికి నిశ్చలమైంది.

## సుభద్రక్క — సునందా కడమె

## అనువాదంః చందకచర్ల రమేశ బాబు

*************************

**అది ఒక చతురస్ర గది**. మూడూ బై మూడు ఉండొచ్చు. తలుపు తెరిచి లోపలికి వెళ్ళి కూర్చోగానే ముక్కు పగిలేంత దుర్వాసన. ఎంత తొందరగా బయటికి రాగలనో అనుకునే కలవరం డెబ్బై ఐదేళ్ళ సుభద్రక్కకు. తమ ఊళ్ళో ఇలా కాదు. విశాలమైన బయలు ప్రదేశం. కూర్చోడం, లేచి రావడం. అంతా శుభ్రంగా ఉంటుంది అని ఎన్ని సార్లు అనుకున్నా కొడుకుతో అంటే తిట్టించుకోవడం తప్పదని తనలో తానే అనుకొంటూ గమ్మునుంటుంది ఆమె. కానీ రోజుకొక్కసారైనా తన దిగులును, భయాన్ని, తల బరువును, దేహంలోని జడతను దించి వచ్చే ఏకైక ప్రదేశం కాబట్టి సుభద్రక్క అక్కడికి ఒక్కసారి వెళ్ళొచ్చిందంటే అదొక పెద్ద పని ముగించి వచ్చి ఆ రోజంతా అదోలాంటి నెమ్మదిని అనుభవిస్తుంది.

ఈ రోజు మాత్రం అదెలాగో వేరే విధంగానే అయిపోయింది. ఎన్నడూ ఇలా జరగలేదు. ఆఫీసుకు, పిల్లల స్కూళ్ళకు దగ్గర అనే కారణంగా నగరానికి నడిబొడ్డువ ఉన్న అపార్ట్ మెంట్. మధ్యాహ్నం కొడుకు, కోడలు, మనమరాలు ముగ్గురూ భోజనం ముగించి తమ తమ ఆఫీసులకు, స్కూలుకు వెళ్ళి ఒక రెండు గంటలు గడిచుండాలి అంతే. తలుపుకు

గడియ వేసి, దాన్నే మళ్ళీ రెండు సార్లు పరీక్షగా చూసొచ్చి, రోజూ మాదిరిగానే తన బెడ్రూమ్ కి వెళ్ళి పడుకుంది సుభద్రక్క ఒక్క చిన్న కునుకు తీసుండొచ్చు. కడుపులో తిప్పినట్టయింది. తేన్పు వచ్చినట్టయింది. ఏదో పడని పదార్థం తిన్నట్టానిపించింది. భోజనంలో ఏం తిన్నదో గుర్తు చేసుకుంటూ నిదానంగా లేచి కూర్చుంది సుభద్రక్క.

అంత పడనిదేదీ తిన్నట్టనిపించలేదు ఆమెకు. నీళ్ళు తాగి వద్దాం అనుకుని లేచి, కోడలు ఫ్లాస్కులో నింపి పెట్టిన వేణ్ణీళ్లను లోటాలో వేసుకుని అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుని నింపాదిగా తాగింది. కొంచెం నెమ్మది అనిపించింది. మళ్ళీ లేచి వెళ్ళి మంచం ఎక్కి దుప్పటి కప్పుకుని పడుకుంది. కొంచెం సేపటి తరువాత కడుపులో గుడ గుడ చప్పుడయ్యింది. మళ్ళీ అటు తిరిగి పడుకుంది సుభద్రక్క. నిద్ర, మగత, సగం మెలకువ, కునికిపాటు. కలలోనేమో అన్నట్టు కడుపులో కప్పల బెకబెకలు.

ఒకసారేమో లేవాలనిపించడం, అంతలోనే వద్దనిపించడం. సుభద్రక్క అలాగే చాలా సేపు పడుకునే ఉంది. ఉన్నట్టుండి వచ్చేసినట్టనిపించింది. దిగ్గున లేచి కూర్చుని, మంచం దిగి లెట్రిన్ వైపు పరుగు తీసింది. ఎందుకిలా అయ్యిందీ రోజు? ఇంకా లెట్రిన్ చేరుకోలేదు. ఇక రెండడుగులు, అంతే. కానీ అక్కడే అక్కడే వచ్చేసింది. ఛీ...ఛీ.. వాంతికొచ్చినట్టయింది. అసహ్యం అనిపించింది. దుర్వాసన. తనది తనకే గలీజుగా అనిపించింది. మరి, కోడలికి, మనమరాలికి అనిపించదా? ఇక కొడుకుకు? అమ్మ ఎంత ఆప్యాయమైనా.... సుభద్రక్క ఒళ్ళంతా కంపరమనిపించి, ఇంకొక్కసారి స్నానం చెయ్యాలని తీర్మానించింది.

ఈ ఒక్క విషయం మాత్రం అంతే. ఎవ్వరూ చూడరాదు. ఎవ్వరికీ తెలియకూడదు. దీని నరకాన్ని తను మాత్రమే అనుభవించాలి. ఎవ్వరికీ తెలియకూడదు. తెలిసిపోయిందా ఏమిటి? దేవుడా, అంతా సరిగ్గా జరిగేటట్టు చూడు. ఎక్కడ కోడలు, మనమరాలు ఏవగించుకుంటారో, ఎక్కడ కొడుకు గద్దిస్తాడో? అంతా సర్దెయ్యాలి. అంతా రహస్యంగా జరిగిపోవాలి. నాలుగడుగులు హాలు వైపు, మూడడగులు బెడ్రూం వైపు, రెండడగులు లెట్రెన్ వైపు ! కాళ్ళకేం చక్రాలున్నాయా ? వెళ్ళి కూర్చోడవడానికి ముందే వచ్చెయ్యాలా? ఛీ.. ఛీ.. ఇంతకు ముందు ఎన్నోసార్లు అత్త మామలది ఇలా అయినప్పుడు శుభ్రం చేసింది తను. కానీ ఇప్పుడెందుకో వద్దనిపిస్తోంది. అబ్బా! వాసన ! ముక్కు మూసుకోవడానికి చేతులు ఖాళీ లేక, మూడు నాలుగు సార్లు సోపుతో చెయ్యికడుక్కుంది సుభద్రక్క.

పుణ్యానికి మందమైన చీర కట్టుకోవడం మంచిదయ్యింది. ఉత్త లోలంగా ఉతికేస్తే సరి. ఒకవేళ చీరకేమైనా అయ్యుంటే ఆ చీరను తడిపి పైకెత్తడం తన చేతనయ్యేది కాదు. ఈ ముసలితనం ఒక శాపం. తన అత్తగారు ఇదే విధంగా గలీజు చేసుకున్నప్పుడు తను ఆమెను గద్దించడం గుర్తుకొస్తోంది ఇప్పుడు. ఇప్పుడే ఇలా ఉంటే..... ఇక ముందు ముందు ఎలా ఉంటుందో దేవుడా! నువ్వే కాపాడాలి. నా కోడలు పాపం చాలా మంచిది. నాజూకుగా పెరిగిన పిల్ల. ఇలాంటివి చూడనైనా చూసుండదు పాపం. ఇంటి పని, ఆఫీసు పని చేసుకుని ఇంటికొచ్చి చూస్తే ఇలా గలీజు కనిపిస్తే ఎలా ? లేదు.

ఆమె వచ్చేటప్పటికి అంతా శుభ్రం చేసి తళ తళా మెరిసేటట్టు చెయ్యాలి, సుభద్రక్క తొందర పడసాగింది. చుట్టూ వాసన వ్యాపించింది. తన సమీపం నుండే, తన లోపలినుంచే చిమ్ముకొస్తూంది అనిపించేట్టు.

అంతా శుభ్రం చెయ్యడానికి పూనుకుంది. కళ్ళు సరిగ్గా కనపడడం లేదు. ఎక్కడెక్కడ పడిందో అని కూడా కనిపించదు. ఎటు వెళ్ళినా అంతటా వాసన వ్యాపించినట్టు అనిపిస్తుంది. ఇల్లంతా దాని వాసన మబ్బులు కమ్ముకున్నట్టనిపించింది. తన ఒంటిని మళ్ళీ మళ్ళీ కడుక్కుని శుభ్రపరచుకుంది సుభద్రక్క. తరువాత వేరే బట్టలుకట్టుకుని తను మంచం నుండి పరిగెత్తి వచ్చిన స్థలాన్నంతా తుడవడం ప్రారంభించింది.

ఇంట్లో అక్కడక్కడ చీకటి అక్కడక్కడ వెలుగు. చీకటి వెలుగు, వెలుగు చీకటి రెండూ ఒకటే అనిపించింది ఆమెకు. ఈ ఒక్క సంఘటన తనను తన కోడలి నుండి, కొడుకు నుండి, మనమరాలినుండి వేరు చెయ్యకపోతే అంతే చాలు అనిపించసాగింది. ఎందుకంటే కోడలు మైత్రి చాలా చాదస్తం. రుద్దిందే రుద్దడం,కడిగిందే కడగడం. రోజూ పొద్దున ఐదు గంటలకు లేస్తే ఇల్లు శుభ్రపరచడమే ఆమె పని. భర్త, కూతురు పెట్టిన వస్తువును ఒక చోట పెట్టకుండా, అక్కడా ఇక్కడా నీళ్ళు పారబోసి, కాఫీ టీలు చెయ్యి జార్చి పడవేసి, గలీజు చేస్తుంటారని రోజంతా వారిద్దరినీ గదమాయిస్తూనే ఉంటుంది. రోజుకు ఐదారు సార్లైనా కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కుంటుంది. ఇంట్లో అటు ఇటు తిరగడానికి అందరికీ ఒక్కొక్క చెప్పుల జత తెచ్చిచ్చి, వాటిని ధరించకుండా నిర్లక్ష్యం చేసినప్పుడు, తనను కూడా చేర్చి అందరినీ తిట్టి పారేస్తుంది.

ఆమె చాదస్తం చూసి తను ఇప్పుడిప్పుడు సూక్ష్మంగా ఎక్కడా ఏమీ పడెయ్యకుండా నాజూకుగా ఉండడం నేర్చుకుంది. ఈ రోజు మాత్రం నా నుండి, అదీ నాలాంటి పెద్దదానివలన. దీని గురించి ఎప్పుడూ జాగ్రత్తగా ఉండే తనకు ఇలా ఎలా జరిగింది అని అర్థం కాకుండా సుభద్రక్క చాలా మథనపడింది. దీని కారణంగానే తను భోజనం కూడా మితంగానే చేస్తుంది. ఎవరెన్ని రకాల పంచ భక్షాలు చేసి బలవంతం చేసినా తను ఒప్పుకోదు. అవన్నీ ఈ ఒక్క విషయం కోసమే. ఈ రోజు కూడా అలాంటివేవీ వడ్డించుకున్నట్టు గుర్తు లేదు.

బయట ఎవరో వస్తున్నట్టు చప్పుడయింది. టప్ టప్ టప్ అని మెట్ల పైన చప్పుడు. కోడలే అయ్యుండాలి. ఒక్కో రోజు మనమరాలు నవమి కంటే ముందే తొందరగా వచ్చేస్తుంది. లేకపోతే కొడుకో, మనమరాలో అయ్యుండొచ్చా ? టైమెంతయిందో ? ఇంకా ఎక్కడెక్కడ తను ఇలా చేసిందో ! దేవుడా, మరి కొంచెం సేపు తరువాత వీళ్ళు వచ్చేట్టయితే, అంతలో తను అంతా శుభ్రం చేసి నెమ్మదిగా ఉండేది. ఇప్పుడింకేం చెయ్యను వీలు లేదు. సుభద్రక్క కాళ్ళు కడుక్కుని తలుపు దగ్గరికి వచ్చింది.

ఎవరైనా వస్తే తలుపంటూ తెరవాలి కదా ! ఏం చెయ్యాలి ? అంతా తన రాత. సరే ఏమవుతే అదవుతుంది. తలుపు తెరిచే చెయ్యి వణికినట్టయింది. తన ఏకాంతంలోకి వేరెవరో ప్రవేశించినట్టు, తను చాలా క్రిందికి క్రిందికి

దిగిపోయినట్టు అనిపించింది. గుండె కొట్టుకోసాగింది. కిటికీలోంచి చూసింది. “ ఓ పక్కింటి సరస్వతి. ఎందుకొచ్చిందో ? వాళ్ళకేమైనా తన పరిమళ లోకం వ్యాపించి చేరిందా? అబ్బే, అదుండదు. కాదు కాదు ఉండొచ్చు” అనుకుంటూ నింపాదిగా తలుపు తీసింది.

“ అమ్మా ! పడుకున్నారా ? మా ఇంటి తాళం చెవి ఏమైనా ఇచ్చి వెళ్ళారా మా ఆయన? “ అంటూ ప్రశ్న విసిరింది సరస్వతి. “ ఇచ్చినట్టు లేదే” అంటూ సుభద్రక్క తాళం చెవులు వేలాడ దీసే స్టాండు వైపు చూసింది. అక్కడ వేలాడుతున్న తమది కాని తాళం చెవి ఒకటి తన కళ్ళకు మసక మసకగా కనిపించింది. “ ఓ ఇచ్చారిచ్చారు. “ అంటూ అటు వైపు ఒక రెండడుగులు వేసి తాళం చెవి తీసి సరస్వతికిచ్చింది. ఆమె పాదాలు తప్పటడుగులు వేశాయి. తేలిపోయినట్టనిపించింది.

“ ఎందుకమ్మా ఒంట్లో బాగోలేదా ?” అంటూ సరస్వతి గొంతు వినిపించింది. “ అదేం లేదు. బావున్నాను. స్నానం చేస్తున్నాను “ అంటున్న సుభద్రక్క మాటలు విన్న సరస్వతి వెడుతున్నదల్లా తిరిగి చూస్తూ “ అదేమిటీ ఇప్పుడు స్నానం? ఏదో వాసన వస్తున్నట్టుందే “ అంటూ ఇంకా ఏదో అనబోయేంతలో సుభద్రక్క “ అవునవును. ఆహా లేదు. బట్టలు ఉతుకుతున్నాను “ అంటూనే తొందర తొందరగా తలుపు గట్టిగా మూసేసింది.

మాటలాడడం మొదలు పెడితే ఈ సరస్వతి ఒక గంటకు తక్కువ మాట్లాడదు. ఒకవేళ వీళ్లంతా వచ్చే టైమైపోతే, లేదా అయిపోయిందా ? మెడ ఎత్తి గడియారం వైపు చూసింది సుభద్రక్క. కళ్ళు మసక మసకగా సరిగ్గా కనిపించలేదు. దగ్గరకు వెళ్ళి పరీక్షగా చూసింది. కొంచెం కొంచెంగా కనిపించింది. ఐదవడానికి ఐదు నిమిషాలుంది. ఐదున్నర తరువాత ముగ్గురూ వస్తారు. కొంత నెమ్మది. నిట్టూర్పు వదిలింది సుభద్రక్క.

మళ్ళీ లోపలికి వెళ్ళి కడిగిందే కడిగింది, ఉతికిందే ఉతికింది. బకెటంతా వాసన వ్యాపించినట్టనిపించింది. ఇలాంటి సన్నివేశం సుభద్రక్కకు స్వతహాగా అనుభవించకున్నా కానీ, ఇన్ని రోజుల జీవితానుభవంలో వాళ్ళు వీళ్ళు ఇలాంటి విషయాలను చాలా నీచంగా అసహ్యంగా అనుకోవడం మాత్రం చెవులారా విని ఉంది. ఎవరో ముసలామె, తినాల్సింది తినరానివి తిని పొట్ట పాడు చేసుకుని ఇలాగే అశుభ్రం చేసి కోడలిని ఇబ్బంది పెట్టేదట.

ఇంకొకామె తనలాగే పట్టణానికి కొడుకు ఇంటికి వచ్చిన ముసలామెను వంటింటి పక్కనే ఉన్నలెట్రిన్ గలీజు చేస్తోందనే కారణంతో వృద్ధాశ్రమంలో వదిలేశారట. ఊళ్ళో ఉండే తన బాబాయ్ పెళ్ళాం నేత్రక్కను, ఎందుకు కొడుకు ఇంటినుండి ఇంత త్వరగా వచ్చేశావు అని అడిగితే “అక్కడేం సుఖం ఉంది సుభద్రా! తినింది సరిగా బయటికైనా తొయ్యలేం. అందుకే వచ్చేశా “ అన్నది విని ఆమెను తనే తిట్టుకున్నది గుర్తుకొచ్చింది. ఈ రోజు చూస్తే తన పరిస్థితి ఇలా ఉంది. ఎవరెవరికి ఎలాంటి పరిస్థితులు వస్తాయిరా దేవుడా !!

తన మామయ్య భార్య కమలక్కకు, ఆమె కోడలయితే ఎక్కడో పడిన మేకదో, గొర్రెదో కాయితంలో పట్టి తెచ్చి " ఇదే ఇదే మీరు లెట్రిన్ కు వెళ్ళొచ్చిన జాగాలో పడి కనిపించింది చూడండి. అంత అర్జెంటుగా వచ్చేవరకూ కాచుకుంటే ఎలా ? కొంచెం ముందుగానే వెళ్ళరాదా !" అంటూ కోపగించుకునేదట. " అది నాది కాదమ్మా, నాకు అలా రాదు " అని ఎంత చెప్పినా " ఇంకెవ్వరిది? నాదా మీ అబ్బాయిదా?" అంటూ పెద్ద రాద్ధాంతాన్నే చేసిందట.

తన బావ పెళ్ళాం కల్యాణక్కకు, ఆమె కొడుకు వాడి భార్య ఇద్దరూ ఇదే కారణానికే నిందిస్తూ " ఉత్త నీళ్ళు పోసి వచ్చేస్తే చాలదు. మగ్గు ఎత్తి నీళ్ళు పొయ్యాలి. లేకపోతే ఇల్లంతా వాసనొస్తుంది. ఇల్లు చూస్తే చిన్నది. క్రిమి కీటకాలు వచ్చేస్తాయి. మేమంతా ఎలా బ్రతకాలి ?" అంటూ గొడవ చేశారట. ఆమె కొన్ని దినాలకే ఊరికి తిరిగి వచ్చేసింది. అత్తలు ఉండడం బరువు అనిపిస్తే, ఇవన్నీ సాకులు అంతే. ఈ నగర వాసులంతా ఇంతే. ఛీ ! ఈ టైములో వరసగా ఇలాంటి సంఘటనలే గుర్తుకొస్తున్నాయి ఛీ ఛీ అనిపించింది సుభద్రక్కకు.

వారందరిలాగానే తన సత్వ పరీక్ష సమయం ఎదురైంది అనిపించింది సుభద్రక్కకు. ఇటీవల కొన్ని నెలల క్రితం సుభద్రక్కకు మల బద్ధకం అయి, రెండు మూడు సార్లు వెళ్ళిరావల్సి వచ్చేది. వచ్చిన పదార్థం కూడా గట్టిగా ఉంటూ ఎంత నీళ్ళు పోసినా పొయ్యేది కాదు. పక్కనే ఉన్న బ్రష్ తో రుద్దాల్సి వచ్చేది. రోజూ సుభద్రక్క దాంతో శుభ్రం చేసి వస్తున్నా, ఒక రోజు కొడుకు వెంకటేశ్ తన భార్యతో " ఇదేంటి బ్రష్ సరిగ్గా కడగవా నువ్వు " అని గద్దించాడు. " అవునా ? ఏదో బల్లో బొద్దింకో గలీజు చేసుండాలి" అంటూ కోడలు మైత్రి ఆ మాటను అక్కడితోనే ముగించింది.

కానీ, దాంతరువాత తను ఆ బ్రష్ ను కూడా జాగ్రత్తగా కడిగి పెట్టసాగింది. కానీ కోడలు మైత్రి ఆ రోజేనో లేదా మరుసటి రోజో సరిగ్గా గుర్తు లేదు. " అత్తయ్యా ! మీకు ఒంట్లో బావుండలేదా ? ఉష్ణమయిందా ? చల్లగా ఏమైనా తీసుకోండి " అని నాజూకుగా అని, ఆ రోజు నుండి తను ఆఫీసు నుండి వచ్చేటప్పుడు అప్పుడప్పుడు కొబ్బరి బొండాం తీసుకువచ్చేది. మైత్రి వారందరి కోడళ్ళ లాగా చేయదు అనిపిస్తుంది. కానీ చూడాలి, ఎవరి కడుపులో ఏముందో ఎవరు చూడగలరు !

మళ్ళీ బయట చప్పుడయింది. వచ్చారు అనిపించింది. సుభద్రక్కది ఇంకా పూర్తిగా పని అయిపోలేదు. చాలా సేపు వంగి నిలబడి నడుము పట్టేసినట్టు అనిపించింది. ఒక్కసారిగా నిటారుగా నిలబడడానికి అవలేదు. వెళ్ళి తలుపు తియ్యాలి కదా ! అప్పుడు వచ్చిన వాసన కంటే ఇప్పుడు తగ్గినట్టనిపించింది. అసలు తెలియకుండా కూడా ఉండొచ్చు అంటూ తనకు తనే ధైర్యం తెచ్చుకుంది. లెట్రిన్ ది, దాని పక్కనున్న బాత్రూంది తలుపులు మూసి బయటకు వచ్చింది. అంతలో మైత్రి లోపలకు వస్తూ కనిపించింది. తను సరస్వతి కోసం తెరిచిన తలుపులు మళ్ళీ మూయలేదా ఏమిటి? అనుకుంటున్న సుభద్రక్కకు కోడల్ని ఒక్కసారిగా లోపలి రూములో చూసి కంగారు పుట్టింది.

" ఇవ్వాళ పడుకోలేదా అత్తయ్యా?" అంటూ తను అడిగినట్టనిపించినా సుభద్రక్క బదులియ్యలేదు. " తలుపు వేసుండలేదా నేను?" అన్న దీన స్వరం ఒకటే ఆమె నోటినుండి ఆమెకు తెలియకుండా బయటకు వచ్చింది. వెళ్ళి పడుకోవాలో లేదా బాత్రూం లో అలాగే వదిలేసిన చీర లంగాలను కడగడానికి వెళ్ళాలో అర్థం కాక సుభద్రక్క, కోడలు ఎదుటగా చిన్న పిల్లల మాదిరి నోరు తెరుచుకుని బెంబేలెత్తుతూ నిలబడి పోయింది.

ఒక్కసారి అటూ ఇటూ పరికించిన మైత్రికి అంతా అర్థమయిపోయింది. వాసనకు ముక్కు మూసుకుంటే అత్తయ్యకు ఎక్కడ బాధ కలుగుతుందో అనిపించి ఎలాగో దానిని సహిస్తూ, ఊపిరి బిగబట్టి వదులుతూ, అదే అదే గాలిని పీలుస్తూ "ఎందుకు కడుపు నొప్పా?" అని అడిగింది. కోడలు అడిగిన ప్రశ్నకు సుభద్రక్కకు అప్పటిదాకా ఎక్కడ దాక్కుందో అన్నట్టుగా ఏడుపు తెరలు తెరలుగా వస్తూ " అది.. అది.. నాకు తెలిసి రాలేదు. ఎలా వచ్చిందో కూడా అర్థం కాలేదు. నా చావుకొచ్చింది " అంటూ సుభద్రక్క కోడలితో కళ్ళు కలపలేక బాత్రూముకు పరిగెత్తింది.

ఎప్పుడూ కళ్ళ నీళ్ళు పెట్టుకోని గట్టిమనిషి అత్తయ్యను ఈ అవతారంలో చూసేసరికి మైత్రికీ కడుపులో చురుక్కుమంది. చేతిలోని బ్యాగ్ ను అక్కడే టేబల్ పైన వదిలేసి సుభద్రక్క వెనకే వెళ్ళి " మీరు కొంచెం పడుకోండి. తరువాత ఆస్పత్రికి వెళదాం" అంటున్నా వినకుండా " ఇదొక్కటి ఆరేసి వెళ్తాను" అంటూ తన వస్త్రాన్ని ఆవేశంతో ఉతుకుతున్న అత్తయ్యను ఆపుతూ " ఎందుకలా ఇబ్బంది పడతారు? లేవండి,నడవండి " అంటూ బయటకు తీసుకుని వస్తుండగానే కొడుకు, మనమరాలి ఆగమనం జరిగింది.

మనమరాలు నవమి లోపలికి రాగానే " ఏదో వాసన వస్తుందికదా మమ్మీ " అంటూ అడుగుతున్న దాని నోటిని మైత్రి కనుసన్నతోనే మూయించడం సుభద్రక్క ఓరకంటితో చూసింది. అత్తయ్యకు ఇంకా ఏడుపు వస్తుండడం చూసిన మైత్రి, భర్తను చూసి " ఊరకే కష్టపెట్టుకోకండని మీరైనా చెప్పండి. " అంటూ సుభద్రక్క పరుపును జాడించి మళ్ళీ పరచడానికి వెళ్ళి, అక్కడ పరుపంతా గలీజయి ఉండడం గమనించి ఉలిక్కి పడి, ఆమె వచ్చి కూర్చోవడానికి ముందే ఆ బెడ్ స్ప్రెడ్ ను తీసేసి, ఉండ కట్టి మూలకు విసిరేసి, బీరువానుండి ఉతికిన ఇంకోదాన్నిపరచింది.

"అయ్యో ! పరపు పైన కూడా ఉండిందా ? ఎలా అయిందో తెలిసిరాలేదు. కల పడినట్టయింది " అంటూ తత్తరపడుతున్న అత్తయ్యను పడుకోబెడుతూ " అమ్మను ఆస్పత్రికి మీరు తీసుకెళ్తారా లేక నేనే తీసుకువెళ్ళాలా?" అంటూ భర్త వైపు తిరిగి అడుగుతూ, తను ముద్దగా విసిరేసిన దుప్పటిని బాత్రూంలోకి ఉతకడానికి తీసుకెళ్ళింది మైత్రి.

అప్పటిదాకా కళ్ళు మూసుకుని పడుకున్న సుభద్రక్కకు ఎక్కడినుండి ఏనుగు బలం వచ్చిందో, లేచి బాత్రూం కు వెళ్ళ తలుపు తీసి, కోడలు చేతినుంచి మురికి దుప్పటిని లాక్కుని తనే శుభ్రపరచాలని చూసింది. కానీ మైత్రి అప్పుడే నీళ్ళు పోసి చేత్తో కడగడం కనిపించింది. ఆమెకు ఏమనిపించిందో " నువ్వు కడగకమ్మా. నేను పిండుతా. నువ్వు ముట్టుకోకు దాన్ని " అంటూ వీరావేశంతో దుప్పటిని పట్టుకుని లాక్కుంది. అమ్మ ఈ గాబరా, కంగారు, అవమానం,

మొహమాటం గమనించిచ వెంకటేశ్ కు ఒక్కసారిగా అమ్మ పైన కనికరం కలిగింది. రౌద్రావతారంతో నుంచున్న అత్తయ్యను వారిస్తూ మైత్రి మెత్తగా ఒకే మాట అడిగింది “ మా అమ్మకు ఇలా అయితే నేను ఊరకే చూస్తుండేదాన్నా? మీరు వదలండి “

అంత సేపటికి కొడుకు వెంకటేశ్ అక్కడికి వచ్చి అమ్మను కోప్పడుతూ “ అమ్మా ! నీకేమైనా బుర్ర పాడైందా! ఇంత చిన్న విషయానికి ఏడ్చి కంగారు పెట్టడానికి ఏమైందిప్పుడు? నవమి చిన్నపిల్లగా ఉన్నప్పుడు మేం ఈ పని చెయ్యలేదా ? సరే అయితే. మైత్రిని రమ్మని నేను కడుగుతాను.సరేనా?” అంటూ బకెట్ లోకి సోప్ పౌడర్ వేస్తూ భార్య చెవిలో “ ముందు ఆ వాసన రాకుండా అగరొత్తులు అంటించు వెళ్ళు. ఈ గుడ్డలకు డెట్టాల్ నేను వేస్తాను” అంటు తరిమాడు.

కూతురు నవమి ఏదో జరగరానిది తమ ఇంట్లో జరిగినట్టు గమ్మున యూనిఫాం వదిలేసి, ఇంటి డ్రెస్ వేసుకుని టేబల్ పైన తన హోంవర్క్ చేసుకోసాగింది. ఏదో విచిత్రమైన టెన్షన్ లో ఉన్నట్టున్న తన నాన్నమ్మ మొహం చూస్తుంటే దానికి కూడా అయ్యో అనిపించి మాటలు కలపలేదు.

సుభద్రక్క మెల్లగా మనమరాలి వద్దకు వచ్చి “ పాడు వాసన కదూ చిన్నూ “ అని అడిగేసరికి ఆ పాపకు ఔననాలో లేదా కాదనాలో తెలియక అమ్మా నాన్నల లాగానే “ ఎక్కడ నాన్నమ్మా! ఏం లేదు కదా” అంటూ తడబడుతూ అనేటప్పటికి సుభద్రక్క మొహం పైన ఒక అల్లరి చిరునవ్వు కనిపించింది.

ధూపం పట్టుకుని అన్ని రూములకూ వెళ్తూ వస్తున్న కోడలి వైపు తిరిగి “ ఆస్పత్రి గీస్పత్రి ఏమీ వద్దమ్మా. ఇప్పుడు నాకు బానే ఉంది “ అన్నది. వెంకటేశ్ బట్టలనన్నీ పిండి గ్యాలరీలో ఆరవేయసాగాడు. మైత్రి వైపు తిరిగి గట్టిగా “ టీకి నువ్వు పెడతావా నన్నుపెట్టమంటావా?” అంటూ అల్లరి చేశాడు. అది విన్న నవమి తన హోంవర్క్ నుండి తలెత్తి “ టీ నువ్వేచెయ్యినాన్నా . నువ్వైతే ఏలకులు వేసి పాలలోనే రుచిగా చేస్తావు “ అన్నది.

ఇంతసేపటి వరకూ అక్కడ ఉన్న కంగారు, అసహనం, కలవరం అన్నీమాయమై, కోడలు చేతినుండి ఘుమఘుమలాడుతున్న ధూపం సువాసనతో కలిసి తను కూడా అంతటా వ్యాపించి, తన అంతరాళాన్ని కూడా శుభ్రపరుచుకుంటూ ఉన్నచోటే ఉల్లాస పడింది సుభద్రక్క. మసక వెలుతురులో మైత్రి వేసిన విద్యుద్దీపం సంబరంగా వెలగసాగింది. ఆ ప్రకాశంలో సుభద్రక్క సంబంధాల వెలుగును ఎన్నడూ లేని మౌనంతో ఆస్వాదించసాగింది.

★★★

# కోవిడ్ పరిస్థితుల్లో ఒక రోజు శ్రీ నాగరాజ్ వస్తారే

## అనువాదంః చందకచర్ల రమేశ బాబు

**ఈమెను** ఇలా కలుస్తానని ఎప్పుడూ అనుకోలేదు. అసలు ఇలా ఒక కలయిక అవుతుందని అనుకోను కూడా అనుకోలేదు. ఒకవేళ ఎదురెదురుగా కనబడితే మా మధ్య మాటలు పుడతాయనే ఊహ కూడా లేదు. ఏమాత్రం పస లేని ప్రేమకథ కలిగిన సినిమాలో లాగా, నాయికా నాయకుల కలయిక లేనిదే కథ ముగియదేమో అన్నట్టు, ఇలా అనుకోకుండా కలసింది, ఒక ఊహించిన చిక్కు ప్రశ్న లాగా – ఈమె. ఈ రోజు ఉన్నట్టుండి ఎదురైంది. అంతా తీర్చినా ఇంకా అంతో ఇంతో సశేషంగా మిగిలిన అప్పులా అనిపించింది.

అంతా చూస్తే ఈ సంఘటన అంతా ఏదో సినిమా స్క్రీన్ ప్లే రాయించినట్లుగా లేదు. అంత మాత్రం అనూహ్యంగా మాత్రం ఉంది. లేదా కొంతమట్టుకు అనూహ్యంగానే జరిగినట్టు అనిపించింది.

చారి అని నా క్లయింటు ఉన్నాడు – ఈ రోజు అతను, ఈమె కలసినట్టే అకస్మాత్తుగా, ఇలా ఒక మాట నాతో చెప్పి నాకు దిక్కు తోచకుండా చేశాడు. " ఇప్పుడే ఈ ఆవిడ కలసింది. కానీ ఆమె నన్ను గుర్తుపట్టలేదు..." అని. చాలా సేపు మాటల్లో పడి, ముగించి ఇంకేం గుడ్ బై చెప్పాలనుకునే దశలో అతడు ఈ మాటను చెప్పి మెల్లగా నవ్వాడు. ఎందుకో తెలీదు. నా దేహం మనసూ రెండూ తల్లడిల్లాయి. సాక్షాత్తూ ఆ కోవిడ్డే నా ముఖానికున్న మాస్కును ఛేదించి దాడి చేసినట్టు ఫీలయ్యాను.

నిజం చెప్పాలంటే సమస్య చారి చెప్పినందుకు కాదు. అతడు చెప్పిన మా ఆవిడ గురించి.

సరే. ఇలా అకస్మాత్తుగా మర్మఘాతుకమనిపించే ఆ విషయమేమిటి అని మీకు కురచగా చెప్పేస్తాను. ఈ చారి నా పాత క్లయింట్ అన్నాను కదా. ఎంత పాతవాడంటే తనకు తానుగా వచ్చి మాట కలిపేవరకూ అతడు ఎవరని నాకు తట్టలేదు. అంటే మరచిపోయేటంత పాతవాడయిపోయాడు. అదీకాక ఆస్పత్రి లౌంజులో వ్యాక్సిన్ క్యూలో ఉన్నప్పుడు అపరిచితుడొకడు రెండు గజాల అంతరాల నియమాన్ని ఉల్లంఘించి, ఇంకేం చెవిలోకి చొచ్చుకుపోతాడేమో అన్నట్టు గుసగుసగా చెప్పితే ఎలా ఉంటుంది ? ఈ మహమ్మారి కాలంలో కనిపించే మనుషులంతా మృత్యు దేవతలే అని అనిపిస్తారు కదా ? లేదా ఈ మహమ్మారి మన మెదడునే అలా జోకొట్టిందా ?

" వెల్ నెస్ కేర్" అనే కార్పొరేట్ హాస్పిటల్ ఫ్రంట్ డెస్క్ లో కూర్చున్న మాస్క్ ధారి లలనామణి ముందున్న గాజుతెర వెనకనుండే పెద్దగా నా ఆధార్ సంఖ్యను చెప్పి, నా వంతు నంబర్ తీసుకుని, తరువాత కుర్చీలో కూర్చోవాలా లేదా, కూర్చుంటే అంటువ్యాధి బారిన పడతానేమో అనుకుని నిలుచుంటే మంచిదనుకున్నాక ఎక్కడ నుంచోవాలో తెలియక అటూ ఇటూ చూస్తూ జేబులో చూసుకుని సానిటైజర్ మరచి వచ్చినందుకు తిట్టుకున్నాను. సరే. ఒక్కడుగు కారు వైపు వెళ్ళి తెచ్చుకుందాం అనుకుంటున్నాను — అంతలో ఇతడు నా వెనక వైపు నుండి భుజం తట్టి మాట్లాడించాడు. ఉలిక్కి పడ్డాను. వెనుక తిరిగి చూశాను. అలా చూస్తూనే ముఖానికున్న మాస్కును సరిచేసుకున్నాను.

" ఆర్కిటెక్ట్ శక్తి రైట్ ?" చావుకంటే దగ్గరగా వచ్చి ప్రశ్నించాడు. చావే ఒంటిని స్పర్శించినట్టయింది. అది చాలదన్నట్టుగా, ఆ మహానుభావుడి మూతిని మూసిన గాఢ కేసరి మాస్కు కంటికి కొట్టినట్టయి, నేరుగా చెవిలోకి దూరి గూటం గుదించినట్టయింది.

చెంగున కొద్ది దూరంజరిగి " ఎస్స్.."అన్నాను. కళ్ళు చికిలించి ఆగంతకుడి ముఖంలోకి చూస్తూ ఇంకో రెండు అడుగులు వెనకవేశాను.

నెరసిన జుట్టుకంటె ఇంకా నెరసిన గడ్డమున్న మనిషి. వయసు అరభై దాటుండొచ్చు. నుదుటి పైన కుడి కనుబొమకు పైగా కానీ కాసంత పాత గాయం మచ్చ కనిపించింది. కళ్ళలో ఒక విధమైన చురుకుదనం, ఏదో నిగూఢత్వం అనిపించాయి. ఆ కేసరి రంగు మాస్కుతో కలిపి ఈ మనిషి ఎందుకో ఖతర్నాక్ అనిపించాడు.

చూశాను. చూస్తూనే చూశాను.

తేరిపార చూశాను. కనుపాప చిన్నదిగా చేసి చూశాను. ఎవరని అంతుపట్టక కొట్టుకున్నాను.

" గుర్తు పట్టలేదనిపిస్తుంది" అన్నాడు అతను. ఒక అడుగు ముందుకు వేసి, తన నెరసిన గడ్డపు ముఖాన్ని ఎంతో కొంత చూపించినా– కొత్తగా అనిపించిందే కానీ, సుతరామూ ఎవరని గుర్తుకు రాలేదు. ఇది తెలుసుకున్న ఆ అపరిచితుడు " నేను కర్నల్ చారిని. రిమెంబర్ ?" అంటూ తన పేరుతో పాటు తన (ముఖ) పరిచయాన్ని చేసినా– పాడు మతిమరుపు నాలో అతడి పరిచయాన్ని పైకి తేలేదు. ఇంత జరిగాక అసలు పరిచయం లేదు అనడానికి కాస్త మొహమాటం అడ్డుపడి

" ఎస్ ఎస్. కర్నల్ చారి... హౌ ఆర్యూ?" అంటూ కరచాలనానికి చేయి చాపినా అది ఉత్త నటన అని నాకు అర్థమవుతూనే ఉంది. బహుశా అతడికీ అర్థమయి ఉంటుందేమో...... మనసులో " చెయ్యి పట్టుకుంటే ఏం ?"అనిపించినా బయటికి కనబరచకుండా వెంటనే జాగ్రత్త పడి చేతిని వెనిక్కి లాగేసుకుంటూ "ఈ పాడు క్రిమి మానవ జాతి ప్రతిష్ఠనే పాడు చేసింది చూశారా ! చేయి కలిపే మర్యాదను కూడా లాగేసుకుంది.... బేసిక్ డెకొరమే లేకుండా చేసింది కదా " అంటూ వెర్రి నవ్వు నవ్వి, వెనక్కు తగ్గి తన మాస్కును సరిచేసుకున్నాను.

కానీ, ఆ అపరిచితుడికి వైరస్ గురించిన నా మాటల పట్ల లక్షమే లేనట్టనిపించింది. "మీరు నన్ను గుర్తు పట్టనేలేదు. శక్తీ....." అంటూ అక్కడే నిలబడి తన సందేహాన్ని కొనసాగించాడు.

నేను బకరా మాదిరిగా నిలుచున్నా, మహానుభావుడు తన కేసరి రంగు మాస్కుకు పూర్తిగా అంటే మరీ పూర్తిగా మ్యాచ్ అయ్యేలా ఉన్న కేసరి రంగు ప్యాంటునే తొడుక్కొని ఉండడాన్నిచూసి, అదేదో భయాన్నీ, మతి చెడిన సంతోషాన్నిజతగాఅనుభవిస్తూ ముందడుగు గురించి ఆలోచించసాగాను.

" డు యు రిమెంబర్ మిసెస్ శార్వరీ చారి అట్లీస్ట్ ?" సదరు చారి మహాశయుడు చివరకు ఇలా, తన గురించిన మరొక క్లూ ఇచ్చాడో లేదో నాకు వెంటనే ఎవరని తట్టింది. వర్షాకాలపు నల్లని మేఘాలలో మెరుపు మెరిసినట్లయి తోచింది. అంటే.... అంటే..... ఈయన శార్వరి చారి భర్తా ? ఇంతకు ముందెప్పుడూ చూసినట్లే లేదు... అనుకుంటూ వాడి ముఖచర్యలను వివరంగా వెతికేటప్పటికి, అతడు మళ్ళీ ముసుగేసుకుని తన సగం సగం గురుతుల్ని ఆ కేసరిలో దాచేశాడు.

సరే. ఈ శార్వరి చారి నేను ప్రాక్టీసు మొదలుపెట్టిన కొత్తలో నా పనితో పాటే చాలా ముడిపడిన పేరు. ఈమె వైట్ ఫీల్డ్ ( బెంగళూరులో ఒక లొకాలిటీ పేరు ) దాటి " పామ్ మెడోస్" అని పేరున్న ఒక గేటెడ్ కమ్యునిటీలో, ఆ కాలంలోనే రెండొందల యాభై చదరాల ఇల్లు కట్టించింది అంటే ఆమె వైభవం లెక్కెయ్యొచ్చు. విశాలమైన ఇల్లు, అంతే పెద్ద లాన్ గార్డెన్, ల్యాండ్ స్కేప్ ఉన్న ఆవరణ. లోపలున్నప్పుడు కూడా ఆకాశానికి తెరుచుకున్నట్టుండే ఫ్రీ అర్కిటెక్చర్. ఆ ఇంటి డిజైన్ కు నాకు జాతీయ పురస్కారం కూడా లభించింది. ఇంకో మాట చెప్పాలంటే అప్పటిదాకా దోగాడుతున్నా ప్రాక్టీసు ఒక్కసారిగా లేచి తిరిగింది ఈ ప్రాజెక్ట్ తరువాతే. డబ్బులకు డబ్బులు. పేరుకు పేరు. జంటగా వచ్చాయి.

" ఓహ్ మిస్టర్ చారీ ! లాంగ్ టైమ్...." అంటూ లేని నవ్వు మొహం మీద తెచ్చిపెట్టుకున్నాను.

" కర్నల్ చారీ ...." కనొబొమల్ని ముడివేసి నన్ను సరిదిద్దాడు.

" ఎస్. ఎస్. కర్నల్ చారీ..." జాగ్రత్తగా నా సంబోధనను దిద్దుకున్నాను. " ఎన్ని సంవత్సరాలైంది మిమ్మల్ని చూసి.... ఏంటి కథ ? ... హోప్ ఆలీజ్ వెల్.."

" అవును. మనం ఇంతకుముందు కలిసింది నైన్టీన్ నైన్టి ఎయిట్లో.. అంటే లెక్కేసుకోండి. ఇరవై మూడు, ఇరవై నాలుగు సంవత్సరాలు.. కదూ "

" అవునవును."

" హౌ ఆర్ థింగ్స్ విత్యూ ?"

" సో ఫార్ సో గుడ్. సర్వైవింగ్.... ఈ పాడు వైరస్ కారణంగా కాకపోతే వేరే కంప్లెయింట్ లేదు...."

"ట్రూ...." అంటూ చారి, ఉన్నట్టుండి ఏదో గుర్తుకొచ్చినవాడిలా" అవును. మీకు అంకితా తెలుసు కదా. అంకితా సహస్రపుత్రే.... షి ఈజ్ మై నీస్... నా చెల్లెలి కూతురు" అన్నాడు.

నేను " అలాగా " అని మాట్లాడకుండా ఆశ్చర్యం ప్రకటించాను.

ఇక అంకితా అనే ఇరభై రెండు సంవత్సరాల అమ్మాయి నా ఆఫీసులో ఇంటర్న్ షిప్కి చేరింది. ఈ పెండమిక్ కంటే ముందు. అంటే కోవిడ్ గురించిన మొదటి లాక్ డౌన్ ఆరంభమైనప్పుడు. అప్పుడే ఆమె ఆరునెలల ట్రైనింగ్ అయిపోయింది. సహస్రపుత్రే ఆ అమ్మాయి ఇంటి పేరు. " వెయ్యి పిల్లల తల్లి" అని నా ఆఫీసు వాళ్ళంతా అమ్మాయిని ఏడిపించేవారు.

" ఐసీ.. అంకితా, ద మదర్ ఆఫ్ ఒన్ థౌసండ్ కిడ్స్...." నేను తమాషా చేయసాగాను.

" ఓహ్ శక్తీ.... ఇది చాలా పాత జోకు.." అంటూ నవ్వుతూనే కినుక ధ్వనితో అన్నాడు కర్నల్ చారి. దీనికంటే ముందు, తన ఘన ముక్కుపుటాల్ని చూపించిన మాస్క్ ను పైకనుకుని సరిచేసుకున్నాడు. దాని కేసరి రంగు ముక్కులోపలి బ్రహ్మాండానికి కూడా సోకినట్టనిపించింది.

" రైట్ కర్నల్... " నేనే వేరే విషయన్ని ప్రస్తావిస్తూ..." మిసెస్ శార్వరి చారి ఎలా ఉన్నారు ?"

ఈ ప్రశ్నతో కర్నల్ చారి మొహంలో కనిపించీ కనిపించని ఇబ్బంది కనిపించింది. లేదా నా కలా అనిపించిందేమో? ఈ మధ్య, ఆ రోజులలో అంటే మిసెస్ శార్వరి చారి నాతో కాంటాక్ట్ ఉన్న రోజుల్లో, ఆమె వెనకా ముందూ భుజానికి వేలాడుతున్న బేతాళుడిలా వెంటపడుతున్న ఇద్దరు కవలలు గుర్తుకు వచ్చి

" ఔను. మీ కూతుళ్ళు ఎలా ఉన్నారు?" అని అడిగాను.

" వెల్ల్... దె ఆర్ మ్యారీడ్ " చారి కళ్ళు ఒక్కసారిగా చమక్కుమన్నాయి. " ఇద్దరికీ రెండు సంవత్సరాల క్రితం పెళ్ళయింది. పెద్దది బాలిలో ఉంది. చిన్నది కొలొంబో..... ఇద్దరికీ ఒక్కొక్క సంతానం..."

" ఔనా ! అంతా నిన్న మొన్న జరిగినట్టుంది " నా మాటల్లో కృత్రిమ ఆశ్చర్యాన్ని ఒలకబోసి అన్నాను.

" ఎస్. టైమ్ జస్ట్ ఫ్లైస్ యు నో...." అన్నడు కర్నల్ చారి. దాని గురించే ఇంకా ఏమో చెప్పబోయేంతలో, నేనే అతడి సంభాషణను తుంచుతూ " అలాగయితే, అంత పెద్ద ఇంట్లో మీరిద్దరే ఉంటున్నారా?" అంటూ టక్కున అడిగేశాను. అడిగిన తర్వాత ఎందుకు అడిగానా అనిపించింది.

అన్నిటికీ ముందు కర్నల్ చారి మొహంలో కొద్దిగా కంగారు కనిపించింది. కంగారును కప్పిపుచ్చుతూ " వెల్. వి జస్ట్ స్ప్లిట్ రిసెంట్లీ.... యునో. ఈ పెండమిక్ ప్రారంభమవడానికి ముందు.. విడిపోయాం..." అంటూ ఉన్న విషయాన్ని చాలా నేరుగా నిర్భావుకంగా చెప్పేశాడు. కొద్దిగా ఆగి " మనసు విశాలమయితే ఇల్లూ విశాలమే అనిపిస్తుంది.... శక్తీ " అంటూ నేనడిన ప్రశ్నకంటే పెద్ద సంజాయిషీనే తన బదులుకు జోడించడం జరిగింది. " ఆక్చువలీ ఎస్...... మేమిద్దరమే

ఉంటాము. నేను, నా కుక్క జోయా... ఇద్దరే" అంటూ ఇంకో కొసరు మాట కూడా జోడించాడు. ఈ అన్నీ మాటలూ వెంటవెంటనే చెప్పి చివరికి నిరాశగా నిట్టూరుస్తూ, ఆకాశం వైపు ఒకసారి చూసి, ఇంకా ముందేమి జరగనుందో అన్నట్టు చూడ్డమూ జరిగింది.

ఈ శార్వరి చారి,కర్నల్ చారిలు తమ ఇద్దరు అమ్మాయిలు పెళ్ళిచేసుకుని, ఒక్కొక్కర్ని కని, వీళ్ళని అవ్వా తాతలను చేసిన తర్వాత కూడా విడిపోయారనే సంగతి నన్ను కలచివేసింది. జీవితంలో కావలసినదంతా ఉండీ లేదా కావలసినదాన్ని దక్కించుకునే స్తోమత ఉండీ, ముసలితనానికి కొద్దిగా ముందు వయసులో విడాకులు తీసుకోవాలసిన అవసరమే నాకు విచిత్రమనిపించింది. అదీ కాకుండా– ఆమె ఎంతో ఆశపడి, అంతింత కాదు, అంత ఇష్టపడి, నా ద్వారా ఇల్లు కట్టించుకుంది కదా ? తామిద్దరి వృద్ధాప్యం గడిచి, ఇద్దరి ముసలితనానికి తగిన ఇల్లు ఉండాలి అంటూ సవాల్ చేసింది కదా ? ప్రతి మాటకీ తన ఈ భర్తను వెనకేసుకుని వచ్చి మాట్లాడేది కదా ? తనుగా ఎప్పుడు ఇంటి విషయంలో తల దూర్చని చారిని బలవంతంగా ఇన్వాల్వ్ చేయించి, అతడి ఇష్టాయిష్టాలకూ తగినట్టు నా డిజైన్ లు మార్చింది కదా? ఇలా ఎల్లప్పుడూ జతగా ఉండి, ఇప్పుడు ఈ ముసలితనానికి ముందు కట్టుకున్నవాడిని కాదని వెళ్ళిపోవడమా ?

ఛ..... అనుకున్నాను.

దాంపత్య విరసం నాకేం కొత్త విషయం కాదు కదా? దీని గురించి ఒక థీసిస్ రాయగలిగినంత ఎక్స్ పర్ట్ ని నేను. ఒకటి, రెండు సార్లు కాదు సరిగ్గా మూడు సార్లు చీలికలు చూపి కూలిపోయిన పెళ్ళిళ్ళలో ఇరుక్కుపోయినవాడికి అనుభవానికి కొరతేమిటి ? లేదా, సంసారమే అచ్చిరాదని నుదుట రాసుంటే ఇంకేం చేసేది? నిజం చెప్పాలంటే ఎంత సులభంగా ఈ ఆడవాళ్ళను పోగొట్టుకున్నానో అంతే సులభంగా సంపాదించుకున్న వాడిని నేను. విడాకుల డిక్రీ రాక ముందే ఇంకో అమ్మాయితో తిరిగినవాణ్ణి. కొన్ని సార్లు కోర్ట్ హియరింగ్ మిస్ చేసి కొత్త తేదీ తీసుకున్నవాణ్ణి. ఒకటి రెండు సార్లు నా కేసును వాదించిన ఆడ లాయరే నాతో సరసాలకు దిగిందీ ఉంది..... అది సరే. అదెలా వున్నా విడాకులు విడాకులే కదా? అన్నాక దాంతో పాటే వచ్చే బాధ మాత్రం తక్కువదా? అది అకస్మాత్తుగా తెచ్చిపడవేసే మానసిక గాయం తక్కువదా? ఒక ఆడదానితో శారీరికంగా కలిసినట్టే మానసికంగానూ కలిసినాక, శరీరాన్ని వెనిక్కి తీసుకున్నట్టు మనస్సును తీసుకోగలమా? అంటుకున్న తర్వాత అది లేనే లేదనేటట్టుగా ఉన్నదున్నట్టు వదిలేయగలమా? మరి, విడిపోయేటప్పుడు ఎవరెవరి భాగాలకు రావలసిన లెక్కలూ ఉంటాయిగా? ఎవరికేం రావాలి, ఎవరికేం ఉండిపోవాలి..... అనే సాధారణ వ్యవహారాలే కాకుండా. ఎవరు తప్పు, ఎవరు కరక్టు, ఎవరు తక్కువ ఎవరు ఎక్కువ అంటూ ఎన్నుంటాయి? థత్తెరికీ.......

ఎందుకైనా అడిగానో అని నేను పరితపిస్తూ ఉండగానే, కర్నల్ చారి " చలో, నేనిక బయలుదేరుతాను శక్తీ.... పొద్దున్నే బయలుదేరాను " అంటూ మూతి పైని మాస్కును మరోసారి క్రిందికి దించుతూ ఒక అడుగు ముందువేసి " నన్ను బాగా

గుర్తు పెట్టుకోండి. ఈ పాడు మాస్కు వలన ఎవరు ఎవరని అర్థం కాదు...” అంటూ నవ్వుతూనే చెప్పి, మాస్కును మరోసారి ముక్కుదాకా ఎగబ్రాకించి, “రైట్ సీయూ...”అంటూ వెళ్ళిపోతూ ఒక రెండడగులు వేసిన వాడు – ఏదో గుర్తొచ్చినవాడిలా, అక్కడే నిలబడి “ ఐ మెట్ యువర్ వైఫ్ టూ....” అని చెప్పేశాడు.

నాకు గుండె ఝల్లుమంది. “ వ్... వేర్?” అంటూ వెర్రివెర్రిగా అడిగాను.

“ జస్ట్ నౌ... “ అంటూ పెద్దగా ఊపిరి వదిలి “ కానీ ఆమెకు కూడా నేనెవరని అర్థం కాలేదు”

“...?!”

నేను ఆశ్చర్యాతిరేకంలో కొట్టుకుంటున్నప్పుడు కర్నల్ చారి, నేరుగా నా వైపుకు దీర్ఘంగా చూసి “ ఆమెకు నేను ఎవరని డీటైల్స్ చెప్పండి శక్తీ.... నేను వస్తాను ...” అంటూ చెప్పేసి వెళ్ళిపోయాడు.

కాదు... తెలిసిన మనిషి కాదు, సరిగ్గా ఎవరని కూడా తెలియని వ్యక్తి ఇలా, అకస్మాత్తుగా ఎదురై “ నీ భార్య నన్ను గుర్తు పట్టలేదు. ఆమెకు కాస్త నా గురించి చెప్పు...” అని చెప్పి, ఎలా కనబడ్డాడో అలానే మాయమై పోతే ఏం చేసేది? అతడిని ఆపి “ కర్నల్ చారీ ! నేను కూడా నీ మాదిరే విచ్ఛేదితుణ్ణయ్యా– ఒకటి రెండు సార్లు కాదు, మూడు చెదరిన పెళ్ళిళ్ల సర్దార్ ను నేను. ఇప్పుడు చెప్పు. నా ఏ పెళ్ళాం నీకు ఎదురైంది ?” అనగలమా ? నన్ను వదిలిపెట్టి వెళ్ళిన ముగ్గురు భార్యలలో నిక్కచ్చిగా ఎవర్ని చూశావో చెప్పు... అంటూ స్పష్టీకరణ అడగ్గలమా ? లేదా, అతడు నా ముగ్గురిలో ఒక్కరిని నిజంగా చూసుంటాడా? దేవుడా..... దీనికంటే విచిత్రమైన సంగతి వేరొకటుంటుందా ? పోనీ, నాకైనా ఈ ముగ్గురిలో ఏ ఒక్కరైనా తిరిగి కలిసే యోగమే ఉంటే, అకస్మాత్ అది అదృష్టమే అయితే... దానికొక వేళా పాళా అక్కర్లేదా ? వ్యాక్సినేషన్ క్యూలో నా వంతుకోసం కాచుకున్న ఆస్పత్రిలో ఇలా ఒక విచిత్రమైన సన్నివేశం కలగాలా?

థుత్...

నిల్చున్న చోటునుండే “ వెల్నెస్ కేర్’ విశాలమైన లౌంజ్ అంతా పరికించాను. సుమారు పాతిక మంది ఉండుంటారు. అది చాలదన్నట్టు అందరూ ఒకలాగే కనబడ్డారు. ఆడవాళ్ళైనా, మగవాళ్ళైనా ఒకే రకం దుస్తులు వేసుకునే ఈ ఇరవై ఒకటో శతాబ్దపు యుని సెక్స్ సంప్రదాయంలో ఎవరెవరన్నది గుర్తు పట్టడమే కష్టం. అలాంటప్పుడు తన స్వంత జీవితమే లేని ఒక సూక్ష్మాణువు లింగాతీతంగా అందరికీ ఈ ముఖ కవచాన్ని అతికించిన సందర్భంలో, ఎదురుగా కనిపించిన వారు ఆడా, మగా అని తెలుసుకోవడమే కష్టమయ్యింది. వీరిలో ఎవరు కర్నల్ చారి చెప్పిన నా భార్య అనే ఆలోచన ముందుగా వచ్చింది.

నేను శార్వరి అండ్ కర్నల్ చారివాళ్ళ ఇంటి పనిని ఒప్పుకుంది ఇరవై మూడు ఇరవై నాలుగు సంవత్సరాల క్రితం. అప్పుడే అవిస్మరతో నా పెళ్ళి జరిగింది. అవిస్మర నాకు యునివర్సిటిలో జూనియర్ గా ఉండింది. ఏదో సాకులతో నా పైన పడుతూ ప్రేమను సాధించింది. రెండు సంవత్సరాల పాటు ఉత్కటమైన కోర్టింగ్ కూడా జరిగింది. పోతే, పెళ్ళికి తనకంటే

నేనే తొందర పెట్టాను. తాళి కట్టకపోతే ఎక్కడ మిస్ అవుతుందో అని భయపడి పెళ్ళాడడమే తప్పయిపోయింది. ఆరో నెలలో ఇల్లు వదిలి వెళ్ళిపోయి లాయర్ నోటీస్ ఇచ్చింది. ఈ అవిస్మరతో పెళ్ళి రద్దయిందని డిక్రి రావడానికి ముందే ఆర్యా, అనఘా అనే ఇద్దరు స్నేహితురాండ్రతో ఒకేసారి డేటింగ్ జరిపి, ముగ్గురి నడుమ అత్యంత ఆసక్తికరమైన త్రికోణం కనిపించి, చివరికి అనఘా తో ఘన ఘోరమైన పెళ్ళితో స్థిరపడ్డాను. ఈమె మాత్రం కరారు వాక్కుగా పంతొమ్మిది సంవత్సరాలు నాతోపాటు ఉంది. ఇద్దరూ పాలూ, చక్కెరల మాదిరి కలిసిపోయాం. అలా చూస్తే, ఇతరుల కంటే ఎక్కువగా నేను భార్య అని నిజంగా నమ్మింది ఈ అనఘనే. కానీ విధివ్రాత వేరుగా ఉంది. ఉన్నట్టుండి మిహికా నా బ్రతుకులో కాలుపెట్టింది. ఆఫీసులో ఏదో పని ఉందంటూ వచ్చిన మనిషి, నాకే తెలియకుండా నా మనసును కూడా ఆక్రమించింది. నాకు జూనియర్ గా వచ్చిన మనిషి నన్నే ఏలేసింది. చివరికి అనఘా తనుగానే నన్ను ఈమెకు ఇచ్చేసింది. తనా లేక ఆమెనా అనే సందిగ్ధానికి తావివ్వకుండా, మనసును బాధపెట్టకుండా తప్పుకుంది. సరే. ఒక ఆరేడు నెలలు కలిసున్న మిహికా, ఈ కరోనా మొదటి లాక్ డౌన్ మధ్యలో ఉన్నట్టుండి ఒక రోజు ఇల్లువదిలి వెళ్ళిపోయింది. తిరిగి రానేలేదు. ఎందుకు వెళ్ళిపోయిందో కూడా అర్థం కాలేదు. కోవిడ్ మొదటి అలంతా అయిపోయి, రెండోది అకస్మాత్తుగా వచ్చిన ఈ వేళ వరకూ కూడా – ఈమె అడ్రస్ తెలియదు.

అయ్యో ! ఈ గోడుకు అంతు లేదా ? ఈ బెంగ కూడా అతి క్రూర వైరస్ మాదిరిగానే ! తను ఉండీ లేనట్టు చుట్టుముట్టి పొంచుండి, కాచుకుని, కుట్ర పన్ని, అవకాశం దొరికితే చాలు, లోపలికి దాఖలయ్యి, గుండెలో గూడు కట్టుకుంటుంది. లోపల దుఃఖాన్నుంచేసి, దగ్గు, ఆయాసం మాత్రం బయటికి రప్పిస్తుంది. తాను మాత్రం ఉండనే ఉంటుంది.

ఇక, లౌంజ్ లో ఎవరూ నన్ను గమనిస్తున్నట్టు అనిపించలేదు. కర్నల్ చారి చెప్పింది నిజమే అయ్యుంటే– ఆవిడెవరో ఒక్కరైనా నా వైపు చూడాలి కదా? వృథా ఏదేదో చెప్పి, నాలో కుమ్మరి పురుగును వదిలేసి వెళ్ళాడు.... ఛ.... అది సరే. అతడికి నా భార్య ఎవరు అని తెలుసా? నేనే అతడ్ని సరిగా చూడలేదన్నాక, అతడు నిజంగా నా భార్యను చూసుంటాడా ? లేదా, ఊరకే కంగారు పడ్డాడా ? ఒకవేళ చూసుంటే అవిస్మరను చూసుండాలి, అనఘాను చూసే ఛాన్సే లేదు. ఇక మిహికా ఇటీవలిది కదా ? మరి ఈయన మాటను ఎలా నమ్మడం?

మనసులో ఇలా, ఎన్నో లెక్కలు వేసుకుంటున్నాను, ఎక్కడ్నుంచి ఊడిపడిందో ఏమో – ఎవరో ఒకామె ఉన్నట్టుండి నా ఎదుట నిలిచింది. గాలి తన లోపలిదంతా చిలికేసి రూపు దాల్చినట్టు కనిపించింది. " స్స.. స్సారిరా! " అంది. "నాకే మయ్యిందో ఏమో తెలీదు. ఆ టైమే అలాంటిదనుకో. విరామం లేకుండా ఇంట్లోనే గడపడం ఎవరి తరం చెప్పు? డిప్రెసింగ్ కదా? ఎంత సేపని నన్నునువ్వు, నిన్ను నేను చూసుకుంటూ కూర్చుంటాం చెప్పు! ఇప్పుడు చూస్తే మరో లాక్ డౌన్ అంటున్నారే.... ఛూ.... ఇంట్లోనే ఉండి చాలయిపోయింది నాకు శక్తీ..... ఏమీ చెయ్యకుండా అలా ఊరికే కూర్చోవడం ఒక

రోగం కాదా ఏమిటి? అదీగాకుండా, బయట ప్రజలు పురుగుల మాదిరి చనిపోతున్నారు కదా! రేపు నువ్వు కానీ, నేను కానీ ఈ మహమ్మారికి బలవచ్చు కదా ! నాకైతే భయంగా ఉంది శక్తీ.... తిరిగి వచ్చేస్తాను నేను... వద్దు అనద్దురా ! ప్లీస్ టేక్ మి హోమ్. ప్లీస్... టెల్ మి.. విల్యూ ?"

" మి.....మి..... మిహీ..." పేరుతో పిలవడానికి కూడా తడబడుతుండగా, ఏమయ్యిందని అర్థమవక ముందే... ఆ అమ్మాయి నన్ను కావిలించుకుని మొహమంతా ముద్దులతో నింపసాగింది.

దేవుడా..... ఈ అమ్మాయి మాస్కు వేసుకోలేదా ! ఇప్పుడెలా మరి.... అనుకున్నాను.

" ఇంటికి తీసుకెళ్తావా లేదా ? చెప్పు....."

" కాదు మిహీ ! ఇల్లు వదిలి వెళ్ళిపోయింది నువ్వు. ఎందుకు వెళ్ళిపోయావో చెప్పలేదు... " ఆమెను హత్తుకునే అన్నాను.

" కాదురా ! దేశమంతా లాక్ డౌన్ పెట్టారు కదా దానికి ఎందుకు అని కారణం చెప్పారా? చెప్పు శక్తీ ! అది సరే అంతకు ముందు డిమానెటైజెషన్ కు కారణం చెప్పారా ? ఎందుకో నాకు చాలా భయమేస్తుంది రా...."

ఈ అమ్మాయి వీపు నిమురుతూనే లౌంజ్ లో అవిస్మరో, అనఘో కూడా ఉన్నారేమో అనిపించింది. లౌంజ్ అవతల కర్నల్ చారి కారెక్కి వెళ్ళిపోవడం కనిపించింది. అది అతడే అని అతడి మూతికంటిన కాషాయ రంగు ఘోషించింది.

★★★

## ఎగిరిపోతే ఎంత బాగుంటుంది.... డా.గీతా వసంత్

## తెలుగు అనువాదం: చందకచర్ల రమేశ బాబు

**మండే ఎండలో** పెద్ద షామియానా క్రింద వేగిపోతూ కూచుంది సునీత. చెంపల నుండి కారుతున్న చెమటను తన కరవస్త్రంతో తుడిచి తుడిచి ఆపే సన్నాహంలో ఉందామె. రాజకీయ నాయకుల ఉపన్యాసం, సన్మానం, కొమ్ము బూరల ధ్వని అంతా ముగిసి వచ్చిన జనమంతా వారి వెంట వెళ్ళిపోయిన తరువాత "ఇప్పుడు కవిగోష్ఠి" అని ఆంకరిణి బొంగురు

గొంతుతో ప్రకటించింది. ఎవరికీ వినబడలేదు. కానీ ఆ మాటకై కాచుకున్న కవులు, కవయిత్రులు తొందర తొందరగా, కనిపించేలా ముందు వరస కుర్చీల్లో కూర్చోడానికి పరిగెత్తారు. తన పీచు గొంతుతో ఆంకరిణి కవులను వారి వారి భుజకీర్తులతో పిలవడం, వారంతా విర్రవీగుతూ కవితా గానం చేయడం, వాటికి చప్పట్ల అలలు లేవడం.... ఇవన్నీ వెనక వరసలో కూర్చున్న సునీత చెవులకు సోకుతున్నా, మనసులోకి ఇంకడం లేదు. ఇలాంటి బృహత్ సమావేశంలో తన కవితనొకదానిని చదవాలనే తన చిన్న కల నిజమవుతున్న ఆ క్షణం ఆమెలో ఒక విచిత్రమైన కల్లోలాన్ని రేపింది.

కవిత అనగానే ఆమెకు ఎప్పుడూ గుర్తుకొచ్చేది నిప్పు. ఎడతెగకుండా వర్షం పడుతున్నప్పుడు అంతంకాని చీకటి కమ్ముకుని, కీచురాళ్ళ రొదలో ప్రపంచమే నిలిచిపోయిందనిపించినప్పుడు నెగడు మంట ముందు కూర్చుని చలి కాచుకుంటూ మైమరచే చిన్ననాటి రోజులు మనోఫలకంపై వస్తూ పోయాయి. ఆ క్షణం ఆమెకు వేదిక పైన జరుగుతున్న ప్రస్తుత సంఘటనలన్నీ ఉత్త భ్రమలనిపిస్తూ ఆ అడవి లోయల లోతుల్లో విస్మృతికి జారిన నెగడు మంట చిటపటలే నిజమనిపించసాగాయి. మంట కాచుకోవడం వలన కొంచెం వెచ్చబడుతూ మగతలోని సుషుప్తిలోకి దిగిపోయి వెలికి వచ్చే అనుభవం అప్పుడంతా ఆమెకు కృత్రిమం అనిపించేది. ఈ ఒళ్ళు మరిచిన లోతుల్లో ఏదో కొత్త చైతన్యం వెలికి వచ్చే కొత్త సుఖం ఆమెను ఆకర్షిస్తూనే పోయింది. రాత్రంతా వెలుగు నీడల సయ్యాట, కలల్లో కూడా తొంగి చూసేది. పొద్దున్న లేవగానే సునీతకు దోసెలు పోసే పని. బాగా కాగిన పెనం పైన పిండి పోసి అరటి ఆకుతో ఆకాశంలా దాన్ని విస్తరిస్తూ వేసిన పల్చటి దోసెను నాజూకుగా ఎత్తి వడ్డించడంలో ఆమె పెట్టింది పేరు. ఆ మంట ముందు కూర్చునే హితమైన అనుభవాన్ని ఆమె ఎప్పుడూ తప్పించుకోలేదు.

ఆ రోజు ఆమె జీవితంలో మొదటి కవిగోష్ఠి రోజు. పొయ్యిలోని మంట కాస్త ఎక్కువయ్యి, దోసె ఎర్రగా మారి మాడిపోసాగినా ఆమె మతి ఎక్కడో తారాట్లాడుతోంది. తొమ్మిది గంటల బస్సు తప్పిపోతే అనే కంగారు. వరసగా ఉన్న తోటలు దాటి, పెద్ద కొండ ఎక్కి, మూడు నాలుగు మలుపులు తిరిగి బస్ ఆగే స్థలానికి వెళ్ళాలి. ఎన్నోసార్లు చివరి మలుపు దగ్గరకు వెళ్ళేటప్పుడు బస్ వెళ్లిపోయింది కూడా ఉంది. ఈ కవిగోష్ఠి తప్పిపోతే తన కలలన్నీ ఈ మాడిపోతున్న దోసె మాదిరిగానే మాడిపోవడం ఖాయం అనిపించింది ఆమెకి. రాత్రంతా కవితను తిద్ది తిద్ది రాసిందామె. తెల్ల కాగితం చుట్టూ నల్ల బార్డర్ వేసి సింగరించడం.... ఎర్ర సిరాతో శీర్షిక రాయడం.... అదే ఎర్ర సిరాతో కవితకు దిగువ తన పేరు రాసేటప్పుడు అదో రకమైన రోమాంచనం కలిగింది మాత్రం నిజం. చివరికి అనుకోకుండా పెట్టిన చుక్క ఆమెను ఆశ్చర్యంలో ముంచింది. ఆ చుక్క తన ప్రతిబింబమే అనిపించసాగింది.

కవిత అనేదే ఒక రహస్యమయినప్పుడు ఇలా తిద్ది తిద్ది రాసిన కవితలను ఎవరూ చూడకుండా దాయడమే పెద్ద సవాలుగా మారసాగింది సునీతకు. తనలోని జ్వాల ఎవరికీ కనిపించకూడదు. ఎవరైనా చూస్తే కాల్చుకుంటారు అనే భయం ఆమెకు. పిల్లి కూనలను ఎవరికీ కనబడకుండా దాచే పిల్లి ఆమెకు గుర్తుకు రాసాగింది. కవిత హాయిగా ఒళ్ళు

విరుచుకుని పడుకున్న కాయితాన్నిమడచి, మడచి ఒక బిందువుగా చేసి దాచి పెట్టినా ఆ బిందువే చంద్రుడై, సూర్యుడై, పర్వతమై, ఆకాశమై అలా విస్తరిస్తూ, ప్రవహిస్తూ దాని కొలతలనే దాటి పోవడం అనేది ఒక కవితలో మాత్రమే అనే ఒక ఆశ్చర్యం ఆమె అనుభవంలోకి వచ్చింది. సృష్టి కూడా ఇలానే కదా ! ఏమీ లేని శూన్యం బిందువై తన్ను తాను చూసుకునే ఆశతో ఇలా రకరకాలుగా రూపొందించుకుంటుంది కదా ! తన్ను తానే మింగుకుని ఉండగల సృష్టియొక్క చోద్యానికి, మాయకు అమ్ముడు పోయిన సునీతకు తన పెనం పైన దోసె మాడిపోయిందే దృషికి రాలేదు.

సీటు దొరకకుండా ఊగుతూ నిలబడి, ఐదు రోడ్ల కూడలిలో దిగిన సునీత కార్యక్రమం జరిగే స్థలాన్ని వెతుక్కుని చెమటలు కారుస్తూ వచ్చి కూర్చోగానే “ఇక కొన్ని నిమిషాలలోనే కార్యక్రమం ప్రారంభమవుతుంది “ అనే ప్రకటన ఆమె గుండెల్లో వణుకు పుట్టించసాగింది. ఆమె పక్కన కూర్చున్నవారంతా పరస్పరం పరిచయం ఉన్నవాళ్లలా ఉభయ కుశలోపరిలో నిమగ్నమైంది కనిపించింది. వాళ్ళ మాటల్లో ఎక్కువగా తమ కవితలు ఏ ఏ పత్రికల్లో ప్రకటించబడ్డాయి, ఎన్ని కవితా సంకలనాలు ప్రచురణలోకి వచ్చాయి, ఏ పురస్కారాలు వచ్చాయి, ఏవేవి అందకుండా పోయాయి అని మాట్లాడుకుంటున్నారు. తాము తమ పుస్తకాలకు ముందుమాట, ఆశీర్వచనం రాయించుకోవడానికి పడిన కష్టాలను వర్ణించి వర్ణించి చెపుతున్నారు. నేటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రానున్న ప్రఖ్యాత కవి అభయ చంద్రగారే తన పుస్తకానికి ముందుమాట రాశారనీ, అది తన అదృష్టమనీ అక్కడున్న ఒక కవయిత్రి మళ్ళీ మళ్ళీ చెపుతోంది. అభయ చంద్రగారి రాకనే నిరీక్షిస్తున్న కార్యకర్త ఒకరు ఆయన రాగానే ఒంట్లో కరెంట్ పాకినట్లు అటూ ఇటూ పరిగెత్తారు. తెల్ల పైజామా, గాఢ నీలి రంగు జుబ్బా ధరించిన ఆయన సునీత ఇంతవరకూ చూడని విశిష్ఠ ఠీవితో వచ్చి వేదిక పైన కూర్చోగానే సునీత చేతిలోని కవిత వణకసాగింది. టేబల్ పైన వేసిన అల్లిక వస్త్రం, ఒళ్ళంతా పూలు కప్పుకుని వెలిగించుకోవడానికి సిద్ధంగా ఉన్న దీపస్థంభం, ఒత్తుల చివరలకు అంటుకుని కాలిపోయి కరగడానికి సిద్ధంగా ఉన్న కర్పూరం ఇవన్నిటినీ చూస్తూ కంగారును అణచుకోవడానికి ప్రయత్నించసాగింది. మైకులో తన పేరును తానే వినే సంబరానికి ఒళ్ళంతా చెవులు చేసుకుని వేచి చూడసాగింది. సమాజం, కులవ్యవస్థ, ఎన్నికల రాజకీయాలు లాంటి శీర్షికల పైన వినవస్తోన్న కవితలకు చప్పట్ల వర్షం కురవసాగింది. తన కవిత ఎవరికీ నచ్చదేమో అనే భయం ఒక్కసారిగా ఆమెకు అనిపించసాగింది. ఆమె “పక్షి – నిప్పు” కవిత ఆమె పిడికిలిలో నలగసాగింది. ఆమె పేరును పిలిచినప్పుడు ముద్దగా మారిన కవితను విప్పడానికి తడబడడం చూసి అభయ చంద్రగారు తన గడ్డంచాటున నవ్వినట్టు అనిపించింది. కానీ, తన అధ్యక్ష సందేశంలో అభయచంద్రగారు తన “పక్షి– నిప్పు” కవితలోని రూపకాలను ప్రత్యేకంగా గమనించాలి, ఇది మహిళా సాహిత్యాన్ని ఇంకెక్కడికో తీసుకు పోగలిగిన కవిత అని పొగిడింది ఆమెలోని నిప్పురవ్వను ఎగదోసింది. వేదికనుండి దిగగానే చేయి కలిపి, వీపు తట్టి, చెంపలను తట్టి పలకరిస్తున్న అభయచంద్రగారు సునీతతో “ఇలా గువ్వమాదిరిగా ఒదిగిపోతే ఎలా అమ్మాయి ! బీ బ్రేవ్” అన్నది ఎంతో ఆప్యాయమానమనిపించింది. అదే ఆనందంలో బిర

బిరా బస్ స్టాండుకు వచ్చి, బస్సెక్కి వేరే ఎవ్వరినీ చూడకుండా తనలో తానే ఒదిగిపోయింది. దడి దాటి ఇంట్లోకి వచ్చేటప్పుడు ఏదో గెలిచినంత సంబరం. సాయంత్రం గడప దగ్గిర దీపం పెడుతున్న తల్లి " పాపా ! అబ్బ వచ్చావు కదా ! దారి కనపడనంత చీకటి పడిందప్పుడే. నాన్న చూస్తే తిడతారు. తొందరగా లోపలికి పద " అని తరిమింది. " గడప వద్ద దీపం పెట్టిన ఆమె మొహం పైని చీకటి" అంటూ ఏవో పంక్తులు స్ఫురించినట్టయి, వాటిని అలాగే దిగమింగుకుని పాటలాగ పాడుకుంటూ లోపలికి వెళ్ళింది.

కనబడని చీకటిని, చీకటిలోని రవ్వలను చూస్తూ, వాటిని ఏరుకుని కవితలను అల్లే వెర్రిలో పడిపోయింది సునీత. అభయ చంద్రగారితో పత్ర వ్యవహారంలో "కవిత అనగా ఏమిటి ?" అనే ప్రశ్నోత్తరాల మాలికలే పేనుకున్నాయి. తన అంతరంగాన్ని అనావరణం చేస్తూ పోయే ఈ క్రొత్త రకం అనుభూతిలో ఎల్లప్పుడూ మునిగిపోయినట్లుగా ఉంటున్న సునీతను చూసి, ఈ అమ్మాయి సంసారం చేసే ఛందస్సుకు ఇమిడే నమూనాలా కనిపించడం లేదు అని వాళ్ళమ్మ కంగారు పడసాగింది. పెళ్ళి సంబంధాలు వరసగా రాసాగాయి. కలల్లో తేలిపోయే కళ్ళు, మత్తెక్కించే నవ్వుగల, సూక్ష్మ స్వభావం కల అభయ చంద్ర లాంటి తోడు తనకు దొరుకుతాడా ? అంటూ కలలు కంటున్న సమయంలో చెదిరిపోయేలా ఆమె పెళ్ళి ధనంజయతో జరిగిపోయింది. 'కవిత అంటే కరగిపోయేది' అనేవారు అభయచంద్ర. కాని అది ఎక్కడ ఎలా కరుగుతుందని మాత్రం సునీతకు అంతుపట్టలేదు. ఆమె తాను ఎక్కడ ఉన్నానో తెలియనంత కరగి బిందువై పోయింది. వంట, భోజనం, సీమంతం, ప్రసవం అన్నీ రూఢిగా జరిగినట్టు జరిగిపోయాయి. కానీ తను ఎక్కడా కరగని ఘనపదార్థమై మిగిలి పోయినట్టు ఆమెకు అనిపించసాగింది.

ధనంజయతో కలసి జీవించేటప్పుడు తను రాసిన కవితలను కనిపించకుండా దాచడమే గగనమై పోయింది. వంటిల్లు, పడకటిల్లు ఎక్కడా మైమరచిపోవడం కష్టమైంది. ధనంజయ మంచివాడే. అతడు తను లేకుండా ఆమె వ్యక్తిత్వమే లేదు అనేటట్టు ప్రతి అడుగుకూ తనను తాను స్థాపించుకుంటూ పోవడమన్నది ప్రేమ యొక్క అద్వైతం అనిపించింది సునీతకు. తన దేహంయొక్క ప్రతి అంగుళమూ అతడికి పరిచయమే. దేహము, మనసు, ప్రజ్ఞ అన్నిటిలోనూ తొంగిచూసి అక్కడ తన పట్టును స్థాపించడమన్నది అతని హక్కు అని తెలుసుకునేటప్పటికి చాల ఆలస్యమయ్యింది. తనదంటూ ఉనికిని కోల్పోయినట్టనిపించిన ఆమె తన దేహం కూడా తనది కాదు అనిపించేంత దూరం వెళ్ళిపోయింది. ఆమె యొక్క ఈ వెలితిగా అనిపించే జగత్తును వాట్సప్ అనే గలగలలాడే ప్రపంచం ఒక్కసారిగా తన బాహువుల్లోకి తీసుకునేదాకా ఆమె సంసారమనే ఛందస్సులో ఇమిడి పోయి ఉంది. ఏదో రెండు గ్రూపుల్లోకి అమెను కానరాని చేతులు లాక్కున్నాయి. అక్కడ జలజలమని ప్రవహించే కవితలు, మరుక్షణంలోనే వాటికి వావ్, సూపర్ అంటూ పళ్ళికిలిస్తూ వచ్చే స్మైలీలు, సువాసన లేని పూగుత్తులు, థమ్సప్ శైలిలోని బొటనవేళ్ళు అంతా కొత్తగా అనిపించసాగాయి. ఎవరో తన పాత కవితను తీసి ఆ గ్రూపులో వేసేసరికి అది నదిలా అక్కడా ఇక్కడా ప్రవహించసాగింది. అదేదో నదీ తీరం పైన మళ్ళీ

అభయచంద్రగారు ప్రత్యక్షమయ్యారు. “ఎక్కడున్నావు ఇంత వరకూ?” అని అడిగారు. అవును. తను ఇంతవరకూ ఎక్కడుంది? తనను తానే వెతుక్కోసాగింది సునీత. నెమ్మదిగా ఘనపదార్థంగా ఉన్న మంచు కరిగి నదిలా కలకలా ప్రవహించసాగింది. తాను ప్రవహించే సవ్వడి తనకే వినిపించే దివ్యానుభూతికి ఆమె సంతోషపడింది. ఒకసారి అలా ప్రవాహం ప్రారంభమవగానే దాన్ని ఆపడం ఆమె వలన కూడా కాలేదు. తనకు తెలియని లోకమేదో ఈమెలో ఉందని తెలిసిన ధనంజయ మ్రాన్పడిపోయాడు. ఈ అవ్యక్తమైన బుడగలను ఎలా నియంత్రించాలో అతడికీ అర్థం కాలేదు. అక్కడికి వెళ్ళద్దు, ఇలాంటి డ్రెస్ వేసుకోవద్దు అన్నంత సులభంగా లోపలి భావనలను తెలుసుకో తరమా ? తెలుసుకుని చెరిపివేయ తరమా ? ఆమె స్నానానికి వెళ్ళినప్పుడు ఆమె మొబైల్ లో తొంగిచూడసాగాడు. ఆమెకు వచ్చే మెసేజ్ లలోని అర్థాన్ని గెలకసాగాడు. అవి విప్పలేని పొడుపుకథల్లా అనిపించసాగాయి. అదొక రోజు పబ్ లో కూర్చుని బీరు త్రాగుతుండగా “ నీ పెళ్ళాం మాంఛి హాట్ కవితలు రాస్తుందయ్యా “ అంటూ మిత్రుడొకడు కామెంట్ పాస్ చేసింది ధనంజయని ఉలిక్కిపడేలా చేసింది. ఎప్పుడు చూసినా తను వేసుకున్న నైటీకి పసుపు మరకలతో, అల్లం వెల్లుల్లి పేస్ట్ వాసనోడుతూ, తన కనుసన్నలలో ఉన్న చాలా సామాన్యమైన ఈమెలో అదేం వేడి ఉందో తనకు తెలియనిది? ఈ ఘాటు వాసనల క్రింద అవేం పరిమళాలు వ్యాపించి ఉన్నాయి? ... అని ఆలోచించి హైరనా పడ్డాడు.

ఆ రోజు ఆమె ఏదో రాస్తూ కూర్చుంది. పొయ్యి మీద పెట్టిన పాలు పొంగి పొంగి అడుగంటిన వాసన అంతా వ్యాపించినా పట్టనట్టుంది. ధనంజయలో దాగిన అక్కసంతా వెలికి రావడానికి ఈ మాడు వాసనే కారణమయ్యింది. అంతలో లోపలికి వచ్చిన ఇంటర్ చదువుతున్న కొడుకు “ అమ్మా! నువ్వేమో రాసుకుంటున్నావని నీకు చెప్పలేదు. కాలేజినుండి రాగానే ఆడుకోవడానికి వెళ్ళిపోయాను. అక్కడే మసాల పూరి తినివచ్చాను. చెయ్యి చూడు ఎలా ఘుమ్మంటుందో “ అంటూ ముక్కు దగ్గరకు తీసుకు వచ్చాడు. దాంతో అగ్నికి ఆజ్యం పోసినట్టు ధనంజయ కోపం రెట్టింపై “ ఛూ ! కొడుకు ఈడుకు వచ్చే వయసులో నీదిదేం కొత్త అవతారం? వాడి ఆకలి కూడా కనపడలేదా నీకు? నువ్వెలాంటి అమ్మవి ? ఈ దరిద్రమైన కవితలను నిప్పుల్లో పారెయ్యి “ అంటూ ధుమధుమలాడుతూ వెళ్ళిపోయాడు. కొడుకు పిచ్చి చూపులు చూస్తూ నిలబడ్డాడు.

సునీత స్టవ్ కు అంటిన జిడ్డును కడుగుతూ, మాడిపోయిన గిన్నెను తోమింది. అయినా మాడిన వాసన పోలేదు. కవితలను అగ్నికి ఆహుతి చేస్తూ, ఆ వాసన పీలుస్తూ సునీత ఆలోచించసాగింది. అవే ఉదయాలు, అవే రాత్రులు ! తిన్న పాత్రలు కడుగడం, లెట్రిన్లు కడగడం, రాత్రి స్ఖలించి మరకలు పడిన బెడ్ షీట్ ను తడిపి, దాన్నుండి వచ్చే వాసనను అసహ్యించుకుంటూ, ఆ మరకలను తోముతూ.... ఛీ ! ఈ వాసనలనుండి వెలికి వచ్చే దారి ఏది అని ఆరాటపడసాగింది. ఇవన్నిటి నుండి బయటపడడానికే కదా తను కవితలు రాసేది.... అరె ! అవును. కవిత అంటే ఇక్కడినుండి విముక్తినిచ్చి, ఎల్లలు లేని నేలలకు తీసుకువెళ్ళగల రెక్కలు. కానీ తను రెక్కలు విప్పడమే మరచిపోయింది. ఇప్పుడు ఎగరడానికి నేర్చుకున్నా ఇక్కడి గురుత్వాకర్షణను దాటలేకుంది. మళ్ళీ మళ్ళీ ఈ నిప్పులోనే తన రెక్కలను కాల్చుకునే తనకు ఆకాశ

గామిగా మారే శక్తి లేదు అనిపించింది. రాత్రంతా ఒళ్ళు కాలిన పక్షిలాగా కలవరిస్తూ పడుకున్న ఆమెకు కొద్దిగా నిద్ర, కొద్దిగా మగత. ధనంజయ తన మొబైల్ కు వచ్చిన ఫార్వర్డ్ జోకులను తన మిత్రులకు పంపుతూ, మొబైల్లో కళ్ళు ముంచేసి నవ్వుతున్నాడు. అప్పుడు ఆమెకు చప్పున గుర్తుకు వచ్చింది, కాలిపోయిన తన కవితలన్నీమొబైల్ లో సేవ్ అయి ఉన్నాయని !

షామియానా వేడిలో ఉడికిపోతూ తన జ్ఞాపకాలలో మునిగిపోయిన సునీతకు ఎవరో పిల్లకవి " కవిత అంటే నిప్పు. ధగధగలాడితేగాని మార్పు రాదు " అని గట్టిగా అరిచేసరికి కొట్టినట్టు మెలకువ వచ్చింది. పక్కన కూర్చున్నవారంతా తమ తమ మొబైళ్ళలో బిజీగా కనిపించారు. ఇద్దరు కుర్ర అమ్మాయిలు మాటల్లో మగ్నమై కనిపించారు. ఒకమ్మాయి " నా కవితకు ఫేస్ బుక్ లో తొమ్మిది వందల తొంభై తొమ్మిది లైకులు. హేయ్.. ఇంకో లైకును నేనే నొక్కుతా అని వాడు అన్నాడు" అంటూ కిల కిల నవ్వుతోంది. " ఈ అభయ చంద్ర ఉన్నారుగా.... ఇంకా అమ్మాయిలతో ఫ్లర్ట్ చెయ్యడం మానలేదు. ఇంట్లో పెళ్ళాన్ని విపరీతంగా కొడ్తారట. ఇన్ని రోజులూ ఓపిక పట్టి ఇప్పుడామె మహిళా సమితికి ఫిర్యాదు చేశారంట" ఇంకో అమ్మాయి దీని గురించిన చర్చను మొబైల్ లో సర్చ్ చేసి చూపించింది. సునీతకు చర్మం కాలిన వాసన ఆవరించసాగింది. " కుంభం ఉడికింది, హంస ఎగిరింది గుహేశ్వరా " అనే అల్లమ ప్రభుగారి వచనం ప్రజ్ఞను ఆవరించసాగింది. ఉన్న శక్తినంతా కూడగట్టుకుని రెక్కలు విప్పి ఎగరాలనే ఎక్కడిదో ఘోష తీవ్రమవుతూ పోయింది. ఆమె మెల్లిగా అక్కడనుండి లేచొచ్చింది ఎవరూ గమనించలేదు. పరిగెడుతున్నట్టు మైకు ధ్వని తరంగాలు చెవికి వినపడనంత దూరానికి వచ్చేసింది. కాలిన రెక్కల్ని అక్కడే వదిలేసి అప్పుడే మొలుస్తున్న రెక్కల్ని తడిమి తడిమి చూసుకుంది. బిందువులాంటి తను నదిలా ప్రవహించవచ్చు, సముద్రంలా ఘోషించవచ్చు, ఆకాశంలా విస్తరించవచ్చు.... అవన్నీ తనలోనే ఉన్నాయనిపించింది. అంతరంగంలోనే రెక్కలు పటపటమనించే బిందువుకు ఒక్క అవకాశమిచ్చి చూడాలన్న కోర్కె ఆమెలో బలపడసాగింది. అన్నిటికీ సిద్ధం అన్నట్టు ఎదుట విశాలమైన మైదానం నిరాకారంగా నిల్చుని కనిపించింది.

★★★

# జారుడు జీవితం

కన్నడ మూలం: దీప్తి భద్రావతి

తెలుగు అనువాదం: చందకచర్ల రమేశ బాబు

సహజంగానే నా కళ్ళల్లో ఆమె గురించిన నిరీక్షణ ఉండేది. ఆమెదే కాదు. ఆమెలాంటి అనేకులు నా నిరీక్షణ లిస్ట్ లో ఉన్నా ఆమె అంటే నాకు ప్రత్యేకమైన ఇష్టం. ఎందుకంటే ఆమెది మా ఊరే. అదీ కాకుండా మేమిద్దరం ఒకే స్కూల్లో నాలుగో తరగతి దాకా కలిసి చదువుకున్నాము. నేను ఎం.ఎస్.డబ్ల్యు కోర్సు ముగించి మొట్ట మొదటగా ఆస్పత్రిలో ఆప్త సమాలోచకిగా చేరినప్పుడు వచ్చిన మొదటి క్లైంట్ ఆమే. ప్రతి మూడు నెలలకూ ఆమె తప్పకుండా పరీక్షించుకోవడానికి వచ్చేది. అంతే కాదు. ఆమె లాంటి ఇంకా తన స్నేహితులను తనతోపాటు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేయించేది. ఆమె చేసే "ఆ" వృత్తి గురించి అడగడం నా కార్యవ్యాప్తికి రాకున్నా, ఆమె పైనున్న మమకారంతో " దీంట్లో ఎందుకు దిగావు?" అని ఒకసారి అడిగాను. దానికామె, "భర్త ఇల్లు విడిచి పారిపోయాక, ఎక్కడ చూసినా మురికి గుంటలే కనిపించసాగి, ఉత్తి పుణ్యానికి బురద ఎందుకు ఒంటికి అంటించుకోవడం, తన ముగ్గురు పిల్లలకోసం ఇదే బురదలో ఉండిపోవడమే మంచిది అనిపించి ఉండిపోయాను" అనింది.

" బాధగా లేదా?" అన్నాను.

" కడుపుకు బాధ పరిచయం ఉండదు " అని మార్మికంగా అనింది.

" సరే. అయిందేదో అయింది. కానీ జాగ్రత్త. ఏ క్షణాన్నైనా రోగాలు తగులుకోవచ్చు. నీ దగ్గరికి వచ్చే వాళ్ళకివ్వు " అంటూ ఒక రబ్బరు రూపాన్ని చేతిలో పెట్టాను.

" డబ్బులిచ్చినవాళ్ళు ఒప్పుకోరు. నాకూ చెప్పడం కష్టం." అనుభవస్థురాల్లా చెప్పింది.

" అయినా, తెలియ చెప్పు. రేపు నువ్వు కదా బాధపడేది " అంటున్నప్పుడు ఆమె పైన జాలి కలిగింది.

" అది తెలియ చెప్పే సమయమే కాదు. నీకెలా చెప్పేది ! అదీ కాక కాంపెటీషన్ చాలా ఉంది. నేను ప్రవచనాలిస్తూ కూర్చుంటే... నా దగ్గరికి ఒక్కరూ రారు. తరువాత నువ్విచ్చే ఈ రబ్బరు ముక్కల్ని నేను ఇంటింటికి తిరిగి అమ్మాల్సి వస్తుందంతే " అంటూ జోరుగా నవ్వేసింది.

" నీ తలకాయ" అంటూ నేను కూడా ఆమెతో పాటు నవ్వేశాను.

★★★★★★★★★★★★★

కానీ ప్రతిసారీ ఆమె పరీక్షకోసం వచ్చినప్పుడు నా ప్రాణం కొట్టుకునేది. నెగటివ్ రిపోర్ట్ రానీ దేవుడా అని ప్రార్థించేదాన్ని. ఆ ప్రార్థన ఆమె వరకే కాకపోయినా, ఆమె పైని మమత కొంచెం ఎక్కువగా ఉండేది అనే మాట మాత్రం నిజం. కానీ నేననుకున్న ఆ క్షణం మూడే సంవత్సరాలలో నా ముందు వచ్చి నిలుచునే నిలుచుంది. ల్యాబ్ నుండి వచ్చిన బ్లడ్ రిపోర్ట్ చూసి కుర్చీలో కూలబడ్డాను. ఆ ఐడి నంబర్ ఆమెదేనా కాదా అని మూడు మూడు సార్లు చెక్ చేసి చూశాను. అంతా సరిగ్గానే ఉంది. ఛ! ఎంత పని జరిగింది ! ఎంత చెప్పినా వినకుండా.... కోపం గొంతు దాకా వచ్చింది. దాంతర్వాత నాకు ఒక కొత్త సందిగ్ధం మొదలైంది. ఎలా చెప్పాలి ? చెప్పడం నాకు కొత్తేమీ కాదు. కానీ తను పాసిటివ్ అని తెలిసిన వెంటనే ప్రతి మనిషీ అనుభవించే ఆ క్షణాలకు నేను నిర్లిప్త సాక్షిగా మిగిలిపోయేదాన్ని.

ఏడ్చేవాళ్ళు, మౌనంగా కన్నీరు కార్చేవాళ్లు, ఏకాంతంలో బాధ పడేవాళ్ళు, బ్రతుకే వద్దనుకుని వెళ్ళిపోయేవాళ్ళు! అన్నిఉదాహరణలూ నా ముందున్నా ఈమె ఎలా దీన్నిస్వీకరిస్తుంది అని ఆలోచించి ఆలోచించి హైరానా పడ్డాను. నా సహనానికి పరీక్ష పెట్టేలా ఒక వారమైనా పత్తా లేకుండా పోయిన ఆమె పైన నాకు ఎక్కడలేని కోపం వచ్చింది. ఆమె ఫోన్ కూడా తను వ్యాప్తి ప్రదేశం నుండి బయట ఉన్నట్టు వినిపించసాగింది.

పది రోజులు గడిచుండాలి. ఆమె వచ్చి ఎదురుగ్గా కూర్చుంది.

" ఎక్కడికి వెళ్ళావు?" కోపం తట్టుకున్నాననుకున్నా తన్నుకుని వచ్చింది.

“ పని మీద వెళ్ళాను “ నిర్లిప్తంగా బదులిచ్చింది.

“ పాడైపో” శపించాను. నా గొంతు వణికింది ఆమె దృష్టికి వచ్చుండాలి.

“ లేదు. మా ఆఖరి అబ్బాయికి అదేమిటో గుండెలో కంప్లైంట్ ఉందన్నారు. అందుకే బెంగళూరికి వెళ్ళాను. “ అనింది.

ఇప్పుడు మళ్ళీ కూలబడ్డం నా వంతయింది. ఇలాంటి సమయంలో ఎలా చెప్పేది ? ఒకవేళ చెప్పకుంటే ఎవరైనా పై ఆఫీసర్లు వచ్చినప్పుడు నా ఉద్యోగానికి ముప్పు రావచ్చు. ఇప్పటికే ఆలస్యమయింది. ఏమైనా కానీ చెప్పెయ్యడమే మంచిది అనుకుని “ చూడు ! నువ్విప్పుడు నీ గుండెను గట్టిగా చేసుకోవాలి “ అంటూ చెల్లిపోయిన పదాల పీఠికను ఆమె ముందర పరుస్తూ ఆమె వైపు చూశాను.

ఆమె “ తరువాత ...” అనేటట్టు, ఇంతవరకూ నాకు కనిపించని ఒక తటస్థ భావనతో కూర్చుంది.

“ చూడు. ఈ జబ్బువలన ఎలాంటి ఇబ్బంది ఉండదు. మామూలుగానే నువ్వు బతకొచ్చు. ఆహారం బాగా తీసుకోవాలి. సిడి 4 కౌంట్ తక్కువయితే మాత్రమే మాత్రలు వేసుకోవాలి. అంతా మన చేతుల్లో ఉంది.” అంటూ కంఠతా పట్టినదంతా చెప్తూ పోయాను.

నా మాటలంతా అయిపోయాక “ ఇదంతా నాకు తెలుసు” అంది.

" ఎలా?" అనుమానంగా అడిగాను.

"వచ్చినప్పుడంతా వినీ వినీ...." చాలా విసుగు చెందినదానిలా అంది.

" తరువాత ఏం చెయ్యాలో చెప్పు" అన్నట్టుంది ఆమె ధోరణి. ఆమె మొహంలోని ధైర్యం నాకు కొంత నెమ్మదినిచ్చింది. నా పదవిని కాస్త పక్కకు పెట్టి చనువుగా " ఇకనైనా మానెయ్యి" అన్నాను.

" వదిలేసి?" అంటూ ప్రశ్నించింది.

" ఇంకేదైనా చెయ్యి" జంకుతూనే అన్నాను.

" ఇప్పుడది అసాధ్యం " కరాకండిగా చెప్పింది.

" మరి నీ ఆరోగ్యం..." ఆందోళన పడుతున్నట్లు అడిగాను. మనసులో మాత్రం ఈమె ఇంకా ఎంత మందికి ఈ వైరస్ పాకిస్తుందో అనే భయం ఉంది నాకు.

" నువ్వే అన్నావు కదా ఏమీ భయం లేదని " అంటూ చిన్నగా నవ్వింది.

"కానీ...." అంటూ రిపోర్టును ఆమె చేతిలో పెట్టాను. కొంత సేపు మౌనంగా దాన్ని చూసి "ఎవరికీ చెప్పవు కదా" అంటూ నా చేతిని బలంగా పట్టుకుంది. నిట్టూర్పుతో కూడిన ఆమె మాటలు నా మనసును ఒక క్షణంపాటు కదిలించాయి. " సందేహమా ?" అంటూ ఆమె చేతిని మెల్లగా నిమిరాను.

లేదు అన్నట్టుగా తలాడించి " తప్పుగా అనుకోవద్దు. ఈ పావలా రిపోర్టును ఇప్పుడు బయటకు తీసుకువెళ్తే నా పిల్లలను పెంచడం కష్టమవుతుంది." అంటూ దాన్ని చిన్న ముక్కలుగా చించేసి అక్కడే ఉన్న చెత్తబుట్టలో పడవేసింది. ఆమె ఇలా చేస్తుందని ఊహించని నేను కంగుతిన్నాను. " ఎందుకు అలా చూస్తున్నావు ! ఏదీ నీ డిపార్ట్ మెంట్ వాళ్ళిచ్చే రబ్బర్ ఆయుధాలు ఈ రోజు ఇవ్వవా " అంటూ నవ్వుతూ కండోమ్ పాకెట్ల కోసం చెయ్యి చాపింది. నేను అటూ ఇటూ ఊగిసలాడ సాగాను.

★★★

## మరణానికి ఒక నిమిషం ముందు

తమిళ మూలంః కలైసెల్వి

కన్నడ అనువాదం: నల్లతంబి

తెలుగు అనువాదం: చందకచర్ల రమేశ బాబు

ఢిల్లీ నగరంలోని ఆ సాయంత్రపు సమయం. పగలంతా వేపుకు తిన్న వేడి తగ్గి చలి పాకుతోంది. యమునా నదిని స్పృశించి పైకెగసిన గాలి నగరాన్ని మరింత చల్లబరుస్తోంది. కొంత సమయం క్రితం దివ్యంగా వెలుగుతున్న ప్రార్థనా వేదిక తన పవిత్రతను కోల్పోయింది. వాద్యాలనూ, వాద్యగాళ్ళను ఎవరూ పట్టించుకోకుండా ఆందోళన, రోదనా అలుముకున్నాయి. కాలుదారి పక్కనున్న గడ్డి తివాచీ జరిగిన దుఃఖాన్ని భరిస్తూ ఎక్కడికీ వెళ్ళలేక కంగారు పడుతోంది. నెత్తిపైన బోర్లాపడ్డ నీలి ఆకాశంలో చిన్న చిన్న మబ్బుల తునకలు గుంపులుగా చేరుతున్నాయి.

" మోహన్ ! మీరు లేవచ్చు. వీలవుతుంది. ప్రయత్నించండి."

" తప్పకుండా ! తప్పకుండా ప్రయత్నిస్తాను కస్తూర్ . నా చుట్టూ అందరూ నిలబడి ఆందోళన పడడం చూస్తూనే ఉన్నాను. నేను ఇప్పుడే ప్రార్థనా స్థలానికి వెళ్ళాలి. లేకుంటే వాళ్ళ సమయం పాడవుతుంది."

" అది సరే. ఇప్పుడు మీరు లేవడం ముఖ్యం."

" కానీ.... కానీ... నాకు నా చేతులు, కాళ్ళు కదపడానికి కుదరడం లేదు. కళ్ళు మెదపడానికి కావడం లేదు. కస్తూర్ ! నాకు చాలా దిగులుగా ఉంది. పటేల్, నెహ్రూ ఇద్దరూ కలిసి ఉండడం దేశానికెంతైనా అవసరం. వారిని కలపాల్సిన నేను, ఈ సమయంలో ఇలా పడుండడం సమంజసం కాదు. "

" సరే. దాని గురించి ఆలోచించకండి. ఇప్పుడు మీరు లేవాలి. అది ముఖ్యం "

" కస్తూర్ ! నాకు సర్దుకోవడానికి కొద్దిగా వ్యవధినివ్వు...."

" కానీ. మీరిలా చాలా సేపు పడుకునుంటే. మీ శరీరం దుమ్ముతో మలినపడుతుంది. నిన్నటి నుండి దగ్గు కూడా ఆగడం లేదు."

"రామ... రామ.... ఈ ఒంటినొప్పుల వలన అంతా మరచిపోయాను. అది సరే. ఇవన్నీనీకెలాతెలుసు ? నువ్వెక్కడున్నావు?"

" అలాగే కొంచెం కళ్ళు తెరిచి, పక్కకు తిరిగి చూడండి"

" ఏమంటున్నావు నువ్వు ! నాకు కళ్ళు తెరవడానికి కుదరడం లేదు అని చెప్పాను కదా "

మోహన్ కోపం చూడగానే " సరే... సరే.... నేనే చెప్తాను. నేను మీకు నేరుగా, పైన తెల్ల మబ్బునై నిల్చున్నాను. మోహన్.. మిమ్మల్ని చూడడానికి ఇక్కడికి వచ్చాను. "

" నాకోసం వచ్చావా ? దీనికి సంబంధించిన వారి వద్ద నుండి అనుమతి తీసుకున్నావా ?"

మోహన్ కోపపు మాటలకు కస్తూర్ ముఖాన్ని కందగడ్డ చేసుకుంది.

" నన్ను ఎప్పుడు నమ్ముతారో తెలియదు. ఆగాఖాన్ జైలుకు నేను, సుశీల ఖైదీలుగా వచ్చినప్పుడు కూడా దీన్నే అడిగారు. మేమిద్దరం అక్రమంగా ప్రత్యేక అనుమతి పొంది మీరున్న ఆగాఖాన్ జైలుకు వచ్చాం అనుకున్నారు కదూ ?"

కొంచెం గద్గగ స్వరంతో " కస్తూర్ ! ఏం జరిగిందో జైలులో ఉన్న నాకు ఎలా తెలుస్తుంది చెప్పు?" అన్నాయన వెంటనే " నువ్వు అక్కడికి వచ్చేటప్పటికి జ్వరం, విరోచనాలతో బాధపడ్డావట కదా ?" అనగానే కస్తూర్ భావుకురాలై " అదంతా ఇప్పుడెందుకు ! మమ్మల్ని అక్కడికి తీసుకుని వచ్చేటప్పుడు రైల్వే స్టేషన్ వెయిటింగ్ రూములో కూర్చున్నాము. భారతదేశమంతటా ఆంగ్ల పభుత్వానికి వ్యతిరేకంగా

" డు ఆర్ డై" లాంటి పెద్ద పోరాటం జరుగుతున్నప్పుడు కూడా, అక్కడి ప్రజలు మామూలుగా వచ్చి పోతున్నారు. స్టేషన్ పనివాళ్ళు సిగరెట్ కాలుస్తూ మామూలుగా మాట్లాడుకుంటున్నారు. కూలివాళ్ళు ప్రయాణికులతో బేరాలాడుతున్నారు. సుశీల " నాకెందుకో బడలికగా ఉంది. జ్వరంగా ఉంది" అంది. కానీ అప్పుడు నా బెంగంతా స్వాతంత్ర పోరాటంలో మీరు ఎలా జయశీలురవుతారు అనే దాని గురించే ఉండింది."

" కస్తూర్ ! నేనెందుకు నీ మీద కోపగించుకుంటానో అర్థమయిందా ..... మనం పూనుకున్న దేశ స్వాతంత్రం... అది కూడా అహింసా మార్గంలో.... అది ఎంత పెద్ద విషయం... దీనిపైన మన నమ్మకం సడలితే పోరాటాన్ని ఎలా కొనసాగించగలం చెప్పు ?"

" ఓహో ,,,, అపనమ్మకం కలిగింది కాబట్టే, నేను మీ భార్యననే అధికారంతో అక్రమంగా అగాఖాన్ జైలుకు వచ్చానని అనుకున్నారు కదూ ?"

" దానికి మహదేవ్ కు నేను స్పష్టత నిచ్చాను కదా కస్తూర్...." మాట తడబడింది.

దేహం నొప్పితో తల్లడిల్లింది. శరీరమంతా పాకిన నొప్పి ఆయనను మాటలాడనివ్వలేదు. అది గమనించని కస్తూర్ “ నిన్న దగ్గుకు పొడి చేసి ఉంచిన లవంగం అయిపోయిందని మనుకు పొడి కొట్టమని చెప్పారా?” అంది.

మోహన్ నుండి బదులు రాలేదు. తూట్లుపడిన చాతీనుండి రక్తం కారుతోంది. మధ్యాహ్నం రేగడిమట్టితో చేసిన చికిత్స తరువాత మను, ఆభా పట్టిన కాళ్లు కట్టెల్లా బిగుసుకున్నాయి. చుట్టూతా ధ్వనులు... గొంతులు. అన్నివైపులా రోదన ధ్వనులు. రోదనలో తడిసిన ఆక్రందనలు. బాపూ... బాపూ...దినపత్రికలలో రేపు ఇదే ప్రధాన వార్త కావచ్చు. ఈ రోజు దిన పత్రికలో దారాసింగ్ అనే ఆయన ’ గాంధి రాజకీయాలను వదిలేసుకుని హిమాలయాలకు వెళ్ళి విశ్రాంతి తీసుకోవాలి. ఆయనవలననే ఇన్ని సమస్యలు” అన్నారు. నిన్న కూడా ఒక నిరాశ్రితుడు ఆయన ఎదుట నిలబడి ఇలాగే ఏమేమో అరిచాడు.

తునకలుగా పడి ఉన్న ముక్కలను ఏరుకుని తన ఆకారాన్ని సరిచేసుకుంది మబ్బు. ఈ నాలుగు సంవత్సరాలలో అది తన దేహాన్ని ఈడ్చుకుంటూ ఎక్కడెక్కడో తిరిగింది. “ ఇక్కడ్నుంచి చూస్తే పోర్ బందర్ యొక్క వేడిమి లేని పగటిని, సముద్రం గాలినుండి చల్లబడ్డ రాత్రిని బాగా అనుభవించవచ్చు. సముద్రపు వైశాల్యాన్ని, దాని తెల్లటి అలలు భూమిని తాకి ఉప్పు నురగగా మారడాన్ని, విసుగు లేకుండా చూసే వరి కంకుల మాదిరి కాథియవాడి ప్రజలకు ఆ ప్రకృతి, దాని అందం ఎప్పటికీ విసుగు రాదు. “ ఇలాంటి భావాలను రేకెత్తించి, నిట్టూర్పుకు చెదరిపోయిన మేఘం తునకలు, మోహన్ మొహంలోని నొప్పిని పక్కకు నెట్టి పైకొచ్చిన మందహాసాన్ని చూడగానే మళ్ళి ఒక్కటయ్యాయి.

“కస్తూర్ ! నువ్వు మంచి రసికురాలవు “

“ హా... నేనేం ఆలోచిస్తున్నాను అని మీరు చెప్పగలరా ? ఆశ్చర్యంగా ఉందా ?”

“ పదమూడేళ్ళ వయస్సునుండి నీ జతగా ఉన్న నాకు నువ్వు ఏం ఆలోచిస్తున్నావు అని తెలియకుండా పోతుందా ఏమిటి?”

అట్టహాసంగా నవ్వాలనుకున్న కస్తూర్, సాధ్యమైనంత శబ్దం రాకుండా నవ్వింది.

“ ఎందుకు నవ్వుతావు కస్తూర్ ? నీ తండ్రి మకంజి కపాడియాలాగా నేను పెద్ద శ్రీమంతుడినో లేక ఇరవై గదులు, రెండు ముంగిళ్ళు ఉన్న ఇల్లు నావద్ద లేదు అని నవ్వుతున్నావా? నువ్వు అడిగినా అలాంటి దాన్నిఇచ్చే ఉద్దేశమయితే నాకు లేదు.”

“ఎందుకు ! డర్బాన్ లో మనం మొదటి కాపురం పెట్టిన ఇంట్లో రెండు ముంగిళ్ళు ఉండలేదా ?” మళ్ళీ కస్తూర్ నవ్వింది. “ నేను చచ్చిపోయినప్పుడు నా పైన కప్పడానికి మీరు నేసిన నూలు చీరను ఎక్కడ జాగ్రత్తగా పెట్టాలని అర్థం కాక నేను పడిన కష్టాలున్నాయి చూశారూ....”

“ మళ్ళీ ఎందుకు నవ్వుతున్నావు?” మోహన్ ధ్వనిలో కోపం కనిపించింది.

"ఆగాఖాన్ జైలులో ఉన్నప్పుడు సంక్రాంతికి నువ్వుల లడ్డులు చేయడానికి నువ్వులు తెప్పించి ఇవ్వండి అన్నప్పుడు మీరేమన్నారు. గుర్తుందా ?"

" ఆ..... మనం ఇప్పుడు జైలులో ఉన్నామని మరవద్దు. ఇంట్లో చేసినట్టు ఇక్కడ చెయ్యద్దు అని చెప్పాను. దానికి నువ్వు....."

" ఉండండి.. ఉండండి... మోహన్ ! మనకు ఇల్లు అని ఒకటి ఉండిందా ? అయ్యో.. మోహన్ ఏమైంది? ఎందుకిలా మీ మొహం పాలిపోతోంది ? చాలా నొప్పిగా ఉందా ? ఇక మీరు లేవలేరు అనిపిస్తుంది "

"అవును. తూటా లోపల కోస్తున్నట్టుంది."

"హా... మోహన్ ! అలా అనిపిస్తోందా ?"

" అవును..." ఇక మాటలు రాక ఆలోచనలు పెనవేసుకోసాగాయి. "నేను అతడి కళ్ళల్లోకి చూశాను. చలించని కళ్ళు. అతడు అడ్డంగా ఉన్న మనును నెట్టేస్తాడు. ఆమెకు కూడా ఏదో జరుగుతుందని తెలిసిపోయుంటుంది. నేను నిరీక్షించిన అంతం వచ్చిందా ? అలాగే అనిపిస్తుంది. ఆ యువకుడి కుడి చేతిలో పిస్తోల్ ఉంది.... అదిగో... ఇక కాలుస్తాడు.."

"మోహన్... మోహన్.." కస్తూర్ గొంతులో కంగారు. " కొంచెం ఓర్చుకోండి.... బాధ ఆవరించుకోవడమే మరణం. నేను నా చివరి రోజుల్లో చాలా కష్టపడ్డాను. పడుకోనూ వీల్లేకుండా, కూర్చోడానికీ రాకుండా.... ఆముదం తాగితే అంతా సరిపోతుంది అని ఒక వైపు. పిల్లల్ని చూడాలని ఆశ. మీతోనే నా సమయాన్నంతా గడపాలని ఒక ఆవేశం."

" ఒక్క నిమిషం కస్తూర్... నీ మరణ సమయంలో పెన్సిలిన్ ఇంజక్షన్ ఇప్పించలేదు అని నీకు అనిపించిందా ?"

" ఛ.. ఛ.. అసల్లేదు. అదంతా ముగిసిపోయిన కథ. నా మరణం లాగా ఎన్నో రోజులు కష్టపడకుండా అంతా తొందరగా అయిపోతుంది. అప్పటిదాకా మాట్లాడుతూ ఉందాం."

" సరే. నానుండి నువ్వు ఏమైనా అడగాలనుకున్నావా ? చెప్పు. నేను ఈ బాధను తట్టుకోవాలి."

కానీ వణుకుతూ అరుస్తున్న గొంతులు బాధను తీవ్రం చేశాయి. " వదలొద్దు. పట్టుకోండి. వాడే... అయ్యో పాపిష్టివాడా... మా బాపూనూ చంపేశావు కదరా... బాపు...బాపూ... అయ్యో... అహింసను బోధించినవాడికి ఇలాంటి చావా ?"

"మోహన్.... మోహన్.... ఎందుకు బదులివ్వవు? నేను మాట్లాడేది వినబడుతోందా ?"

"క్షమించు కస్తూర్. జ్ఞాపకాలు ముక్కలవుతున్నాయి. సరే. మళ్ళీ చెప్పు"

" మోహన్ ! ఇలాంటి బలమైన ప్రభుత్వాన్ని ఎదురించి నిలవాలని ఎందుకు నిర్ణయించుకున్నారు? ఏమైనా చేయగలిగే సామర్థ్యాన్ని కలిగిన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మీ నిర్ణయం తప్పు అని ఎప్పుడైనా అనిపించిందా ?"

" ఓ! ఇదే నువ్వు ఆగాఖాన్ జైలులో ఉన్నప్పుడు కూడా అడిగావు."

" ఆ రోజు రైల్వే స్టేషన్ లో ప్రజల నడవడిక చూసినప్పుడు మీ కార్యకలాపాలు తప్పు అని నాకనిపించింది. అదే సమయంలో ఈ పోరాటం యొక్క పరిణామాలను ప్రజలు ఎన్ని రోజులు తట్టుకుంటారు అనే సందేహం కూడా ఉండింది."

" దానికి నేను కారణం చెప్పడానికి వచ్చినప్పుడు నువ్వు నా మాటను చెవిని వేసుకోవడానికి సిద్ధంగా లేవు. దానికి నాకు కోపం కూడా వచ్చింది. ఇప్పుడు ఏం చెయ్యాలని నీఉద్దేశం ? నువ్వు, నేను ప్రభుత్వానికి ఒక క్షమాపణ పత్రాన్ని రాసిద్దామా అని అడిగావు. " నేనెందుకు వారి దగ్గర క్షమాపణ చెప్పుకోవాలి ?" అంటూ అరిచావు. .. మీరెందుకు క్షమించమని అడగాలి? అని కోపగించుకున్నావు.. మీరు చేసిందంతా ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. మీ వల్ల ఆడవాళ్లంతా జైల్లో ఉన్నారు. మహదేవ్ గారు పోనే పోయారు. తరువాత మీరే" అని అరిచావు. మరణమన్నది బాధే. కానీ ముక్తి కదా ?"

" చాల్చాలు... మీరు విడుదల... స్వాతంత్రం అని అరిచిందంతా చాలు. మీరెందుకు వాళ్ళను దేశం వదిలేసి వెళ్ళమని చెప్పారు ? మన దేశం ఎంత పెద్దది. వాళ్లకు నచ్చితే ఇక్కడే ఉండిపోండి అని చెప్పచ్చు కదా "

" కస్తూర్... నేను దాన్నే చెప్పాను. పరిపాలన బాధ్యతనుండి వారు దిగిపోతే, మనకూ వారికీ ఏ సమస్య అయినా ఎందుకుంటుంది ? వారికిష్టమయితే వారు కూడా మన సోదరుల మాదిరి ఇక్కడే ఉండచ్చు అని చెప్పాను కదా ?"

కొద్దిసేపు తేలిపోయిన అర్థగర్భిత మౌనం తరువాత.... " సోదరులు అనే పదం అర్థం పోగొట్టుకుని... నిరర్థకంగా మిగిలి...."

" మోహన్..... మోహన్... ఏమయ్యింది మీకు? ఏదేదో సణుక్కుంటున్నారు? నాకు ఏమీ వినిపించడం లేదు."

" కస్తూర్ ! సోదరులు అనే పదానికి అర్థం ఏమిటి అని తెలియట్లేదు." గొంతు కొద్దిగా గద్గదమయ్యింది.

"మోహన్ ... ఆ పదంయొక్క ఈ రోజు అర్థమే మిమ్మల్ని ఇలా పడేసి, చెట్టు మొదలులా దొర్లించింది. అర్థమయిందా ?"

" నాకు ఏదీ గుర్తుకు తీసుకురాకు కస్తూర్ ! బాధ నా ఆలోచనలను ఆక్రమించుకుంటోంది. మనం కొంత కాసేపు ఇలాగే మాట్లాడుకుందాం. ఇది నీ కోసమే కేటాయించిన సమయం అనుకో "

" లేదు. మీ మొహం కళాహీనమవుతోంది. కొంచెం సర్దుకోండి."

" నిజమే కస్తూర్ !...." పదాలుగా పుట్టిన ఆలోచనలు ధ్వనిగా మారి బయటికి రాలేకుండా తడబడుతున్నాయి. ముగించాల్సిన పనులు తెరపైని చిత్రాల మాదిరిగా పరిగెడుతున్నాయి. కాంగ్రెస్ సమితి రాసిన కొత్త నిర్ణయాలను ఇంకా ఏమయినా సరదిద్దాలా అని చూడాలి. ఢిల్లీలో శాంతి నెలకొల్పడానికి, సంబంధించిన అన్ని మతాల నాయకుల వద్ద మాట్లాడాలి. నేర్చుకుంటున్న బెంగాలీ భాషలో భ్రాతృత్వం గురించి ఒక రెండు వాక్యాలు రాయాలి. నెహ్రూ, పటేల్ ఇద్దరి నడుమ ఉన్న మనస్థర్థలను నివారించాలి.

ఈ రోజెందుకో పటేల్ తో అంతసేపు మాట్లాడాను ! ఐదు గంటలకు సరిగ్గా పార్థన ప్రారంభం కావాలి. ఆలస్యమయిన విషయం మను, ఆభా కాని నాకు చెప్పలేదు కదా ! గడ్డి తివాచీ దాటి ప్రార్థన అరుగు వద్దకు వెళ్ళుంటే అన్నీ మారేవేమో ! కానీ, ఈ రోజు ' ద లైఫ్' పత్రికా సందర్శనంలో " మీరు ఎప్పుడు చూసినా 125 సంవత్సరాలు బ్రతకాలని అనుకుంటున్నాను అంటారు. ఏ విశ్వాసంతో అలా చెప్తారు?" అని అడిగినప్పుడు " ఆ నమ్మకం ఇప్పుడు లేదు" అని చెప్పాను. "ఎందుకలా చెప్తున్నారు?" అని ఆయన అడిగారు. దానికి నేను " ప్రపంచంలో జరుగుతున్న భయోత్పాదనే దీనికి కారణం. నేను చీకట్లో బ్రతకడానికి ఇష్టపడను. " అన్నాను. అవును. నేను దేన్ని సత్యమని నమ్ముతానో దాన్నేచెప్పాను. నేను మారిన కాలానికి అధీనుణ్ణయిపోయాను. నా అద్దాలు, చెప్పులూ చెదరి పడ్డాయి. నా ఛాతీ పైన వెచ్చగా తడిగా ఏమో అంటుకుంటోంది. పొత్తి కడుపు ఉన్నట్టే అనిపించడం లేదు. అవును. నన్ను కాల్చడం జరిగింది. పిస్తోల్ పట్టుకుని వచ్చిన ఆ యువకుడు నా పైన కాల్చాడు. కానీ, ఆ యువకుడు నిరపరాధి. నాకు గొంతెత్త అరవడానికి చేతనయ్యుంటే దీన్నే చెప్పేవాణ్ణి. చివరిసారిగా ఈ ప్రపంచాన్ని చూస్తున్నాను. నా కళ్ళల్లో చీకటి కమ్ముతోంది. నా చుట్టూ అరుపులూ, ఏడుపులూ వినిపిస్తున్నాయి. నేను చావు బాటలో అడుగు వేస్తున్నప్పుడు నెహ్రూ తన కచేరీలో ఉన్నాడు. పటేల్ ఇంటికి వెళుతున్నాడు. మౌంట్ బ్యాటన్ తన ఇంట్లో విశ్రాంతిగా మాట్లాడుతున్నాడు. మీరాబేన్ హిమాలయాల్లోని ఆశ్రమంలో ఉంది.

" కస్తూర్ ! నువ్వెక్కడున్నావు ?"

" ఆకాశంలో మబ్బుల ప్రోగై ఉన్నాను. కాదు కాదు. గడ్డకట్టుకున్నాను." ఆమె మనస్సు పక్వమయ్యింది.

"మోహన్ ! మీరు ఎవరినీ ద్వేషించలేరు. దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడే దీన్ని సాధించారు. బోయర్లకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వాళ్ళకు వత్తాసుగా, స్వయం సేవకులను పోగేసి అంబులెన్స్ సేనను ఏర్పాటు చేశారు. స్వయం సేవకులు ముందుకు వచ్చింది మీ పైని గౌరవంతో. మీరు వాళ్లను పిలిచింది కూడా ఆంగ్లేయుల పైన మీకున్న మర్యాద కోసమే కదా?"

" వాళ్ళు విజయులైతే, రాజకీయ, శిక్షణ, వ్యాపార క్షేత్రాలలో మన ప్రజలకు అవకాశం దొరుకుతుంది అనే స్వార్థం కూడా ఉంది." చెప్పి ఆపేంతలో శరీరంలోని తూటాలు దిక్కుకొకటి జరుగుతూ శరీరంలో చాలా బాధను కలిగించాయి. ఇది మరణమే. నిజం. మరణమే. నేను ఈ భూమిని వదిలేసి వెళుతున్నాను. తొందర్లోనే ఇంకో చోటికి వెళ్ళిపోతున్నాను. ఎక్కడికి?

కస్తూర్ తనకు ఇచ్చిన సమయాన్ని పోగొట్టుకోవడానికి ఇష్ట పడలేదు.

" మొదట్లో నేను మీతోపాటు దక్షిణాఫ్రికాకు వచ్చినప్పుడు మీరు నాకోసం సమయం ఇవ్వాలని ఆశగా ఉండింది. కానీ, మొదటి ప్రయాణంలోనే నేను, పిల్లలూ వేరయిపోయాం. భాషకూడా రాదు. మనుషులూ అర్థం కాలేదు. మీ పరిస్థితి ఏమిటని తెలియదు. తరువాత వచ్చిన వార్తల్లో మిమ్మల్ని కొట్టి చిత్ర హింసలు పెట్టారు అని చెప్పారు."

మాటల నడుమ పాకుతున్న ఉద్దేశం గమనించిన మోహన్ మెల్లగా నవ్వారు.

" ఓడ నుండి దిగి నావలో లేప్పన్ కు వెళ్ళేటప్పుడు నేను కూడా అదే ఆలోచించాను కస్తూర్."

" చాలా భయపడ్డారా?"

" ఏమని చెప్పాలో తెలియడం లేదు. నావ ఇసుక దిబ్బను దాటగానే కుడివైపు నా పైన కక్ష కట్టిన దర్బాన్ నగరం. ఎడమ వైపేమో దట్టమైన అరణ్యంతో నిండిన కొండ. దాంతర్వాత పెద్ద సముద్రం. జన్మభూమిని వదలి, మిమ్మల్నీ వదలి నేను ఎక్కడో ఒంటరిగా ఉన్నాను. అదెలాంటి మనఃస్థితి అని చెప్పలేకున్నాను. కస్తూర్, ఒడ్డున దిగగానే వాళ్ళు నన్ను కొట్టినప్పుడు కూడా అదే మనఃస్థితి నాకు."

" ఇక్కడ ఎవరైనా డాక్టర్ ఉన్నారా ? ఉంటే దయచేసి ముందుకు రండి. బాపూకు గుండు దెబ్బతగిలింది. ఆయనకు ప్రథమ చికిత్స అవసరం. ప్లీస్, రండి....." దుఃఖం, ఆత్రత నిండిన గొంతుల ధ్వనులు మోహన్ మాటలను ఆపేశాయి. దాంతోపాటే శరీరాన్నినలిపేస్తున్న బాధ. బాపూ...బాపూ... పొత్తి కడుపుల నుండి ఉబికి వస్తున్న ఆక్రందన ద్వనులు. తట్టుకోలేక, ఛిద్రమైన మనస్సులతో కన్నీళ్ళు కారుస్తూ, బెదరి నిల్చున్నగుంపు మైదానంలోని శాంతిని భంగం చేసింది. బిర్లా మందిర్ ముందు జరిగిన తోపులాటను సర్దడానికి ముఖ్య ద్వారాన్ని మూసివేయడం జరిగింది.

" మోహన్ ! ప్రజ్ఞ పోగొట్టుకోవద్దు. ఈ ప్రజలను చూడండి. ఇది మీ కోసం చేరిన గుంపు. వాళ్లను మోసగించకండి. లేవండి. చివరి సారిగా మరొక్కసారి ప్రయత్నించి చూడండి."

" సరే కస్తూర్. తప్పకుండా ప్రయత్నిస్తాను. అప్పటిదాకా నాతోమాట్లాడుతూ ఉండు. అది నీ కర్తవ్యం కూడా. ఎందుకంటే, నువ్వు నా భార్యవు. "

"మోహన్ ! ఆ భార్య అనే స్థానానికి కూడా రెండు సార్లు సమస్య అయింది కదా ?"

" అలాగా ?.... నేను ఏదీ ఆలోచించే స్థితిలో లేను. ఎక్కువగా మాట్లాడ్డానికి చేతకావడం లేదు."

“ దక్షిణాఫ్రికాలో మనం ఫినిక్స్ కాలనీలో ఉన్నప్పుడు మీరు, ఇక కొన్నిరోజుల్లో నువ్వు భార్య అనే అంతస్తును కోల్పోతావు అని చెప్పినప్పుడు నేను చాలా భయపడ్డాను. క్రైస్తవ మత పద్ధతిలో చేసుకునే పెళ్ళిమాత్రమే చట్టబద్ధమైనది అని ప్రభుత్వం చెప్పింది. అయ్యో 1 ఇదేం తమాషా! ఇక ముందు 'ఉంచుకున్నది' అని పిలిపించుకునే దానికన్నా ఆందోళనలో పాల్గొని జైలుకు వెళ్ళినా తప్పులేదు అని నాకప్పుడు అనిపించింది. నేను ఒకవేళ జైలులో చనిపోతే నా ప్రతిమను చేయించి పూజిస్తానని చెప్పి మీరు నవ్వింది ఇంకా గుర్తుంది.”

“ ఆ... నువ్వు జైలుకు వెళ్ళింది అదే మొదటి సారి కదా ?”

“ అవును.... ఒకే జాగాలో ఉంటూ చూసిన మొహాల్నే చూస్తూ జైలులో ఉండడం చాలా దుర్భరం. జైలులో ఉన్నామనే జ్ఞాపకమే చాల భయపెడుతుంది. చిన్న చిన్నవిషయాలు కూడా పెద్దవిగా అగుపిస్తాయి. ఎవర్నీ క్షమించడానికి మనసొప్పదు. అల్పమైన విషయాలకే కొట్లాడే వాళ్ళం. “

“ నువ్వు చాలా పోట్లాడేదానివి కస్తూర్ ! అదీ సరైనదేమో మరి. ఎంతైనా శ్రీమంతుల ఇంటి పిల్లవి కదా ! అధికారం చలాయించకుండా ఉండగలవా ?”

“ అయితే, మీ మాట వినకుండా, నా ఇష్టం వచ్చినట్టు ఉన్నానని అంటున్నారా ?”

“అలా అని కాదు. కానీ, హరిజనులను లోపలికి వదిలేదాకా గుళ్ళకు వెళ్ళకూడదు అని చెప్పినా నువ్వు పురి జగన్నాథ్ గుడికి వెళ్ళొచ్చావు కదా “

“మోహన్ ! మీరు అనవసమైన మాటలు అంటున్నారు. దానికప్పుడే మన్నించమని అడిగానుగా ?”

“ అందుకే నేనే నిన్ను మన్నించమని అడగాలి. నీ పైన దృష్టి పెట్టకపోవడం నా తప్పు “

“మోహన్ !మీరు ఉపదేశించిందంతటినీ అలాగే స్వీకరించడానికి నాకు వీలు కాదు.”

“ అలాగయితే నువ్వు నా మాట ప్రకారం నడుచుకున్నది, ఆ రోజు మన్నించమని అడిగింది అంతా ఉత్త నాటకమేనా ?”

“నా గురించి మీరే ఒక నిర్ణయానికి రాకండి. మీరు చెప్పే మాట నాకు సరైనదనిపిస్తే, నేను దానికి తగ్గట్టు నడుచుకుంటాను. దక్షిణ ఆఫ్రికాలో అశుద్ధపు కుండను చేత్తో తీసేటప్పుడు నేను మొహం చిట్లించానని మీరు కోపగించుకున్నారు. మీ మాటకు నేను కట్టుబడవచ్చు. ఈ విషయంలో వేలాది తరాల నుండి నా పూర్వీకులు బోధించినా కూడా, దాన్ని నా మనసు సంతోషంగా నిరాకరించాలి అని కోరుకున్నారు. ఇది బలాత్కారం కాదా ? ఇది కూడా అహింసకు వ్యతిరేకం కాదా? కానీ, మీ అదృష్టమో ఏమో, మీరు చెప్పిన అనేక విషయాలు నాకు నచ్చాయి. ఎందుకంటే మీరు నాపైన ప్రేమతోనే ఉన్నారు.”

" మంచిది. దాన్నైనా తెలుసుకున్నావు కదా ! న్యుమోనియాతో నువ్వు ఢిల్లీలో పడకేసినప్పుడు టెలిగ్రాం పైన టెలిగ్రాం పంపాను. గుర్తుందా ? దేవదాస్ ఇంట్లో నిన్నుంచి, సుశీల నిన్ను చూసుకుంది. నువ్వు నేను వ్రాసిన ఉత్తరాలను దిండు క్రింద పెట్టుకుని అప్పుడప్పుడు తీసి చదువుకునే దానివట కదా ?"

"మన పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారా....." అప్పటి దాకా పులకించిన కస్తూర్ గొంతు కర్కశమయ్యింది. వెంటనే కోపంగా "మనకు హరిలాల్ పుట్టకున్నా బాగుండేది" అనింది.

"అవును. వాడివల్ల చాలా కష్టాలు అనుభవించాం"

"వాడు కూడా మీ వల్ల చాల ఆనుభవించాడు. మోహన్! వాడు మీ సగభాగం. వాడు "చీకటి గాంధి" అయితే మీరు " వెలుగుల హరిలాల్". వాడి ఆశలను, ఆశయాలను మీరు అణగదొక్కారు. మీ సిద్ధాంతాలతో వాటిని కప్పేశారు. అది ఒక దశలో స్ఫోటించాలి కదా ! వాడు అలాగే ఉంటాడు. వాడికి అలా ఉండడమే సాధ్యం." మొహానికి కొట్టినట్టు చెప్పి కస్తూర్ ఏడవసాగింది.

"కస్తూర్! దయచేసి నన్ను అర్థం చేసుకో. నేను...."

"చాలు. మీరు మాట్లాడకండి. అర్థం చేసుకోవడం అంటే మీకు తెలుసా ? మీ చుట్టూరా ఆడపిల్లలు, ఆడపిల్లలు, ఆడపిల్లలు. అదీ ఆ సరళాదేవి చౌధరాణికి మీరు ' అధ్యాత్మిక పతి' కూడాను."

"ఓ ! దీన్నేనా నువ్వు ధర్మపత్నికి వచ్చిన రెండో పరీక్ష అన్నది?"

"అవును..... అవును."

"కోపగించుకోకు కస్తూర్ ! ఇది నాకు చాలా ముఖ్యమైన సమయం. ఈ సమయంలో నువ్వు నాతో పాటు ఉండడమే నా అదృష్టం."

మనసు కరగినట్లుగా " మోహన్ ! మీరు నా ఆఖరి దశలో నాపై చూపిన ప్రేమ, విశ్వాసం నన్ను ఇక్కడికి తీసుకు వచ్చాయనుకుంటాను."

బాధను గురించిన చింతనను ఒప్పుకున్నాక బాధ మాయమయింది.." కస్తూర్ కస్తూర్ ! మన మధ్య గొడవలొద్దు. నువ్వు చెప్పాల్సిందేదో చెప్పు. బాధతో పోరాడుతూనే నేను పోతే, మక మనం మాట్లాడడం అసలు కానే కాక పోవచ్చు."

"మోహన్! మీ జీవితమే ఒక అన్వేషణ, పోరాటం, మీ సంతోషం అంటే ఆ అన్వేషణ నుండి దొరికే గెలుపు మాత్రమే. దీని మధ్యలో మీ జీవిత భాగస్వామిగా నేను వచ్చాను. జీవితంలోని ఆనందాలు మానవతకు అవరోధాలు అని మీరు అనుకున్నారు. మమ్మల్నీ అలాగే ఆలోచించేలా చేశారు. అకస్మాత్తుగా మీ జీవితంలొ స్వాతంత్ర సంగ్రామం

అనవసరమయ్యుంటే, మీరు దానిలాంటిదే ఇంకోదాన్ని ఎన్నుకునేవారు. మంచి భోజనం, సంగీతం, ప్రేమ, కామం ఇవన్నీ మూలభూత ఆశలు. అవి బ్రతుకును స్వారస్యకరంగా చేస్తాయి. ఇవన్నీ మీకర్థం కావు."

"కస్తూర్ ! దయచేసి కోపం చేసుకోకుండా మాట్లాడు. దాన్నిసహించే మనోస్థితి ఇప్పుడు నాకు లేదు. ఇంటి పనులు, ఆశ్రమం పనులు, రోగుల శుశ్రూషలు, స్వయం సేవకుల భేటీలు ఇలా నువ్వు నీ బాధ్యతలను పెంచుకుంటూనే పోయావు..."

"అవును. మీ ప్రేమను నేనొక్కదాన్నే పొందాలని నేనెప్పుడూ ఆశపడలేదు. ఉప్పు సత్యాగ్రహం తరువాత మీరు జైలుకు వెళ్లాక....."

"తెలుసు, నువ్వేం చెప్పక్కర్లేదు. పోలీసుల దాడికి లోనైన స్వయం సేవకుల గ్రామాలకు నడుస్తూ లేదా ఎడ్ల బండ్లలో వెళ్ళి వాళ్లకి ధైర్యం చెప్పడం, సాబర్మతి ఆశ్రమానికి వచ్చేవాళ్ళని విరామం లేకుండా కలవడం చేసేదానివి. మణిలాల్, రామదాసులను సాబర్మతి జైలులో కలిసినప్పుడు కూడా నువ్వు బాధ పడలేదు. వాళ్లతో అక్కడ కాపలా వాళ్ళు చాలా కర్కశంగా వ్యవహరించినట్టు వాళ్ల మొహాలు చెప్పుండవచ్చు. దీన్నే కదా నువ్వు చెప్పలనుకున్నది. దీన్ని నేను చాలా సార్లు చెప్పాను కదా ! వాళ్ళు అనుభవించిన బాధ నీ మనసులో ముద్ర పడి పోయింది. అందుకే అది త్యాగం అనిపిస్తుంది."

ఇద్దరి నడుమ భారంగా పడున్న మౌనాన్ని కస్తూర్ పడగొట్టడానికి ప్రయత్నించింది.

"మోహన్! మీ దేహం నుండి కారుతూన్న రక్తపు వాసనకు ఈగలు ముసురుకుంటున్నాయి. చూడండి. నా చెయ్యి ఆతుర పడుతోంది. నేను దగ్గరుండుంటే, విసన కర్రతో విసిరేదాన్ని. ఇప్పుడు మీరు లేవడం మంచిది."

"నీ స్వచ్ఛతా బుద్ధి ఇంకా పోలేదా?" బాధతో నవ్వడానికి ప్రయత్నించినప్పుడు, వీలు కాకుండా పోవడం అర్థమయ్యింది.

"మీరు మీ చేత్తోనే తూటాలను పీకెయ్యండి. రక్తం కారుతున్న చోట్ల చేతిని అదిమి పెట్టుకోండి. అంతే చాలు. లేచెయ్యొచ్చు."

"లేదు కస్తూర్ ! లేవడానికి చేతకావడం లేదు అని నిర్ధరించుకున్నాను. ఇక నేను నడవలేను. మాట్లాడడానికి కూడా వీలు కాదు. మను తన వద్ద ఉంచుకున్న అద్దాల డబ్బాకు, డైరీకి ఇక పనుండదు. నా తెల్ల శాలువా ఇప్పుడు ఎర్రగా అయ్యింది. గడ్డి తివాచీ పైన చాప వేసుకుని సూర్యుడి వెలుగులో ఒళ్ళు కాచుకునే అవసరం ఇక ఉండదు. ఫిబ్రవరు నెలలో వార్ధాకు వెళ్ళే ఏర్పాటు చెయ్యమని చెప్పాను. ఇక దానికి అవకాశం ఉండదు. తినాలని లేదు. చిరునవ్వు నవ్వాలని లేదు. విచారించడమో, జ్ఞాపకమో ఏదీ అక్కర్లేదు. చివరిగా, నా చెవిలో మోగుతున్న నీ గొంతు నిలిచిపోతే, నా ఊపిరి పైకెగసి, మబ్బుతో ఏకమైపోతుంది, కస్తూర్."

చలికాలపు సూర్యుడు అలసిపోయి పశ్చిమాద్రిని దిగినప్పుడు మెల్లగా లేచిన గాలి, దేహాన్ని పులకింప జేసింది. అది కస్తూర్ దుస్తులను పట పటమనిపించగా మోహన్ " కస్తూర్.... నీ చెంగును సరి చేసుకో... జారుతోంది చూడు" అన్నారు.

కస్తూర్ గలగల నవ్వేస్తూ " మీరు మహాత్ములయినా మగవారనిపించారు" అన్నది. "జీవితాన్నంతా అసామాన్య ఆలోచనలతో నింపుకున్న మీరు, సామాన్య జీవితం ఎలా ఉంటుంది అని అర్థం చేసుకోవాలి. అది మీ ముందు జన్మకైనా సిద్ధించనీ."

" అది సరే. నువ్వు అప్పుడు కూడా నాతో ఉండాలనుకుంటున్నావా?"

" అవును... అనుకుంటున్నాను." కస్తూరి అనింది.

ప్రశ్నకూ, ఉత్తరానికి మధ్యన ఒక లిప్తపాటు విరామం ఉండింది అని ఇద్దరికీ అనిపించింది.

. ★★★

## ఇంట్లో ఒంటరిగా..

కన్నడ మూలంః శ్రీ నల్లతంబి

తెలుగు అనువాదం: చందకచర్ల రమేశ బాబు

ఆ రోజు ఇంట్లో అద్దం ముందు నగ్నంగా నిల్చున్నాను.

ఈ రోజే నేను నా దేహంలోని అంగాంగాగలను విడివిడిగా, స్పష్టంగానూ, ఓపికతోనూ చూస్తోంది. నా దేహంలోని భాగాలే అన్నీ. రోజూ చూసేవే. కానీ సరిగ్గా గుర్తు పట్టగలనా ? ఏ భాగం వంకరగా ఉంది, ఎక్కడ మచ్చ, మరక, గీత – ఏ భాగం నాకిష్టం – నీ కళ్ళు చిన్నవి, చేతులు రాజు చేతిలా పొడుగు, మనోహరమైన నవ్వు, అంతగా తెల్లగా లేని పళ్ళు – ఇలా మిమ్మల్ని చూసేవాళ్ళు ఎవరైనా, ఎప్పుడైనా, ఏదో ఒకటి చెప్పుంటారు కదా – అలా నన్ను అడిగితే నేను వెంటనే చెప్పగలనా ?

అందరి దేహాలు అర్ధనారీశ్వరుడిలా ఉంటుందట. ఒక భాగమంతా ఆడదా అని పురుషులు, ఇంకో భాగం మగా అని స్త్రీలు కంగారు పడకండి. నేను చెప్పబోతోందే వేరు. దేహంలోని ఒక్క సగం ఇంకో సగం కంటే పొడుగ్గానో, పొట్టిగానో ఉంటుందట. ఎక్కడో చదివింది గుర్తు. మెదడులోని ఏ మూలలోనో దాగింది, ఇప్పుడు ఒంటరిగా ఉండేడప్పటికి

పైకి వచ్చింది. ఈ రోజు ఇవన్నీ నిజమా అని పరీక్ష చేసి చూసే సమయం, ఏకాంతం రెండూ దొరికాయి. ముందుగా సులభంగా చూసుకోవడానికి వీలయ్యింది – మోచేతులు రెంటినీ కలిపి చిటికెన వ్రేలు వరకూ జోడించి చూశాను. నా కుడిచెయ్యి ఎడమ చేతికంటే కొద్దిగా పొడుగ్గా ఉన్నట్టు అనిపించింది. అది నిజమే మరి. నాకు కనిపిస్తుంది తప్పా లేక నాకేమైనా దృష్టి దోషమా అనే సందేహం కలిగింది. వెంటనే నా రూములోని టేబల్ డ్రాయర్ నుండి టేపును తీసి కొలిచి చూశాను. కుడి చెయ్యి మోచేతినుండి చిటికెన వేలిదాకా 45 సెం.మీ చూపించింది. ఎడమ చెయ్యి 44.5 సెం.మీ చూపించింది. పాదాలను కొలిచాను. ఒక పాదం 26 సెం.మీ ఉంటే ఇంకోటొ 26.5 సెం.మీ ఉంది. అదే మాదిరిగా వేళ్ళు, చెవులు, ముక్కు వీటన్నిటిని ఎలా కొలవాలో తెలియక తన్నుకున్నాను. దీని గురించి ఎవరినైనా కనుక్కోవాలని అనిపించింది.

ఇలా నగ్నంగా ఉన్నప్పుడు, మన వద్ద అన్నీ ఉన్నట్టు ఒకసారి, ఏమీ లేనట్టు ఒకసారి అనిపించింది. ఇలా నగ్నం కావడానికి ముందు కొద్దిగా జంకు అనిపించినా, కొన్ని క్షణాల్లో అది దూరమవుతుంది. నగ్నంగా ఉండడం ఒక అందమైన స్థితి. కానీ అసహ్యం అంటారు కదా. ఎందుకో ?

ఒక సామెత ఉంది కదా, అదేమిటి, "పని లేని మంగలి పిల్లి తల...." ఇలా ఏవేవొ ఆలొచిస్తాడు వీడు, వీడికి మతి స్థిమితం లేదు అనుకోవద్దు. అలా ఏంకాదు. ఈ లాక్ డౌన్ విధించడానికి కొన్ని రోజుల ముందు మా అత్తగారిని అంటే నా భార్య తల్లిగారిని, ఆమెకు ఆరోగ్యం సరిగ్గా లేదు అంటే, చూసి వస్తామని, రెండు రోజుల్లో వచ్చేస్తామని నా భార్య, నా కొడుకు ఆమె ఊరికి వెళ్ళారు. మళ్ళీ తిరిగి రావడానికి వీల్లేకుండా ఇరుక్కున్నారు. ఈ లాక్ డౌన్ ఇంకా ఎన్నాళ్ళుంటుందో? బహుశ ఒక నెల ఉండచ్చేమో !

వాళ్ళేమైనా ఈ దేశం యొక్క బీద ప్రజలా, అక్కడి నుండి ఎండలో పడి రోడ్లు పట్టుకుని రావడానికి ?

దాదాపు ఒక నెలపాటు ఇంట్లోనే గడపాల్సి వచ్చిన నేను ఇంకేం చెయ్యగలను ? యథార్థ జీవితం ఇలా సంక్లిష్టమైనప్పుడు, ఒక మాయాలోకాన్నిసృష్టించుకుని అందులో కొంతకాలం జీవించి చూడవచ్చును. ఇలా ఏదేదో పిచ్చి పిచ్చిగా ఆలోచించేవాణ్ణి.

ఉదయం ఆరుగంటలయ్యుంటుంది. మెలకువ వచ్చింది. ఒక కప్ కాఫీ చేసుకుని హాలులోని ఫ్రెంచ్ కిటికీ తెరను జరిపి, తలుపులను తీసి అక్కడున్న అరుగు మీద కూర్చున్నాను. గాలి ఆహ్లాదంగా ఉంది. ఇలా తెల్లవారునే లేచి కిటికీ ప్రక్కన కూర్చుని, కాఫీని ఆనందిస్తూ, చల్లటి గాలిని అనుభవించినట్టు జ్ఞాపకమే లేదు నాకు.

బయట కను చూపు మేరా కనిపించే పచ్చటి చెట్లు. ఈ అపార్ట్ మెంట్ కు వచ్చి ఒక సంవత్సరమే అయినా పక్షుల కిలకిలారావం వింటోంది ఈ రోజే. లేదా అవి ఈ రోజు దాకా కిలకిలమనలేదా ? మనస్సు తేలిగ్గా ఉంది. ఇంకో కాఫీ కావాలనిపించింది. చేసుకుని తీసుకుని అదే జాగాకు తిరిగివచ్చి కూర్చున్నాను. ఈ ఉదయం ఎవరూ వాకింగ్ కు

బయలుదేరినట్టు లేదు. అందరికీ ఇప్పుడు చాలా టైముంది. వాకింగ్ కు పర్మిషన్ ఇస్తే గుంపులు గుంపులుగా చేరి గంటల కొలదీ మాట్లాడుతూ నుంచుంటారు. సామజిక దూరం మరచిపోతారు. అందుకే వాకింగ్ నిషేధించారు. నిన్న సాయంత్రం ఇంటికి కావలసిన సరుకులను తీసుకు రావడానికి మా బిల్డింగ్ లోని సూపర్ మార్కెట్ కు వెళ్ళినప్పుడు నోటీస్ బోర్డులో సూచన కనిపించింది.

ఎంత సేపు అలా కూర్చున్నానో తెలియలేదు. స్నానం చేసి వచ్చి పూజా గది ( ఉత్త మంటపం మాత్రమే) లో దీపారాధన చేశాను. ఊరికెళ్ళేటప్పుడు చెప్పి వెళ్ళింది " మరచిపోకుండా పొద్దునే స్నానం చేసి దేవుడికి దీపం పెట్టండి" అని. " మన ఇంటి దేవత బనశంకరి అమ్మవారి కళ్ళు ఎలా మెరుస్తున్నాయో చూశారా ! ఈ దీపం వెలుగులో ఆమె నవ్వును చూడడానికి రెండు కళ్ళు చాలవండీ " అని ఆమె అప్పుడప్పుడు చెప్పడం విన్నాను. ఫోటోలోని అమ్మవారు మందహాసం చిందిస్తున్నారు. ఇన్ని రోజులు ఇది చూడకుండా ఎలా ఉండిపోయానో అని బాధపడినా ఈ రోజు చూసింది తృప్తినిచ్చింది. "దుర్గాదేవి సన్మార్గదర్శకీ, దయారూఢే దయాదృష్టే దయార్ద్రే దుఃఖవిమోచని, సర్వపత్తారికె దుర్గే జగద్ధాత్రి నమోస్తుతే జగద్ధాత్రి కల్ప...." ఇప్పుడు తన పుట్టింటి చల్లని ఒడిలో ఈమె పాడుతూ ఉంటుంది. రోజూ వినవస్తున్నా ఈరోజెందుకో స్పష్టంగా వినిపిస్తోంది, చెవిలో తేనె కురిసినట్లు.

ఫ్రిడ్జిలో ఒక వారానికి సరిపడా ఇడ్లి పిండి రుబ్బి పెట్టి వెళ్ళింది తను. నా బాగోగులు చూసుకోవడమంటే ఆమెకు చాలా ఇష్టం. పద్ధతిగా అంతా చేసిపెట్టి వెళ్ళింది. పిండిని తీసి ఇడ్లీ ఉడికించుకుని టొమాటో చట్నీతో పాటు తిన్నాను. తనే రుబ్బిపెట్టిన పిండే అయినా ఎందుకో ఆమె చేతి రుచి రాలేదు అనిపించింది.

ఫ్లోరింగ్ పైనంతా అడుగుల ముద్రలు. అంత దుమ్ము పేరుకుంది. ఈ రోజు చిమ్మేసి, బట్ట పెట్టి తుడవాలనుకున్నాను. చీపురు కోసం వెతికితే గ్యాస్ సిలిండర్ వెనుక కనిపించింది. తీసుకుని హాలు, కిచెన్, బెడ్రూములు అంతా చిమ్మి, ప్లాస్టిక్ చెత్త బుట్టలో వేశాను. ఒక బకెట్ లో నీళ్ళుతెచ్చుకుని మాప్ తో తుడిచాను. నడుము నొప్పిగా అనిపించింది. ఇలాంటి నొప్పిని ఇంతవకూ అనుభవించలేదు. చిమ్మేటప్పుడు, తుడిచేటప్పుడు అప్పుడప్పుడు లేచి నుంచుని, విశ్రాంతి తీసుకోనందున ఆయాసం వచ్చింది. ఇంటి పనిమనిషి ఇలా ఎప్పుడూ విశ్రాంతిగా కూర్చోవడం చూడలేదు నేను.

సాయంత్రం ఏడు గంటలకు బావమరిది అమెరికా నుండి తెచ్చిచ్చిన శివాస్ రీగల్ బాటల్స్ గుర్తొచ్చాయి. ఆమె ఉంటే ఒక్క శనివారం మాత్రమే నాకు అనుమతి. క్యాలండర్ చూశాను. మంగళవారం అని ఉంది. పేజీలు చింపలేదేమో అని మొబైల్ లో చూశాను. అది కూడా మంగళవారమే అని చూపింది. ఆమె ఊళ్ళో లేదు కదా అని అంత సులభంగా తాగడానికి మనసొప్పలేదు. ఆమె ఐతే అంత దూరం నుండే వాసన కనిపెట్టేస్తుంది. కానీ, ఒళ్ళంతా నొప్పులు. అదీ నడుమయితే విరిగిపోయేటట్టనిపించింది. బాటల్ తీసుకుని గ్లాసులోకి ఒక పెగ్ వేసుకుని, ఐస్ వేసుకుని ఆ ఫ్రెంచ్ కిటికీ అరుగు పైన కూర్చున్నా. తెరలు తీశాను. కిటికీ తెరిచే ఉండింది. ఇలాంటి అందమైన జాగాను ఇన్నాళ్ళూ

వదులుకున్నందుకు బాధపడ్డాను. అదెలా నాకు తెలిసి రాలేదు ? మొదటి గుటక ఐస్ చల్లదనంతో గొంతులోకి ఘాటుగా దిగింది. హాలులో వినిపిస్తున్న మంద్రమైన సంగీతం ఎదను తాకింది. అదేమో తెలియని ఆనందం. ఏకాంతం ఇంత బాగుంటుందని ఇప్పటిదాకా తెలియలేదెందుకో !

మూడు దోసెలు తిని పక్క మీద పడుకున్నాను. తను గుర్తుకొచ్చింది. పడుకునే సమయంలో ఆమె ఎక్కువగా గుర్తుకు వస్తుంది. శరీరమంతా నొప్పులు. ఇలా నొప్పిగా ఉన్నప్పుడు ఆమెను ఉసికొల్పి పైకి లాక్కుని పడుకోబెట్టుకోవడం గుర్తుకు వచ్చింది. వచ్చే నెలలో పనిమనిషి జీతంలో కోత వెయ్యకుండా ఇమ్మని ఈవిడకు చెప్పాలి. నావైపు గుర్రుగా చూస్తుంది. పనిమనిషి రాని రోజు తనెంత కష్ట పడుతుందో నాకు బాగా తెలుసు. కానీ చెపితే అర్థం చేసుకుంటుంది. మంచి మనిషి,

పది గంటలకల్లా కళ్ళు లాగుతాయి. అబ్బాయి వారంలో మూడు నాలుగు రోజులు ఎలా నైట్ షిఫ్ట్ చేస్తాడో అని అనిపించింది. ఈ ఉద్యోగం వదిలెయ్యాలని చెప్పాలి. అమెరికా వాళ్ళకి పగలు, ఇక్కడ రాత్రి. అందుకే వాడు రాత్రంతా మేలుకునుండాలి. వాళ్ళ ఉద్యోగం– వాళ్ళ బాధ్యత మరి. మరి రాత్రిళ్ళు మేలుకుని ఉండాల్సి రావడం? మరి ఒక డాలర్ విలువ డెబ్బై రుపాయలు అంటూ నోటులోని గాంధీజి నవ్వారు ! అబ్బాయిని పగటి పూట పనిచేసే అవకాశం ఉందా కనుక్కోమనాలి.

శివాస్ రీగల్ ఊగింది నిద్ర పోయాను.

కమోడ్ పైన కూర్చున్నాను. కొద్ది సేపట్లో కడుపు ఖాళీ అయ్యింది. చెప్పుకోలేని నెమ్మది. రోజూ ఉదయాన్నే ఇక్కడికి వచ్చి కూర్చుంటాను. కానీ ఈ చెప్పుకోలేని నెమ్మదిని ఇంతవరకూ అనుభవించలేదు. షవర్ కింద నుంచున్నప్పుడు పడే వేణ్ణీళ్ళు ఇంత ఎప్పుడూ హాయిగా అనిపించలేదు. సమయం లేదనుకుని సుఖాన్నిచ్చే క్షణాలను పోగొట్టుకున్నానేమో ! ఇలా ఆ క్షణాలను పోగొట్టుకుని వేళా పాళా లేకుండా పనిచేసిన జాగాలలో ఎలా నెమ్మది అనిపిస్తుంది ?

వేడి వేడిగా తల నుండి పాదాల దాకా ప్రతి కణాన్నీ ముద్దుపెట్టుకుంటున్న పూలవాన దైహిక శ్రమను దూరం చేసింది.

ఒక రాత్రి ఈవిడ నన్ను నిద్ర లేపింది. వదులుగా కట్టుకున్న లుంగీని, బనియన్ ను విప్పింది. తనూ నగ్నమైంది. ఈ నీటి చినుకులు నన్ను తాకినట్టు నా ఒళ్ళంతా తన లేత పెదవులతో తడిపింది. నాకెందుకో బిడియంగా ఉండింది. ఇద్దరూ అలసి పోయాక నా చాతీ పైన తల ఉంచి, కళ్ళు మూసుకుని, తన వేళ్ళను నా ఎద పైని కేశాలలో ఆడిస్తుండగా అడిగాను “ ఇదేమిటి ఈ రోజు ?” కళ్ళు తెరిచి చిన్నగా నవ్వింది. “ ఎప్పుడూ దేని వెంటో పరుగెత్తిన అలసటలో మీరు నిద్రపోతారు. ఇంటి పనుల వల్ల కలిగిన ఆయాసంతో నేను అర్ధనిద్రలోనే ఉంటాను. ఈ రోజు అబ్బాయి పొద్దువ ఆలస్యంగా వస్తానని చెప్పి వెళ్ళాడు. అందుకే ......” అంటూ రాగం తీసింది. “ ఈ వయస్సులోనా ?” అన్నదానికి

" మనకు అంతేం వయసు దాటిందని? మీకు 52 నాకు 49 అంతే. ప్రేమ ఉన్నంతవరకూ యౌవనమే" అన్నది. ఆ రోజు ఉదయం నిద్ర లేచేదాకా బట్టల్లేకుండానే ఉన్నాము. రోజూ షవర్ క్రింద నగ్నంగానే నుంచుంటాను. కానీ ఈ రోజు నగ్నత ఆ రోజు నగ్నతను గుర్తుకు తెచ్చింది. ఎందుకో !

టివి ఆన్ చేస్తే రహదారి మొత్తం కమ్మేసిన వేలాది కాళ్ళు. భారత దేశమంతా నడుస్తున్నట్టు అనిపించింది. పొట్ట కూటి కోసం సొంత ఊరిని వదిలిపెట్టి వచ్చిన వారు, ఆకలితో తమ ఊళ్ళకు వెళుతున్నారు. వేలాది మైళ్ళు నడిచే శక్తి వాళ్ళ కాళ్ళలో ఉందా ? ఇల్లు పిలిచేటప్పుడు మనస్సు దేహాన్ని మోసం చేస్తుంది ! రహదారి పక్కన ఉన్న పల్లె ప్రజలు, నగరంలోని కొన్నె సేవా సంస్థలు ఆ ఆకలి కడుపులకు అన్నం, నీరు ఇచ్చారు. దారిలో తినడానికి పొట్లాలు కట్టి ఇచ్చారు. కాళ్ళకు చెప్పులు ఇచ్చారు. రాజకీయ ధురీణులు తమ పప్పులు ఉడకడానికి వేలాది ప్రజలను ఆకలికి గురిచేస్తే, ఆకలి తెలిసిన పామరులు ఆకలిని పంచుకుంటున్నారు. నా స్నేహితుడు సభ్యుడుగా ఉన్న ఒక సేవా సంస్థకు కొంచెం డబ్బు పంపాలని మొబైల్ చేతిలోకి తీసుకున్నాను.

శాంతియుతమైన ప్రపంచాన్నే కోరుకున్నాము. కానీ  అది స్మశాన మౌనమవుతుందని అనుకోలేదు.

చదివే అలవాటు నాకు పెద్దగా లేకపోయినా, ఈవిడ చదువుతూ అలాగే ఉంచిన నవలను తీసుకుని ఆ ఫ్రెంచ్ కిటికీ అరుగు పైన కూర్చున్నాను. ఆ జాగాను మనసు అప్పుడప్పుడు వెతుకుతూ పోయింది. మనిషి మనిషికి ఎందుకింత ప్రేమ. మనిషి పైన ఎందుకింత ద్వేషం? ఈవిడ ఎప్పుడైనా కోపంలో ఉన్నప్పుడు " మీకయితే అందరూ మంచివాళ్ళే. అందుకే మీ అన్నయ్య మీకు రావలసిన ఆస్తి మింగేశారు. " " ఎవరైనా తాను ప్రేమించిన అమ్మాయి పెళ్ళికి వెళ్ళి గిఫ్ట్ ఇచ్చి వస్తారా ?" " ఆఫీసులో మీకన్నా చిన్నవాళ్ళు ప్రమోషన్ తీసుకుని పైకి వెళ్ళారు. మీరు ఉన్నారు, ఉత్త దద్దమ్మ " అంటూ పాతవన్నీ కెలుకుతుంది.  అంతలోనే మళ్ళీ " పోనెండి. మనకెందుకవన్నీ ! మీ అన్నయ్య మీకు మోసం చేసి ఏం సుఖం బాముకున్నారు ? చేతికి అంది వచ్చిన కొడుకు పుటుక్కుమని పోయాడు." " మిమ్మల్ని ప్రేమించి మోసం చేసి పెళ్ళి చేసుకున్నామెకు ఇప్పటిదాకా ఒక్క నలుసైనా కలుగలేదు" " మీ ఆఫీసులో ప్రమోషన్ తీసుకుని వెళ్ళిన వాళ్లంతా మీ వద్దకేగా సలహాలకు వస్తారు !" అంటూ నన్ను బుజ్జగిస్తుంది. వీళ్ళందరి బ్రతుకులు బాగో లేవని సంతోషిస్తూందా ! నేను పైకి రాలేకపోయాను అని దుఃఖపడుతోందా? నాకు అర్థం కాదు. నేను ఎప్పుడు తెలుసుకున్నాను గనక ! ఇన్ని సంవత్సరాలైనా ఎందుకు నాకివన్నీ గుర్తుకు రాలేదు !

ఆ ప్రేయసి ఈ రోజు గుర్తుకు వచ్చింది. ఆమె అందగత్తె. నేను ఆమెను ప్రేమించానని కానీ లేక ఒక మగవాడిననీ చెప్పడంలేదు. ఆమె నల్లటి దట్టమైన ఉంగరాల జుత్తులో ఆడుకోవాలని నా వ్రేళ్ళు తహతహలాడేవి. తేనె రంగు చురుకు కళ్ళు నన్ను తుమ్మెదలా ముద్దుపెట్టుకొమ్మని పిలిచేవి. నవ్వితే ఎడమ బుగ్గ పైన పడే చిన్న చొట్ట నేను దారి తప్పడానికి ప్రేరేపించేది.  చేనేత చీరలో ఆమె కాలేజీకి వస్తుంటే ఆమె వైపు తిరిగి చూడని చూపులే ఉండేవి కావు. ఇద్దరి

కళ్ళూ మాట్లాడుకోవడం తెలుసు. ఎవరి కళ్ళు మొదట ప్రేమను వ్యక్తం చేశాయో తెలియలేదు. కాలేజిలోని మిగతా విధ్యార్థులకు నామీద అసూయ. అందుకే నాతో ఎక్కువగా ఎవరూ మాట్లాడేవారు కారు. ఏదైనా పొందాలంటే అదృష్టంతోపాటు ధైర్యం అవసరం. అలా దొరికిన అదృష్టాన్ని దక్కించుకునే ధైర్యం నాలో లేక పోయింది. ఉద్యోగం లేనివాణ్ణి తన తండ్రి వద్దకువెళ్ళి మీ అమ్మాయిని ఇమ్మని ఎలా చెప్పను ? ఒక రోజు ఆమె తన పెళ్ళి పత్రికను నా చేతిలో కుక్కి కోపంతో, ద్వేషంతో ఒక్క ఏడ్పు ఏడ్చి వెళ్ళి పోయింది. నా మనస్సు నా మాట వినలేదు. రిసెప్షన్ కు ఒక బొకేతో వెళ్ళి ఆమెకూ ఆమె భర్తకూ శుభాకాంక్షలు చెప్పి, వచ్చిందానికి గుర్తుగా ఒక ఫోటో దిగి వద్దాం అని వెళ్ళాను. తను నాకు పత్రిక ఇచ్చింది రమ్మని పిలవడానికి కాదు. ఏడ్పించడానికి. నేను వస్తానని ఊహించని ఆమె కళ్ళల్లో అంతవరకూ నెలకొన్న నవ్వు మాయమై కోపంతో కూడిన గర్వం తొంగిచూసింది. ఓరగాచూస్తూ నాకంటే అందంగా ఉన్న తన భర్తను చూపిస్తూ " ఎలా ఉన్నాడు" అన్నట్టు కనుబొమ్మలు ఎగరేసింది. ఎవరికో చెప్పినట్టు " భోజనం చేసి వెళ్ళు" అని చెప్పిన ఆమె మాట విననట్టు ఒక విసుగుతో కూడిన చిరునవ్వును పారేసి, మంటపం గడపవరకూ వచ్చి తిరిగి చూశాను. అతిథితో మాట్లాడుతూ ఆమె నవ్విన నవ్వు, పెళ్ళి సందడినీ దాటి వేళాకోళంగా నా చెవికి వినిపించింది.

ఇంటికి వెనుదిరిగే దారిలో ఉన్న బార్లోకి వెళ్ళాను. " సార్ అప్పుడే 10.30 అయ్యింది. ఇదే ఆఖరు ఆర్డర్" అన్నాడు వెయిటర్. మూడు లార్జ్ లతో పాటు ఒక డబల్ లార్జ్ తెప్పించుకుని తాగేసి, బార్ లోని టాయ్లెట్లో ఐదు పెగ్గులలో దాచిన ఆత్రతను మూత్రంగానూ, కన్నీళ్ళగాను ప్రవహింప చేసి ఇంటికొచ్చాను.

పెళ్ళైన కొత్తలో నిజాయితీగా ఉండాలని భార్యతో నా ప్రేమ ప్రకరణాన్ని చెప్పాను. ఆమె అప్పుడేమో గంభీరంగా తీసుకోలేదు. కానీ తనకు ఏదైనా కొరత అని అనిపించినప్పుడల్లా " ప్రేయసి పెళ్ళికి బొకే తీసుకెళ్ళిన ఆసామీ మీరొక్కరే ఉండాలి" అని ఒక మూర్ఖుడి కింద జమకట్టేది. తన భుజాలకంటే ఎత్తుగా ఎదిగిన కొడుకుతో ' డాడీ ప్రేమ కథ' ను చెప్పి గేలి చేస్తూ నవ్వేది. అప్పుడంతా నా బాధను నవ్వుల్లో తేల్చేసేవాణ్ణి. తమాషాగా తీసుకునేవాణ్ణి. కానీ ఇవ్వాళ ఎందుకో ఈ పాత ప్రేయసి సతాయిస్తోంది. ఇన్ని రోజులు నాకు ఆమె గురించి ఆలోచించే వ్యవధే లేకుండా పోయిందా ? ఆమె కూడా ఇప్పుడు నా లాగా ఒంటరిగా ఉంటుందా ? మొబైల్ నంబరు ఉండుంటే కాల్ చేసి మాట్లాడే పని. ఎందుకు ?

అల్మరాలో ఉన్న పాత ఆల్బం తీసాను. కొడుకుకు పన్నెండేళ్ళు ఉన్నప్పుడు సైకల్ పై నుండి పడి కాలు విరిగింది. కట్టు కట్టించుకుని ఇంట్లో ఉన్నాడు. వాడికి నొప్పి తెలియరాదని ఆ ప్లాస్టర్ పైన డొనాల్డ్ డక్, మిక్కీ మౌస్, స్పైడర్ మాన్, బ్యాట్మాన్ లాంటి స్టిక్కర్లను అంటించి " వి లవ్ యు, మమ్మి డ్యాడి" అని వ్రాశాము. ఈమె కొడుకు కట్టుకు ముద్దు పెడుతున్న ఫోటోను చూస్తూ కళ్ళు చెమర్చాయి. వాడు ఐదు సంవత్సరాల వయసప్పుడు శేవింగ్ బ్రష్ కు క్రీం వేసుకుని చెంపలకు రాసుకోవడం, నా బూట్లలో తన చిన్ని కాళ్లను దూర్చి తప్పటడుగులు వేస్తూ నడవడం, ఇలా అనేక

ఫోటోలు. నేనూ ఈమె ఆగొంబె మంచులో ఒకరినొకరు హత్తుకుని నుంచున్న ఫోటోను కాలేజి చేరిన కొడుకు చూసి " ఓ...రొమ్యాంటిక్" అన్నది గుర్తొచ్చింది. మళ్ళీ ఇప్పుడే చూడడం.

కొడుకు ఊళ్ళో లేని రోజు ఆశ్లీల డిస్క్ తీసుకొచ్చి ఆమెకు వేసి చూపించాను." ఛీ... అసహ్యం.. థూ.. సిగ్గు లేదు " అనిందే తప్ప,ఆపమనలేదు. వాలుచూపులతోనే చూస్తూ కనిపించింది. ఆ రోజు రాత్రి నాకంటే వేగంగా ఉంది. మరుసటి రోజు ఆ డిస్క్ ను మంచంపైని పరుపు కింద దాచి పెట్టినప్పుడు " వయసుకు వచ్చిన అబ్బాయి ఉన్న ఇంట్లో ఏమిటిది?" అనింది. క్రిందటి రాత్రి తను చేసి ఆర్భాటాన్ని మరచిపోయి నేనొక పోకిరి మాదిరిగా చూసింది. నాకు ఒకటే నవ్వు. ఆ రోజు ఆదివారం కాబట్టి ఇంట్లోనే ఉన్నాను. కానీ ఎక్కువగా నా కంటబడలేదు.

ఆ డిస్క్ ఇంకా ఇక్కడే ఉందా అని చూశాను. కనిపించింది. వేసి చూశాను. ఈ వయస్సులోనూ నరాలు కిర్రెక్కాయి. కామం ఉత్త దేహంలో మాత్రమే ఉండదు కదా !

నాకు స్నేహితులు తక్కువ. ఎక్కువగా ఎవరూ ఫోన్ చెయ్యరు. నేను మంచి మాటకారిని కాను.  ఒకటి రెండు నిమిషాల్లో నా మాటలు వాళ్ళకు విసుకు కలిగిస్తాయి.

రోజుకు నాలుగైదు సార్లైనా ఆమె ఊరునుండి ఫోన్ వస్తుంది. " వంటంతా అవగానే గ్యాస్ ఆఫ్ చెయ్యడం మరచిపోకండి" " రోజూ ఇల్లంతా చిమ్మండి" " గీసర్ ఆఫ్ చెయ్యడం మరచిపోకండి" " టైముకు సరిగ్గా భోంచెయ్యండి" " బీపీ మాత్ర వేసుకోవడం మరచిపోకండి" "నేను ఇక్కడున్నానని చెప్పి రాత్రంతా సంగీత దర్శకుల నిద్రలు పాడు చెయ్యకండి"  ఇలా ఏదో ఒకటి గొణుగుతూనే ఉంటుంది.  ఆడవాళ్ళకు ప్రత్యేకమైన అధికారయుతమైన, ప్రేమపూర్వకమైన గద్దించడాలు అవి. నేను ఆఫీస్ క్యాంపులలో ఉన్నప్పుడు ఎప్పుడైనా ఇలా ఫోన్ చేసి అడిగానా అని ఒకసారి ఆలోచించాను.

ఆ రోజు తెల్లవారు జాము ఆహ్లాదంగా ఉంది. ఆ ఫ్రెంచ్ కిటికీ అరుగు పైన కూర్చున్నాను. చేతిలో పొగలు కక్కుతున్న కాఫి. బయట పక్షుల కిలకిలారావాలు. తనకు నేనుగానే ఫోన్ చేశాను.

" ఇక్కడ పక్షులు కిలకిలా అంటున్నాయి. ఇంపుగా ఉంది. కిటికీ వద్ద చల్లగా ఉంది. నువ్వుంటే బావుండేది" అన్నాను.

ఉత్తర క్షణంలో అటు వైపు నుండి నవ్వుతో పాటు గద్గద స్వరం వినిపించింది.

★★★★★★★★★★★★★★★★★★★★★

# అంతరంగం

కన్నడ మూలం: ఎమ్.ఎస్.శ్రీరామ్

తెలుగు అనువాదం: చందకచర్ల రమేశ బాబు

మూడు ముక్కల అద్దం ముందు అతడు తన ముఖాన్నే చూసుకుంటూ కూర్చున్నాడు. ప్రపంచం చాలా ముందుకెళ్ళింది అని అతడికి అప్పుడే అనిపించింది. నలభైయ్యారు సంవత్సరాల వయసు ముఖాన్ని ఇరవై సంవత్సరాల కాలేజి యువకుడి మొహంలా మారుస్తున్న వైఖరి అతడికి ఆశ్చర్యం కలిగించింది. అతడి నెరిసిన వెంట్రుకలను వెనిక్కి దువ్వి, అనవసరమైన వాటిని కత్తిరించి, హేర్ డై పోసి, బ్లోయర్ తో గాలి ఊదడంలో కేశాలంకారి మగ్నుడుగా ఉన్నాడు. అతడి పేరు బాబు అని గుర్తు. ఈ పేర్లు కూడా ఈ మధ్య సరిగ్గా గుర్తుండవు. చిత్రం విడుదలైనప్పుడు ఇతడి పేరు మధ్యలో ఎక్కడో ఒక పెద్ద టైటిల్ కార్డులో చిన్నదిగా కనబడుతుంది. ఇదే తమాషా అనిపించింది. తన కీర్తి కోసం పనిచేసేవాళ్ళెంత మంది ! తనను యువకుడిగా చేసి, తన విలువను పెంచే కేశాలంకారి కీర్తి పెరిగేది మాత్రం, అతడు చిత్రనటుడు ఉత్తమ్ కుమార్ గారి కేశాలంకారి అని చెప్పినప్పుడే !!

"సార్.. షాట్ రెడి... రావాలట "

పక్కనే ఉంచుకున్న ఫైలు నుండి ఇంకోసారి తన సంభాషణలను చూసుకున్నాడు ఉత్తమ్. అదే అరిగిపోయిన పాత డైలాగు " శాంతా ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నా ప్రేమకు ఈ ఆకాశమే సాక్షి. ఇక్కడి ఈ చెట్టు చేమలే సాక్షి... ఎవరడ్డు వచ్చినా నేను నిన్నే పెళ్ళిచేసుకుంటాను" ఇలాంటి సంభాషణలను అతడు ఎన్నిసార్లు ఊదరగొట్టాడు ! ఇప్పుడు షాట్ ఇచ్చిన తరువాత మళ్ళీ డబ్బింగ్ లోనూ దీన్నే చెప్పాలి... ఊరికే సంభాషణలు రాసేవాడికి వందలకొలది డబ్బులిస్తారు. హిరోయిన్ ఎవరని చెప్తే తనే ఈ మాటలు రాసేవాడు అని ఉత్తమ్ కు అనిపించింది. ఇవన్నీ కృత్రిమం అనిపించాయి.

ఉత్తమ్ కు అనేక సార్లు ఆశ్చర్యం కలిగింది. నిజ జీవితంలో సామాన్య ప్రజలు తమ ప్రేమను ఎలా వ్యక్తపరుస్తారు ? సినిమాలో ఒక షాట్ తియ్యడానికి ఎంత సిద్ధం చేస్తారు ! సంభాషణలు రాసేవాడి హోటల్ ఖర్చులు భరించి, మందు పోయించి, డబ్బులిచ్చి సంభాషణలు రాయిస్తారు. హీరోను బతిమాలుకుని కాల్షీట్ సంపాయిస్తారు.....

ముడి ఫిలిం అని తన్నుకుంటారు. నేపథ్యంలో వయొలిన్ ను వైంయ్ అనిపిస్తారు. డబ్బింగ్, మిక్సింగ్, రికార్డింగ్, ఎడిటింగ్ ఇలా ఎన్నని !

ఒక అబ్బాయి–అమ్మాయి ప్రేమించుకోవడం ఇంత దుబారానా ? ఇంత జరిగాక ఆ డైలాగ్ చెప్పే సమయంలో ఎదురుగ్గా ఉన్న కెమెరా కన్నును చూస్తూ ఆ మాటను చెప్పాలి. అదే సినిమా హిరోయిన్

ఇంకేదో సినిమా కోసం ఇంకో డైలాగ్ ఇంకేదో ఊళ్ళో చెప్తూ ఉండొచ్చు.... ఒక ఫ్యాంటసీ చిత్రంలోనే ప్రేమించడం ఇంత కష్టమైనప్పుడు, నిజ జీవితంలొ సినిమా నాయకుడికున్న ఏ అర్హతలూ లేని, మొదటి ర్యాంకు రాకపోయినా, గుర్రం వీపు పైన జట్కా సవారి చేసినప్పుడు మాత్రమే తన దేహ భారాన్ని మోపే, ఈత కొలనును తన జీవితంలోనే చూసి ఎరుగని, ఆత్మన్యూనతా భావం కల సామాన్యుడొకడు అమ్మాయికి " నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని ఎలా చెప్తాడు అని ఉత్తమ్ కు కుతూహలంగా ఉండింది. శ్రీ సామాన్యుడి కలలు ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకుని ఒక చిన్న ఇంట్లో సుఖంగా జీవించే స్థాయికి మాత్రమే వచ్చి ఆగిపోతాయేమో ! ఆ అమ్మాయి ఆలోచనలో తన భర్త పాడడం కానీ, ఊటి కాశ్మీర్ సింగాపుర్ లను ఊహించుకోవడమైనా వీలవుతుందా ? ఈ మాదిరి కల్పనాతీత కల్పనా లోకానికి ఉత్తమ్ అప్పుడప్పుడు వెళ్ళడం కద్దు.

"సర్ ! రావాలట. షాట్ రెడి. మీకోసం అందరూ వెయిటింగ్..."

"అవునా ! సారి. ఇప్పుడే వస్తున్నా. రెడి"

ఉత్తమ్ ఫ్లోర్ పైకి వెళ్ళి అక్కడ తాత్కాలికంగా చేసిన ఒక తీగను పట్టుకుని నిల్చున్నాడు. దర్శకుడు అతడి వద్దకు వచ్చి ఒక రైలింగ్ పైన కెమెరా చలించే తీరును, ఈ షాట్ కు వ్యక్తపరచాల్సిన భావాలను వివరించాడు. ఉత్తమ్ లోలోపలే నవ్వుకున్నాడు. ఈ పనిని తను ఎన్నో సార్లు చేశాడు. సరే. చెప్పడం వాళ్ళ ధర్మం, చెప్తారు. వాళ్ళ సంతోషం కోసం తనూ వింటాడు. నటుడిగా వాళ్ళు చెప్పింది వినడం తన ధర్మం. " రెడి" అనే ఒక పెద్ద గొంతు అరిచేటప్పటికి, ఇంకెవరో "లైట్స్" అని అరిచారు. ఉత్తమ్ మొహం పైన మంట పుట్టించే వెలుగు పడింది. అతడు లోపలే చెమర్చాడు. ఒక్క చిన్న పిల్లవాడు యాంత్రికంగా క్లాపర్ పట్టుకున్నాడు. దాంట్లో "మహాలక్ష్మీ ప్రొడక్షన్స్, శుభ వివాహం, సీన్ 15, షాట్ 2, టేక్ 1 " అని రాసుంది. ఉత్తమ్ మొహం ముందు తీసుకొచ్చి దాన్ని ఫట్ అని మోగించాడు. ఎక్కడి నుండో " రోల్ కెమెరా" అనే గడుసు కంఠం ఆదేశం వచ్చింది. తరువాత " యాక్షన్" అని అరిచారు. ఈ అన్ని గలభాల నడుమ భావనలను దేహం, మనసులలో తెచ్చుకుని వెంటనే చెప్పాలి. నాటకాలే మేలు... పాత్రలో ఇమడడానికి కొంత సమయమైనా ఉంటుంది. ఇక్కడ అలా కాదు. ఉత్తమ్ కెమెరా వైపు తిరిగాడు. ఇప్పుడతను ఇరవై సంవత్సరాల కాలేజి విద్యార్థి– యువకుడు. తన సంభాషణను అప్పజెప్పాడు : " శాంతా, నేను నిన్ను నా జీవితాని కంటే ఎక్కువగా

ప్రేమిస్తున్నాను. దీనికి ఈ పార్కు చెట్లే సాక్షులు. మనం పెళ్ళి చేసుకుందాం. ఈ ప్రపంచంలోని ఏ శక్తికీ మన పెళ్ళిని ఆపడానికి వీలుకాదు. దీనికి తిరుగులేదు.”

“కట్”

“సర్. డైలాగ్ మార్చారే. ఎఫెక్టేమో అదే విధంగా ఉన్నట్టుంది. ఇంకో టేక్ తీసుకుంటే మంచిదేమో అనిపిస్తుంది. జస్ట్ ఒన్ మోర్”

“ సరే. నేను రెడి”

ఇంకోసారి షాట్ తీసే కార్యక్రమం పునరావృతమయింది. ఈ సారి దర్శకుడు తృప్తి చెంది “ ఒకె” అన్నాడు. దేన్నైనా ఒకేసారికి ఒప్పుకునే బుద్ధి ఈయనకు ఉన్నట్టు లేదు. ఉత్తమ్ కు ముందు షాటే బాగుండిందని అనిపించింది. అయినా ఈ షాట్ లో తన నటను చూపడానికి కానీ, భావనలను ప్రేరేపించే లోతు ఆలోచన కాని ఉత్తమ్ కు కనిపించలేదు. ఎన్నో సంవత్సరాల నుండి దీన్నే చేస్తున్నాడు. హ్యాక్నీడ్ అని ఎవరో దీన్నివివరించారట. ఇదీ యాంత్రికత పరమావధి కాకపోతే మరేమిటి ?

షాట్ తరువాత వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. మూడు గంటల మేకప్ సిద్ధతకు జరిగిన ఈ రోజు పని ఇదే. వేలాది రుపాయలను తీసుకున్నాక చేసే పని ఇంతే. దర్శకుడు వచ్చి ఉత్తమ్ ప్రక్కన కూర్చున్నాడు. ఉత్తమే మాటలు కలిపాడు.

“కాదండీ, ఈ సీన్లో నాయకి కూడా ఎదుట ఉండి ఆమెను హత్తుకుని ఈ డైలాగ్ చెప్పుంటే ఇంకా మంచి ఎఫెక్ట్ వచ్చేది కదా...ఫ్రేమ్ లో ఒక్కడినే పెట్టి ప్రేమ సీన్ తీయడం నాకెందుకో సహజమనిపించలేదు.”

“మీరు చెప్పేది కరెక్ట్ ఉత్తమ్. కానీ డేట్స్ సూటవట్లేదు కదా. అందుకే కాంప్రమైస్ కావాల్సొచ్చింది. ఇప్పుడే మీ ఇద్దరి జోడి సినిమా హిట్ అయ్యింది. ఏప్రిల్ మొదటి వారంలోనే రిలీజ్ చేస్తే ఇది కూడా మంచి సక్సెస్ అయ్యే అవకాశం ఉంది. రిలీస్ డెడ్ లైన్ ఉండబట్టి తొందర తొందరగా పన్లు ముగిస్తున్నాం. మీకెందు దీని గురించి ? పిక్చర్ చూడండి. మంచి ఎఫెక్ట్ కనిపిస్తుంది. మన ఎడిటరేం సామాన్యుడు కాడు. కదూ “

దర్శకుడి మాటలకు అతడు తల ఊపాడు. అంతలో రామన్నవచ్చాడు. రామన్న ఉత్తమ్ కార్యదర్శి.

“సర్. మధ్యాహ్నం షూటింగ్ క్యాన్సల్ అయిందట” అన్నప్పుడు ఉత్తమ్ కు సంతోషం కలిగింది. మధ్యాహ్నం పూట ఇంటికి వెళ్ళి ఎన్నిరోజులైంది ? గుర్తు లేదు. ఊళ్ళో ఉండడమే అరుదైతే ఇక ఇల్లెక్కడ ? హాయిగా ఒక నాలుగైదు గంటలు ఇంట్లో ఉండొచ్చు. భువన ఉంటుందా లేదా తను కూడా ఏదైనా షూటింగ్ కు వెళ్ళుండచ్చా ? ఉంటే చాలా రోజుల తరువాత తనతో హాయిగా కబుర్లు చెప్పినట్టుంటుంది. ఉండక పోయినా మంచిదే. ఏకాంతంగా

మధ్యాహ్నాలు గడిపి ఎన్ని రోజులయ్యాయి ? పంకజ్ ఉదాస్ గజళ్ళను వింటూ పడుకోవచ్చు. మధ్యాహ్నం నిద్ర. అదొక మరీచికే అయిపోయింది అనుకున్నాడు.

డ్రైవర్ ను సాయంత్రం 6 గంటలకు ఇంటి వద్దకు రమ్మని చెప్పి పంపాడు. ఉత్తమ్ కారు నడిపి చాలా రోజులు అయ్యాయి. ప్రధాని రాజీవ్ గాంధీగారు కూడా తమ జీప్ ను తామే నడిపేవారట. కారు నడపాలని అనిపించింది. డ్రైవ్ చేస్తూ ఇంటి వైపు వెళ్ళాడు.

ఇంత పీఠిక వేశాక కూడా ఉత్తమ్ పరిచయం సరిగ్గా కాలేదంటే, దానికి మరింత సంజాయిషీ లేదు. ఉత్తమ్ కుమార్ చతుర్వేది అనే పేరే అతడికి పరిచయ పత్రం. ఈ పేరే ఇన్నో తలుపులను సహజంగా తెరిచేలా చేస్తుంది. అతడి జీవితం అందరికీ బాగా తెలిసిందే. ఎంత బాగా ప్రజలకు తెలుసు అంటే కొన్నిసార్లు అతడికి తెలియని "సత్యాలు" ఇతర అనేకులకు తెలిసుంటాయి. అతడి బాహ్య స్వరూపపు కొన్ని ముఖాలను ప్రజలు ఇప్పటికప్పుడే చూసేశారు. అతడికి ఏ రంగు దుస్తులు ఇష్టం, ఏ అమ్మాయితో అతడి వ్యవహారం నడుస్తోంది, అతడు ఎన్ని చిత్రాల్లో నటించాడు, ముందు రాబోయే చిత్రాలేవి ? ఇలా అతడికే తెలియని ఎన్నో విషయాలు ప్రజలకు తెలిసుంటాయి. ఇటీవల అతడు సుధ అనే కొత్త నటితో ప్రణయం మొదలు పెట్టాడని కొత్తగా పుకారు. ఈ వార్తలను చదివితే ఒక్కోసారి తనే నమ్మేస్తానేమో అనే భయం అతడ్ని సతాయిస్తుంది.

కారు ఎడమవైపుకు తిరగాలనేంతలో రోడ్డు సిగ్నల్ ఎరుపుకు తిరిగింది. వెంటనే బ్రేక్ నొక్కాడు. ఆ రోజు అతడి మనసు ఎందులో ఆలోచనల్లో కరగి పోయింది. ఇటీవల తెలిసిన కొత్త విషయం. తనకు ఇంతవరకూ వచ్చిన పురస్కారాల గురించి, వంద రోజులు ఆడిన తన చిత్రాల వివరాలు తనకు, తన కార్యదర్శికీ తెలియని కొన్నివివరాలు అభిమాన సంఘాలకు తెలుసు ! ఒక పట్టీని వాళ్ళు తీసుకువచ్చి ఇచ్చారు. దాన్ని ఫ్రేము కట్టించి తన విశాలమైన ఇంటి ఒక గదిలో వేలాడ దీశాడు. ఈ విషయం తెలిస్తే అభిమాన సంఘాలు సంతోష పడతాయి. ఇలా అతడిది ఒక రకమైన నగ్న జీవితం. శరీరంతో మొదలుకొని అతడి జీవితంలోని అన్ని విషయాలు నగ్నమే. నగ్నంగా మారనిది తన మనసు మాత్రమే అని ఉత్తమ్ ఎన్నో సార్లు అనుకున్నాడు. తన మనసును మాత్రం ఇంతవరకూ ఎవరూ అర్థం చేసుకోవాలని ప్రయత్నించలేదు అని అతడికనిపిస్తుంది. బహుశా అతడి భార్య భువనకు కూడా అది సరిగ్గా అర్థం కాలేదేమోనన్న సందేహం ఉత్తమ్ కుంది.

వెనుకనుండి హారన్ వినిపించగానే అతడు తన అన్యమనస్కత నుండి మేలుకున్నాడు. పచ్చ దీపం వచ్చిందని తెలుసుకుని నిదానంగా క్లచ్ పైని కాలును తీసి ఆక్సిలరేటర్ నొక్కాడు. కార్లో వెళ్ళేటప్పుడు అతడికి ఇటీవల ఏదో పత్రికలో వచ్చిన వ్యంగ్య రచన గుర్తుకు వచ్చింది. సెలెబ్రిటిల దినచర్యలు అనే శీర్షికతో వచ్చిన వ్యాసంలో ఉత్తమ్ దినచర్య కూడా కనిపించింది. దాని ప్రకారం ఉత్తమ్ దినచర్య ఇలా ఉండింది:

" ఉదయం ఏడుకు లేవడం. దేవుడి పూజ, గాయత్రి మంత్ర పఠనం, తరువాత దేవుడికి అగరొత్తులు ముట్టించి, సిగరెట్ అంటించుకోవడం. పంకజ్ ఉదాస్ కేసెట్ వింటూ కోడిగ్రుడ్డు తినడం, సెట్ కు వచ్చి నాలుగు షాట్ లలో నటించడం, రెండు గుడిసెల సెట్ లను దొర్లించి వాటితో పాటు రాజకీయాలు, పేద ప్రజల గురించి సుదీర్ఘ చర్చ, సాయంత్రం సుధాతో మందు పార్టీకి వెళ్ళి, శ్రీరామ చరిత మానస్ గురించి వ్యాఖ్యానం, రాత్రి దేవుడి పూజ. ఉదర పూజ తరువాత ఇంకెక్కడో నటిస్తున్న భార్య గురించిన ఆలోచనలతో నిద్ర పోవడం.... "

బయటివాళ్ళకు వ్యంగ్యంగా కనిపించినా ఇందులో వాస్తవం లేకపోలేదు. ప్రఖ్యాతి గాంచిన వాళ్ళ బ్రతుకులు ఇలా సార్వత్రిక హేళనకు గురికావడం కూడా తప్పదు. ఒక్కోసారి అతడికి " దయచేసి ఇవ్వన్నిటినుండి ముక్తినివ్వండి" అని అరిచి చెప్పలనిపిస్తుంది.

అతడు కారును నిదానంగా కాంపౌండులోకి తెచ్చి నిలిపాడు. ఇంట్లోకి వచ్చాక చూస్తే భువన లేదు. అతడి భార్య భువన... ఇప్పుడు ఎవరి బాహువుల్లో సీతగానో, సావిత్రిగానో బంధితురాలై ఉండొచ్చు. ఆమెతో మనసు విప్పి మాట్లాడి ఎన్ని రోజులైందో ! పరస్పరం చూసుకునే ప్రక్రియ రోజూ జరుగుతున్నా, నిజానికి భార్యా భర్తల్లా ప్రవర్తిస్తున్నామా అని అతడు ఆలోచించడం కద్దు. పెళ్ళి చేసుకున్నప్పటినుండి అది నిజంగానే వీలు కాలేదు అని అప్పుడప్పుడు అతడికి అనిపించడం జరిగింది. పెళ్ళికి ముందు కూడా ఆమెతో ఏకాంత క్షణాలు ఎక్కువగా దొరకనే లేదు. ఇప్పుడు కూడా అతడికి ఆమె చెయ్యి పట్టుకుని ఈ ప్రపంచపు దిగంతానికవతల నడచి వెళ్ళలనిపిస్తుంది. ఆమె చెయ్యి పట్టుకుని కెఆర్ఎస్ ఫౌంటెన్ ల నడుమ స్వేచ్ఛగా తిరగాలనిపిస్తుంది. ఇంటి పక్కన గల్లీలోని కాకా హోటల్ లో టీ తాగి బన్ తినాలని అనిపిస్తుంది. ఏదో చిత్రం తీసేటప్పుడు కాకా హోటల్ సెట్ వేశారు. అక్కడ టీ తాగి ఫైట్ చేసాడు కూడా. కానీ నమ్మండి: అతడు ఇంతవరకూ వాస్తవంలో కాకా హోటల్ టీ రుచి చూడలేదు.

భువనతో పెళ్ళి జరిగిన వైఖరి తలచుకుంటే అతడికి ఇప్పటికీ నవ్వు వస్తుంది. అప్పుడు ఇద్దరికీ యౌవనపు ఉత్సాహం. ఏదో చిత్రంలో ఇద్దరూ నటిస్తున్నారు. అప్పుడు తన పాత్ర సంభాషణలో మునిగిపోయి చెప్పాడు : "భువనా నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని. పిచ్చి పిల్ల. అదే ఆమె మొదటి చిత్రం. ఇతడు చెప్పిందే నిజమని నమ్మి నిజంగానే ఇతడి వెంట పడింది. తరువాత ఇద్దరూ పెళ్ళాడారు. కానీ.... నిజంగానే ఆమెకు తన పైన ప్రేమ ఉందా అని తనను తనే ప్రశ్నించుకుంటాడు. ఇప్పుడేమైనా ఆమెతో ఆ వాక్యాన్ని చెప్తే " ఏ సినిమా డైలాగ్ బట్టీ పడుతున్నావ్?" అని గంభీరంగా అడగొచ్చు. మనసులోని ప్రేమను ఎలా వ్యక్తీకరించాలో అతడికి అర్థం కావడం లేదు.

ఈ రంగురంగుల బ్రతుకే అంత– చాలా కృత్రిమం. ఎన్నో సార్లు సెట్ వేసే ఖర్చు గురించి దర్శకుడితో మాట్లాడాడు. ఈ మురికి వాడల సెట్ వేసి దాన్ని బుల్డోజర్ తో పడగొట్టడానికి అయ్యే ఖర్చుతో ఒక జనతా ఇళ్ళ కాలని కట్టచ్చు అని కూడా అప్పుడప్పుడు చెప్పడం జరిగింది. అప్పుడు దర్శకుడు జో ఏమన్నాడు? "ఏంటి ఉత్తమ్ ! కమ్యూనిస్ట్ లా

మాట్లాడుతున్నావ్ ? అలాగేమైనా చేస్తే మీకు ఇక్కడ పని ఎవరు ఇచ్చేవారు? కడుపు కాలేది అంతే. మీరు మీ వ్యక్తిగత జీవితంలో ఒక మజిలీ చేరుకున్నారు. ఇప్పుడు ఇలా మాట్లాడొచ్చు. ఇరవై ఆరేళ్ళ క్రితం ఛాన్స్ కోసం పరితపిస్తున్నప్పుడు ఇలాంటి ఆలోచనలు వచ్చేవి కావు కదూ ! కడుపు నిండినాక ఎప్పుడూ అంతే. ఆ కడుపును నింపిన బీదవాళ్ల గురించిన ఆలోచనలు తమకు తామే వస్తాయి "

ఉండచ్చు. జో చెప్పిన దాంట్లో నిజాంశం ఉండచ్చు. ఇరవై ఆరు సంవత్సరాల క్రితం– అప్పుడు అతడింకా నటుడిగా స్థిరపడలేదు – అప్పుడు అవకాశాల కోసం వేచి ఉన్నప్పుడు తన జీవితపు విలువలు ఏమయ్యాయి ? "ఆత్మవంచన చేసుకుని బ్రతకలేను, మూఢనమ్మకాలను పోషించలేను" అని చెప్పుకుంటూ తిరిగేటప్పుడు ఇదే జో వచ్చారు. ఎవరో దర్శకుడికోసం " భక్త సిద్ధరామ" అనే పౌరాణిక చిత్రాన్ని తీయాలని అతడి ఆలోచన. అప్పుడు తను చెప్పినది గుర్తుంది.

"జో! నువ్వే నమ్మని సిద్ధాంతం, మూఢనమ్మకాల గురించి, అదీ ఒక ఒక హిందూ పౌరాణిక చిత్రాన్ని తీయబోతున్నారు కదా ? ఈ సినిమా గురించి మీకు కమిట్మెంట్ ఉందా ?"

" ఉత్తమ్! మీరు చెప్తోంది సరిగ్గానే ఉంది. కానీ నా నమ్మకాలు పూర్తిగా భిన్నం. ఇప్పుడు నేను తీస్తున్న సినిమాలోని ఏ విషయంలోనూ నాకు నమ్మకం లేదు. చిత్ర మాధ్యమానికి కమిట్మెంట్ అని చెప్పుకుని తిరగచ్చు. కానీ నిజమేమిటంటే ఈ రోజు మార్కెట్ అయ్యే ఫార్ములా ఇదే. కాబట్టి తీయాలి. మనం పేరు సంపాదించేదాకా ఎవరూ మన పైన పెట్టుబడి పెట్టరు. ఈ నిజాన్ని నేను సమ్మతించాను. ఈ చిత్రానికి మాస్ అపీల్ ఉంది. మీరు ఇందులో పని చేస్తే మీకూ ఒక బ్రేక్ దొరకవచ్చు. చూడండి."

" లేదు జో వద్దు. ఈ స్క్రిప్ట్ చూడండి. అంతా మూఢభక్తికి పరాకాష్ఠ. ఎవరో భగవంతుడు భిక్షకుడి వేషంలో వచ్చి తన కుమారిడిని బలి తీసుకునే ప్రస్తావన తెస్తే, ఈ సిద్ధరామ వెంటనే అందుకు సమ్మతిస్తాడు. చదువుకుని విద్యావంతులైన మనం ఈ దృష్టికోణానికి మన పేరును ఇవ్వాలా ? నాకు ఈ సినిమాలోని పాత్ర నచ్చలేదు. ఈ పిచ్చి ఊహాతీతం. దీని ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించారా ? ఈ శతాబ్దంలోనూ ఇలాంటి నమ్మకాలను పెంచిపోషించే చిత్రాలను మనం చేయాలా.... వద్దు.. నో...."

"లేదు ఉత్తమ్. ఇలాంటి పాత్రకు ఎవరిని అడిగినా సులభంగా ఒప్పుకుంటారు. నేను మిమ్మల్నే ఎందుకు అడుగుతున్నాను అంటే మీకు దీనితో పాటు ఇంకో అవకాశాం దొరకవచ్చు, ఒక బ్రేక్ కూడా. ఇది సక్సెస్ అయితే ఇదే నిర్మాత ఇంకో చిత్రం చెయ్యలని అనుకుంటున్నారు. దానికి స్క్రిప్ట్ కూడా తయారుగా ఉంది.

మీరు అందులోనూ నటించవచ్చు. మేమంతా కొత్తవాళ్లం. గట్టిగా వేళ్ళూరుకున్నాక మనకిష్టం వచ్చినట్టు చిత్రాలను తీయవచ్చు. "

ఇలా చిత్రరంగలో రాజీ పడడాన్ని ఇరవై రెండు సంవత్సరాల క్రితమే ఉత్తమ్ ప్రారంభించాడు. అప్పటి నుండీ అతడికి రాజీ బ్రతుకే అయిపోయింది. భక్త సిద్ధరామ వంద రోజులు ఆడింది. శతదినోత్సవ సంతోష సభలో తను మాట్లాడిందేమిటి? అదీ రాజీయే. “ అంతా ఆ దేవుడి దయ. ఇలాంటి భక్తి రస పాత్ర చేసినందువల్లే నా జీవితం ఇలాంటి మలుపు తిరిగింది” అని ప్రసంగం దంచాడు. జో కూడా అలాగే మాట్లాడాడు. ఇద్దరూ అప్పుడు భక్తులయినవారు ఇప్పటికీ ఆ ఇమేజ్ నుండి బయటకు రాలేక పోతున్నారు ! అప్పుడు అదే నిర్మాత, జో తయారు చేసిన రెండో స్క్రిప్ట్ కు పెట్టుబడి పెట్టనన్నాడట. అతి సహజంగా ఉన్న కథ స్క్రిప్ట్ తో ఆయన వద్దకు వెళ్ళినప్పుడు ఆయన అన్న మాటలివి:

“చూడండి ! ఏది అమ్ముడు పోతుందని భక్త సిద్ధరామ చిత్రం నిరూపించింది. మీకు అలాంటి ఇమేజ్ వచ్చింది. ఉత్తమ్ కు కూడా. మీరిద్దరూ కలిసి ఇలాంటిదే మరో చిత్రం తీయండి. స్క్రిప్ట్ కావలిస్తే ఒక పెద్దాయనతో రాయిద్దాం. మొత్తానికి మన పెట్టుబడి నష్టం కాకూడదు. అంతే “

మరుసటి చిత్రమూ అలానే అయింది. ఒక రకమైన బ్లాక్ మెయిల్ ప్రారంభం అయిందనొచ్చు. తను ఈ చిత్రంలో ఖచ్చితంగా చెయ్యను అని ఉత్తమ్ పట్టు పట్టుకుని కూర్చున్నాడు. జో వచ్చి “పేపర్ వాళ్లు బెదిరిస్తున్నారు. వాళ్లంతా కలిసి ఒప్పుకున్న చిత్రానికి ఉత్తమ్ చెయ్యిచ్చేశారు అని పబ్లిసిటి ఇస్తే ఏం చేస్తారు” అని అడిగారు. అప్పుడు ఉత్తమ్ కు అది తన ఉనికి ప్రశ్నగా మారింది. ఉత్తమ్ చతుర్వేది నిర్మాతలకు సహకరించడు అనే ఇమేజ్ వచ్చేస్తే ఉన్న అవకాశాలు ఊడిపోయేవి. తప్పనిసరిగా అతడు ఆ పాత్ర చెయ్యడానికి ఒప్పుకున్నాడు.

అక్కడి నుండి అతడు రాజీ అవుతూనే వస్తున్నాడు. ఎంత వరకూ అంటే ఇప్పుడు కూడా ఒక్కోసారి అతడి గురించి అతడికే సందేహాలు వస్తాయట. అతడు ఆస్తికుడా నాస్తికుడా అనేది అతడికే అర్థం కాలేదు ఇంతవరకూ. ఎక్కడికి వెళ్ళినా “ అంతా గురువుగారి మహిమ” అనే మాట ఇప్పుడు అతడి సంభాషణలో సహజంగా వచ్చేస్తోంది. షాట్ కు ముందు కెమెరాకు మంగళ హారతి ఇవ్వనిదే, కొబ్బరికాయ కొట్టనిదే నటించడం అతడికే ఇబ్బందిగా ఉంటోంది. ఈ ద్వంద్వం అతడిని పిచ్చివాణ్ణి చేస్తోంది. బయటి ప్రపంచంలో అతడు ఎంత కృతజ్ఞతతో మాట్లాడినా ప్రజలు నమ్ముతారు ! అతడి వ్యక్తిగత జీవితంలో భావనలతో హృదయపు లోతులనుండి చెప్తే అతడి భార్య కూడా నమ్మదు. ఆమె కూడా నటనకు ఎంతవరకూ అలవాటు పడిపోయిందంటే వాళ్ళిద్దరూ ఒకరి ముందు మరొకరు ఎప్పుడు నటిస్తున్నారు, ఎప్పుడు సహజంగా ఉన్నారు అన్నది వాళ్ళకే తెలియదు !

మొన్నటికి మొన్న జరిగిన సంగతి. ఏదో చిత్రం సన్నివేశంలో ఉత్తమ్ నటిస్తున్నాడు. సహనటి–అలాగే తన ఇప్పటి ప్రేయసి అని పిలిపించుకునే సుధాకు ఆ చిత్రంలోనూ ప్రేయసి పాత్ర ఇచ్చారు. చిత్ర నాయకుడు తన పనుల పైన పై ఊళ్ళకు వెళతాడు. ఆ ఊళ్ళో ఆమె స్నేహితురాలై, ప్రేయసిగా మారే పాత్ర సుధాది. చిత్రీకరణంలో తలమునికలై ఎప్పటి లాగే ఉత్తమ్ నటించాడు. ఆ సినిమాలో వాళ్ళిద్దరి మధ్య చాలా సన్నిహిత సన్నివేశాలున్నాయి. ఇలా ఆమెకు దగ్గరయ్యే

అవకాశాలు ఉత్తమ్ కు చాలానే దొరికాయి. చిత్రీకరణం తరువాత కూడా సుధా అతడిని రాసుకుని తిరగసాగింది అన్నది కూడా నిజమే. చిత్రంలోని సంభాషణలు పరవశంగా పలుకుతూ ఆ పిల్ల ఆ పాత్రనే నమ్మేసిందేమో ? నటనకున్న పరిమితి ఎక్కడికి ఆగుతుంది ! మొదటి సారి ఆ పరిమితిని గమనంచని ఉత్తమ్ తన సహనటిని వివాహం చేసుకున్నాడు. మరి ఇప్పుడు? .... పత్రికలు రాస్తున్న సమాచారం, తన మనసులో మెదలుతున్న ఆలోచనలు ఒకే దిశగా సాగుతున్నాయేమో అనే దడ అతడిని సతాయించింది. ఈ గుసగుసలను ప్రజలు నమ్మితే సరే. కానీ సమాచారమే నిజమని తను నమ్మితే ఎలా ? లేదా అంతా కల్పితమేనా.... ఈ విషయంలో సుధా అభిప్రాయం ఏమిటి అని తను తప్పుగా ఊహిస్తున్నానా .... ఈ అన్ని వికారాలూ ఉత్తమ్ ను పీడించసాగాయి.

ఇవన్నీ గందరగోళాలు అతడికి ఎంత ఎక్కువయ్యాయి అంటే అతడిలోని అగ్నిపర్వతం లావాగా మారి ఎప్పుడు ఉబుకుతుందో ఉత్తమ్ కే తెలియదు. అతడు ఎప్పుడు తనుగా ఉన్నాడు, ఎప్పుడు నటిస్తున్నాడు అనే ద్వంద్వాల నడుమ తనను కనుక్కునే అసఫల ప్రయత్నం చేస్తున్నాడు. రోజుకు మూడు షిఫ్ట్ లు పనిచేస్తున్నప్పుడు కలిగే కొన్నిఅపాయాలలే ఇదీ ఒకటేమో !

ఇటీవలి సినిమా పత్రికలలో ఒక పెద్ద శీర్షికతో ఉన్న వ్యాసాన్ని అందరూ గమనించారు. "ప్రఖ్యాత నటుడు ఉత్తమ్ చతుర్వేది ఆత్మహత్యా ప్రయత్నం".... కానీ సత్యాంశమేమంటే అతడు చావాలని చేయలేదు. తను నటించిన చిత్రంలోని నాయకుడు మానసిక ఒత్తిడిని తట్టుకోలేక నిద్ర మాత్రలను మింగి పడుకుంటాడు. కానీ ఉత్తమ్ ఎంత అలసిపోయాడంటే ఏదో ధ్యాసలో చిత్రంకోసం పెట్టుకున్న మాత్రలను మింగేశాడు. అతడిని గమనించిన రామన్న అతడిని ఆస్పత్రికి చేర్పించాడు. విలేకర్లకు అదే పెద్ద సమాచారమై కూర్చుంది.

ఇలాగే పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పడుకున్నప్పుడు అతడి భార్య భువన వచ్చింది. తలుపు బెల్ సద్దు చేసినప్పుడు నౌకరు వెళ్ళి తలుపు తీశాడు. ఆ చప్పుడు వింటూ ఉత్తమ్ తన గదిలో ఉన్నాడు. ఆమె లోపలికి వచ్చి ఇతడిని చూసి ఆశ్చర్యపోయింది. సాయంత్రమంతా ఇద్దరూ కూర్చుని చాల సేపు మనసు విప్పి మాట్లాడుకోవచ్చుఅని ఉత్తమ్ కు అనిపిస్తుంది. భావుకుడై, తన జీవితంలో ఇప్పుడు జరుగుతున్న మానసిక ఒత్తిడి గురించి, మనసు వేలాది ముక్కలై పోతున్నదాని గురించి, తను ఎప్పుడు సహజంగా ఉంటాడు– ఎప్పుడు నటిస్తాడు అని తెలియని స్థితి గురించి ఇలా అతడు మనసును బయట పెడుతూ పోయాడు.

అంతటినీ శాంతంగా పెదవి విప్పకుండా విన్న తరువాత భువన నిర్లిప్తంగా అడిగింది:

" ఎందుకు ఎప్పుడూ లేనిది ఈ రోజు ఇంత మాట్లాడుతున్నావు ఉత్తమ్ ? ఆ ముండ సుధా సహవాసమనిపిస్తుంది. విడాకులు కావాలనిపిస్తే నేరుగా అడుగు. దానికి ఇంత పీఠిక ఎందుకు ?"

ఈమెకు వివరించి చెప్పడం ఎలాగ ? అతడి నిజాయితీనే భువన ప్రశ్నిస్తోంది. ఆమెకు ఎంత వివరించినా ఈ తత్త్వశాస్త్రపు మాటలను నమ్మే పరిస్థితిలో ఆమె లేదు. పాపం, ఆమె నమ్మడమన్నా ఎలాగ ? ఈ మధ్య తను సుధాతో చక్కర్ చలాయిస్తున్నానని పుకార్లే పుకార్లు. ఉత్తమ్ కు తలకాయ పగిలిపోతున్నట్టనిపిస్తుంది. భువనతో "నేను కొంచెం సేపు విశ్రాంతి తీసుకుంటాను. నన్న్ డిస్టర్బ్ చెయ్యొద్దు."అన్నాడు.

తన గదికి రాగానే అతడికి నిద్రమాత్రల డబ్బా కనిపించింది. రెండు మాత్రలను గొంతులోకి పంపి నీళ్ళు తాగాడు. ఈ ఒంటరి జీవితంలో నిద్రాదేవి కృప కూడా మాత్రలు లేకుండా అతడి పైన పడడం లేదు. ఈ ఆలోచన మనసును తాకినప్పుడు కళ్ళల్లో గ్లిసరిన్ లేకుండానే నీళ్ళు వస్తాయి. శరీరాన్ని పరుపు పైన వెయ్యాలనుకున్నప్పుడే తలుపు చప్పుడయింది. సమయం ఆరయ్యింది. డ్రైవరు తనను పిలుచుకు పోవడానికి వచ్చాడు. అలాగే నిదానంగా మొహం కడుక్కుని వచ్చే నిద్రను ఎలా తట్టుకోవడమా అని ఆలోచిస్తూనే మరో చిత్రం నటనకు తయారై ఉత్తమ్ బయలుదేరాడు.

★★★

## లాస్ట్ బెంచ్ అమ్మాయి

కన్నడ మూలం: శ్రీమతి కె.వి.రాజలక్ష్మి

తెలుగు అనువాదం: చందకచర్ల రమేశ బాబు

"హాయ్..."

కొత్త నంబర్ నుండి మెసేజ్. ఎవరై ఉండచ్చు ? అంతలో ఇంకో మెసేజ్.

"మెరూన్ కుర్తాలో రాజకుమారుడిలా ఉన్నావ్"

ఎవరో ఇక్కడి వాళ్ళే..... నా పరిచయం ఉన్నట్టుంది కానీ నాకు పరిచయం లేదు.

"హూ ఈస్ దిస్?" నా కుతూహలం బయటపడింది.

"నీనుండి నాలుగవ వరస"

నేను కూర్చుంది రెండో వరస.... నా వెనుక నాలుగు వరసలు... కుడివైపుకు మెడ తిప్పాను. నాలుగవ వరసలో ముగ్గురు కూర్చున్నారు. మొదటి రెండు కుర్చీల్లో వయసయిన పెదవాళ్ళు, అదే వరస చివరి కుర్చీలో ఒక

అమ్మాయి ఇయర్ ఫోన్ పెట్టుకుని ఎవరితోనో మాట్లాడుతూ ముసి ముసిగా నవ్వుకుంటోంది. ఏదో జోక్ ఎంజాయ్ చేస్తుంటుంది ! బహుశ బాయ్ ఫ్రెండేమో.....

"కాదు కాదు." నవ్వుతున్న ఎమోజి.

నేను కూర్చునుంది వేదిక ఎడమ వైపు. అంటే కుడివైపు నాలుగో వరస.....

చూపు అటు తిప్పాను. ఉన్న ఎనిమిది కుర్చీల్లో ఆరు నిండున్నాయి. ఇలా తుంటరి మెసేజ్ పంపగలిగే మొహం ఏదీ కనబడలేదు.

"చాలా మంది నన్ను ఎల్.బి.హెచ్ అనే పిలిచేవారు. ఐ బెట్. నీలాంటి వాళ్ళకు గుర్తుండకపోవచ్చులే" అనే ఛాలెంజ్ ఈ సారి.

నేను మళ్ళీ ఓడిపోయాను.

"దుబె. చాలా సేపయ్యిందా వచ్చి?" ఫణి గొంతు వినిపించి తల ఎత్తాను.

" అవును. ఒక అర్ధగంట అయ్యుండచ్చు. మనవాళ్ళెవరూ కనబడలేదు. చూస్తూనే ఉన్నాను. పుణ్యం. నువ్వైనా వచ్చావు కదా!"

" వర్కింగ్ డే కదా గురూ ! మన ఆక్చువల్ ప్రోగ్రాం ఎల్లుండి. ఈ రోజు వచ్చేది చాలా ఆత్మీయులైన వాళ్ళు, లేదా నీలాంటి ప్రత్యేక అతిథులు, అంటే దూరం నుండి వచ్చినవాళ్ళు " నవ్వాడు.

మా స్కూలు స్నేహితులలోని ఉదయ్ గాడికి 40 సంవత్సరాలు నిండాయి అన్నది ఒక సాకు మాత్రమే. మిత్రులంతా కలవాలనుకున్న సమయంలోనే వీడి బర్త్ డే. వాట్సప్ గ్రూప్ లో 50 కంటే ఎక్కువ మిత్రులున్నా రోజూ పాల్గొనేవాళ్ళు తక్కువే. కొంతమందినయితే ఇంతవరకూ చూడనేలేదు. డి.పి లలో వాళ్లవి కాని ఫోటోలు పెడితే వాళ్ల మొహంకూడా జ్ఞాపకం వచ్చే అవకాశం ఉండదు.

" ఓ ! మన సుందరి కూడా ఇక్కడే ఉంది. ఎప్పుడొచ్చారో అమ్మగారు? ఇలా వెనుక వరసలలోనే ఉన్నావు ?" అంటూ అల్లరి చేస్తూ వెనక వరసల వైపు సాగాడు. వాడి వెనుక నేను కూడా. " అవును. దీంట్లోనే మజా మరి. చివరినుండి నాలుగవ వరస " అంటూ ఆమె నా వైపు చూడగానే నాకు షాక్ తిన్న అనుభవం.

" తను సృజన. మన క్లాస్మేట్. లాస్ట్ బెంచ్ అమ్మాయి అని ఆట పట్టించేవాళ్ళం"

ఎల్.బి.హెచ్.... ఇప్పుడర్థమయ్యింది. "సారి. గుర్తుపట్టలేదు." వెర్రి నవ్వుతో అన్నాను.

"వీడు తెలుసు కదా. అనుపమ్ దుబె"

" అందరికీ పి.ఎం తెలుసు. కానీ పి.ఎం. కు అందరి పరిచయం ఉండదు కదా ?" చొట్టలు పడిన బుగ్గల్లో మరింత అందం. నేను మళ్ళీ ఎరుపెక్కాను. ముగ్గురమూ ఒకే చోట కూర్చున్నాము. వాళ్ళిద్దరూ ఏవేవో మాట్లాడుకుంటున్నారు. నాకేమీ అర్థం కావడం లేదు – నా దృష్టంతా ఆమె పైనే !

స్కూల్లో అందరికంటే ముందున్న నాకు ఎవరూ అగుపడేవారు కారు. ఒక రకమైన అంతర్ముఖిని. ఎక్కువగా కలిసేవాణ్ణి కాదు. ఔట్ డోర్ ఆటలు అంత ఆడేవాణ్ణికాదు. చదరంగం ఆడేవాణ్ణి. అందులోనూ ప్రత్యర్థిని ఓడించడమే గురి.

"అయ్యో సారి ! నువ్వున్నావన్నదే మరచిపోయి కబుర్లలో పడిపోయాము. సృజి నా కజిన్ నే పెళ్ళాడింది. నాకు వదిన వరసవుతుంది. నేను మాత్రం సృజి అనే పిలుస్తాను. కలిసి చదువుకున్నాం కదా అదే చనువు...." నేను సన్నగా నవ్వాను. వెడల్పాటి క్లిప్పుతో దట్టమైన జుట్టును బిగించి కట్టింది. రెండూ భుజాలకు తాకుతున్న శిరోజాలు. విల్లులాంటి కనుబొమలు, సన్నగా రాసిన కాటుక, కనీ కనిపించని చిన్న బింది ఇవన్నీ ఆమె వయస్సును దాచివేస్తున్నాయి. తేలికపాటి క్రేప్ చీరకు, ముప్పావు స్లీవ్స్ డిజైనర్ బ్లౌజ్ ఆవిడ సౌందర్యానికి మెరుగులు దిద్దుతున్నాయి.

నాలోని మగవాడు నిద్రలేచాడు. ఆవిడ అప్రతిమ అందాన్నికళ్ళతోనే పీల్చుకుంటున్నాను. ఒకసారి చటుక్కున ఆమె నా వైపు తిరిగినప్పుడు తప్పు చేసిన వాడిలా తలదించుకున్నాను. మళ్ళీ మామూలే– ఆమె మాట్లాడేటప్పుడు, నవ్వినప్పుడు మెరుపులా తళుక్కుమని మాయమయ్యే బుగ్గల పైని చొట్టల్లో నేను మునిగిపోయాను. పైకి రావాలనే ఉద్దేశాన్నిమరచిపోయి, అక్కడే ఉండిపోవాలనే ఆశ... తర్కం, నైతికతల సరిహద్దులనన్నిటినీ చెరిపేస్తూ.

ఉదయ్ చివరి తమ్ముడి పెళ్ళి ... గ్రూప్ లో మెసేజ్ వేసినా ఫణిగాడు చెప్పినట్టు వర్కింగ్ డే. అది కూడా ఉదయం పూట కాబట్టి మనవాళ్ల అటెండెన్స్ తక్కువ. ఎలాగూ ఎల్లుండి ఉదయ్ ఆతిథ్యం రిసార్ట్ లో ఉంది కదా. అక్కడ అంతా కలుస్తున్నాము .

అంతలో " అందరూ పదండి భోజనాలకు. డైనింగ్ హాల్ పైనుంది" అంటూ ఉదయే స్వయాన వచ్చి మాకు కూర్చునే వ్యవస్థ చేసి వెళ్ళాడు.

" మా వంటకాలు మీకు అపురూపమేమో ! ఒక పట్టు పట్టండి" నా పక్కన కూర్చున్న సృజనా కామెంట్.

" వాడేం కొత్తవాడా నీకు, మీరు–అండి అనడానికి ? నువ్వు అను చాలు వీణ్ణి" ఫణి మధ్యలో అన్నాడు.

" నాలుగు నెలలయింది ఇండియాకు వచ్చి. కానీ నాకు గుజరాతీ భోజనం ఇంకా దొరకలేదు. మా వంటవాడికి వచ్చేది బాజ్రా రోటి, దాల్, చపాతి, సబ్జి అంతే. వాడు లేనప్పుడు అన్నం, సాంబార్ వండుకుంటాను" అన్నాను, వేళ్ళకంటుకున్న వాటిని నాకుతూ. పరమాన్నాన్ని నాలుగూ వేళ్ళతో జుర్రుకుంటున్న ఫణివైపు మెచ్చుకోలుగా

చూశాను. “ ఇలా తినాలి అలా తినాలి అనేవాళ్ళు నా పక్కన కూర్చోకూడదు. భోజనం తన ఇష్టం, చూపులు ఇతరుల ఇష్టం. ఏమంటావు” ఫణి అడిగాడు.

“అవును” అంటూ సృజన వైపు చూశాను. తినేటప్పుడు తన బుగ్గ పైన పడే చొట్ట చాలా ఆకర్షణీయంగా ఉంది. నా విస్తరిలో ఆమె ముఖమే కనిపించి, ఖంగుతిన్నాను.

“ నాకు మైసూర్ పాక్ సహించదు. వద్దన్నా వడ్డించారు” సృజన గొణిగింది.

“ నాకు వెయ్యి” అనడానికి మొహమాటం. “ నాకు శుగర్. దుబెకు వెయ్యి, ఫరవాలేదు” అన్న ఫణి మాటలకు “ ఫరవాలేదు కదా “ అంటూ తన ఆకులోని మైసూర్ పాకు ముక్కను నా ఆకులో వేసింది సృజన. మా ఇద్దరి మధ్య ఉన్న తెర మెల్లిగా కరిగినట్టు భ్రమ నాకు. “నాకు చాలా ఇష్టం” అంటూ మొహం ఇంత చేసుకున్నాను.

భోజనం తరువాత తాంబూలం కవర్ ఇస్తూ ఉదయ్ “ దుబె, నువ్వు వచ్చింది నాకు చాలా ఆనందంగా ఉంది. పది సంవత్సరాలు దాటింది నిన్ను చూసి. ఎనీ వే ఎల్లుండి సాయంత్రం అందరూ మిస్ చెయ్యకుండా రావాలి” అంటూ మళ్ళీ ఆహ్వానించాడు.

“దీన్నేం చేసుకోను ? ఉన్నది హోటల్లో” తాంబూలం కవర్ వైపు చూస్తూ అన్నాను.

“ ఈమెకివ్వు. కొబ్బరి హల్వా చేస్తుంది. ఒకసారి టేస్ట్ చేశాను. సుధీకు కూడ ఇష్టం. కదూ సృజీ ?”

ఆమె కూడా అవునన్నట్టు తలూపింది.

“ సుధీ అంటే మీ భర్తా ?” ఈ సారి నేరుగా తననే అడిగాను.

“సుధన్వ... ఫ్రెండ్. ఫ్యామిలీ సర్కల్ లో సుధీ “ అంటూ నవ్వింది. వేసుకున్న పాన్ వల్ల నాలుక అరుణ వర్ణం కొత్త అందాల్ని చిందింది.

“ పెళ్ళి చేసుకున్న అమ్మాయి తాంబూలం వేసుకున్నప్పుడు నాలుకకు వచ్చే ఎరుపు ఆమెకు భర్త పైన ఉండే ప్రేమకు సంకేతం. ఎరుపు ఎక్కువైనట్టల్లా ప్రేమ ఎక్కువ అని అర్థం” వయస్సులో ఉన్నప్పుడు ఇంట్లో పెద్దావిడ చెప్తున్న మాటలు. సృజన తన భర్తను చాలా ఇష్టపడుతుందేమో ?

“ ఉదయ్ ఫంక్షన్ ఎల్లుండి కదా ? రేపు మా ఇంటికి భోజనానికి రండి.... ఫణీ, నువ్వు తీసుకురా. టిఫిన్ చేసి వచ్చెయ్యండి. చిన్నప్పటి మాటలు, అల్లర్లు అన్నీ మాట్లాడుకోవడానికవుతుంది”

నా తాంబూలం కవర్ తన కవర్ తో పాటు కారు వెనక సీటుకు చేరుకుంది. బై అని చెయ్యాడించి, కారు ముందుకు దూకించింది. నా కోతి మనసు చిందులేసింది.

“నేను అవంతి ఇంటికి వెళ్ళాల్రా. అమ్మ అక్కడే ఉంది. ఈ రోజు వస్తాను అన్నాను “ ఫణితో అన్నాను.

“ రారా. నేను డ్రాప్ చేస్తాను” అనగానే కాస్త రిలీఫ్ గా ఫీలయ్యాను.

"నేను సృజనను గుర్తే పట్టలేదురా. ఫర్ దట్ మ్యాటర్, నాకైతే మన చాలా మంది క్లాస్మేట్ల ముఖాలే గుర్తు లేవు" కార్లో మాటలు మొదలుపెట్టాను.

" నువ్వు అన్నిట్లో టాప్ కదరా. మా మాదిరిగానా ? అల్లరి, తుంటరి పనులు చేసే గ్రూపంతా మాది. అలా చూస్తే యుఎస్ ఎ నుండి వచ్చే గెస్ట్ కు ఆతిథ్యం నాది అన్నప్పుడు ఆ అతిథివి నువ్వని నా కలలో కూడా అనుకోలేదు. నువ్వు ముందు మాదిరిగానే ముభావంగానే ఉంటావని అనుకున్నాను. నువ్వు చాలా మారిపోయావు. నా కంఫర్ట్ జోన్లోకి వచ్చేశావు నువ్వు. నిజమైన స్నేహం ప్రారంభమయ్యిందే అప్పటినుండి"

" అవును. ఉద్యోగం, దాంపత్యం.... నాకు చాలా పాఠాలు నేర్పాయి.. మార్పు అనివార్యమయింది"

"మరంత లేకపోతే ఇక్కడికి తిరిగి వచ్చేవాడివా నువ్వు ? వదిలెయ్యి. అంతా సరిపోతుందిలే "

" లేదు ఫణీ ! నేను మళ్ళీ అక్కడికి వెళ్ళే అవకాశాలు తక్కువ "

ఫణి ప్రశ్నార్థకంగా కనుబొమలెగరేశాడు.

" అవును. శర్మి ఇక్కడికి ఎప్పుడూ రాదు. ఆమెకు అక్కడి ఆకర్షణ గాఢంగా ఉంది. నేనెప్పుడూ అక్కరలేని పాత్ర ఆమెకు. నాకు అక్కడ ఉండడం అసాధ్యమనిపించి ఇక్కడికి తిరిగి వచ్చేశాను. నా నిర్ణయన్ని కొడుకు విపిన్ సమర్థించాడు. విపుల మాత్రం నా కూతురుగా పెరగనేలేదు. అది ఎప్పుడూ వాళ్లమ్మ కూతురే !

నా పైన ఏమాత్రం అటాచ్మెంట్ రాలేదు. ఊపిర్లందని వాతావరణం. ఎలాగూ ఆమె ఉద్యోగం చేస్తోంది. నానుండి ఏమాత్రం అపేక్షించడం లేదు. అయినా కానీ ఇల్లు ఆమెకే వదిలేశాను. నా పిల్లల తల్లి ఆమె. అంతే. నా డార్లింగ్ మాత్రం కాలేదు"

ఇంత చెప్పేటప్పటికి నా గొంతు గద్గదమయ్యింది. నాది నిస్సారమైన దాంపత్యం అన్నది వాడికి తెలియనిదేమీ కాదు. దానికొక తార్కిక ముగింపునిచ్చింది మాత్రం ఫణిని కదిల్చివేసింది.

రెండు నిమిషాల సిగ్నల్. సెంకండ్లు గడుస్తూ ఉన్నాయి– 120,119,118.....

శర్మిలా నా భార్యగా వచ్చినప్పటి నుండి " నాకు మీతో పెళ్ళి అసలు ఇష్టం లేదు. ఇంట్లోవాళ్ళ బలవంతానికి కట్టుకున్నాను" అని మొదటి రోజే విషం కక్కింది. ఇవ్వాళ కాకపోతే రేపు సరిపోవచ్చు అనే ఆశతో ఐదు రోజుల హనిమూన్ గడిచింది – హనీ లేనీ అమావాస్య చంద్రుడి మాదిరి.

ఆరు నెలలైనా "విశేషమేమీ లేదా" అని వాళ్ళ వైపు వాళ్ళు సందేహించినప్పుడు నాలోని అసురుడిది పైచెయ్యయ్యింది.

విపిన్ పుట్టాడు. అమెరికాకు వెళ్ళిన తరువాత పాశ్చాత్య దుస్తులవైపు వాలిన శర్మిని చూసి ఆశ్చర్యమేసింది. అవసరం కంటే ఎక్కువే ప్రదర్శించే ఆ దుస్తుల్లో అప్సరసలా కనిపించింది. నేను ఎక్కువగా ప్రతిఘటించలేదు. ఆ రోజుల్లోనే

విపుల అంకురించింది. కౌటుంబికంగా మా ఇద్దరిది అన్యోన్య దాంపత్యమే అని ఋజువయింది. కట్టుకున్న తప్పుకు తల్లినైనాను అని గొణుగుతూనే ఉండేది. కలయిక అన్నది సృష్టిక్రియకు మాత్రమే, వినోదానికి కాదు అన్నది ఆమె తలలో పాతుకు పోయింది. ఆమె ఉద్యోగానికి చేరినాక మా ఇద్దరి మధ్య మాటలే కరువైనాయి. విపిన్ నన్ను కాస్త దగ్గరయ్యాడు తప్ప విపుల వాళ్లమ్మ మాదిరే. స్వభావంలోనూ అంతే. పదిహేను సంవత్సరాలు అక్కడ గడిపి ఇక చాలు అనిపించేటప్పటికి గుజరాత్ లోని రిసర్చ్ ఇన్ స్టిట్యూట్ లో సీనియర్ సైంటిస్ట్ పోస్ట్ వచ్చింది. వెళ్ళాలన్న నా నిర్ణయాన్ని తెలియజేశాను. " నేను రాను. ఇక్కడే ఉంటాను" అని నిర్మొహమాటంగా చెప్పేసింది. పెద్దవాడవుతున్న విపిన్ మాత్రం " బెస్ట్ విషస్, మిస్ యు డాడ్ " అంటూ వీడ్కోలు పలికాడు.

" దుబే. నా కజిన్ సుధీది కూడా ఒక రకమైన ట్రాజడీ" ఫణి మౌనాన్ని తుంచాడు.

"సుధి అంటే సృజన వాళ్ళాయనా?" చెవులు నిమిరాయి. " అయినా తనను చూస్తే అలా అనిపించలేదు"

"నీ బాధ మాత్రం మొహంలో కనిపించిందా ?" వాడి గొంతులో కారం ధ్వనించింది.

నేను గమ్మునయిపోయాను.

"సుధీ ఒక హీరోలా ఉండేవాడు. సృజి కూడా తక్కువదేం కాదు. ఇద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్ లా అనేలా ఉండేవారు. ఆజన్మ శ్రీమంతుడు. ఉన్నత విద్యాభ్యాసం. బిజినెస్ దేనికీ తక్కువ లేదు. సృజి, నేను ఇద్దరూ కలిసి సుధీని అల్లరి చేసేవాళ్లం. వాడు దాన్నిచాలా ఫ్రీగా తీసుకునేంత... మా ముగ్గురినీ ఒక మంచి స్నేహభావం ముడివేసింది"

"....."

" పెళ్లయిన సంవత్సరానికి వాడికి పెద్ద ప్రమాదం జరిగింది. బ్రతికి బట్టకట్టిందే గొప్ప. లైంగిక సామర్థ్యం పోగొట్టుకుని క్రుంగిపోయాడు. మానసిక వేదనకు అంతులేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో సృజి స్థితి చాలా శోచనీయంగా మారింది. ఇంకా చిన్న వయస్సు నీది, ఇంకో పెళ్ళి చేసుకొని సెటిల్ అవ్వమని కొన్ని రోజులు బ్రతిమాలాడు – కానీ సృజి ఒప్పుకోలేదు. దాంతరువాత చదువు కొనసాగించి ఎం.ఎ చేసి, కాలేజీలో లెక్చరర్ అయ్యింది. ఇంకో ఐదారు నెలల్లో డాక్టరేట్ వస్తుంది"

"బ్రిలియన్స్ ఆడ్స్ టు బ్యూటీ"

" రాత్రయితే మాత్రం అదే ఇల్లు, అదే సుధీ...." నేను కొనసాగించాను.

సర్రున నా వైపు చూశాడు ఫణి, నాకు సిగ్గనిపించింది.

" సృజిని చూస్తే పాపమనిస్తుంది. బట్ ఇట్స్ టూ పర్సనల్. ఏం చెప్పగలం?"

" అవును. నిజమే "

ఉదయం మెసేజ్ లో జరిగిన అల్లరిని వాడితో షేర్ చేద్దామా అనిపించింది. ... కానీ మళ్ళీ ఎందుకో వద్దనిపించి గమ్మునున్నాను.

" నా గురించి సృజికి ఏమైనా తెలుసా ?"

"సృజికే ఏమిటి? మన గ్రూపులోని చాల మందికి తెల్సుంటుంది. అందులోనూ నువ్వొక్కడివే రావడం. నువ్వు రాకముందే తనకు నీ దాంపత్యంలోని చేదు గురించి తెలుసు. నీ భార్య కలీగ్ స్వరూప్ దత్త. సృజికి కూడా ఫ్రెండ్ అతను. ఇదొక "ఎవ్వరికీ చెప్పొద్దు" బాపతు. సృజి నాకు చెప్పినప్పుడు నాకు కొత్తగా ఏమీ అనిపించలేదు. మరో ఇద్దరు గుసగుసలు పోయారు. సూక్ష్మంగా నేను నీ విషయాన్ని షేర్ చేశాను. చెప్పాను కదా గురూ ! మేమంతా గాసిప్ చేసుకుంటుంటాం. అదీ మనకు పరిచయమున్న వాళ్ల విషయం అంటే కొంచెం కుతూహలం ఎక్కువే – ఇది మనిషి సహజ గుణమనుకో. అదే టార్గెట్ మనిషి ఎదురుగా వస్తే దివ్య మౌనం అందరిదీ. అదొక అందరూ ఒప్పుకున్న మాయాగుణం. దీనికెవరూ అతీతులు కారు."

నేను నిట్టూర్చాను.

నా పరిస్థితి తెలిసి సృజి అక్కర చూపించిందా ? తనకూ నా పైన క్లాస్మేట్ అని మాత్రమే కాక ప్రత్యేకమైన శ్రద్ధ ఉందా ? అలా కాకుంటే నా ఆకులోకి స్వీట్ వేయడం, తాంబూలం కవర్ ను నిరాకరించకుండా తీసుకోవడం వీటన్నిటినీ ఎలా అనుకోవాలి ? ఒకటయితే నిజం. ఫణిచెప్పింది విన్న తరువాత సృజన పట్ల ఆకర్షణ పెరిగి, మెల్ల మెల్లగ ఆవరించుకోసాగింది.

★★★★★★★★★★

రాత్రంతా సృజనా చుట్టే నా ఆలోచనలు. ఈ దాహం ఎంత క్లిష్టమైనదో ? ఇటీవల డేటింగ్ చాలా సాధారణమైనా, నా తరం వాళ్ళు ఎటూ కారు. పెళ్ళికి అనుమతి దొరికేదాకా అంతా ఆత్రత, కుతూహలాలే. పెళ్ళైన తరువాత ఏ ఒక్కరికి ఆసక్తి లేకపోయినా తరువాతి జీవితం నిస్సారమే. శర్మి ప్రవర్తన చూసి, రాక్షసుడిలా ప్రవర్తించాలనిపించినా, తట్టుకునేవాణ్ణి. దైహిక వాంఛ కూడా మన రోజూవారి ఆకలి, నిద్ర మాదిరిగానే కదా అని ఎందుకు అనుకోరో మరి ? " నా పెళ్ళాం ఊరెళ్ళినప్పుడు నా బాధ చెప్పునలవికాదు. అదృష్టవశాత్తు నీ భార్య నిన్ను అర్థం చేసుకుందిలే. ఫర్లేదు" సహోద్యోగి కర్బూర్ అనడం విని క్షణకాలం అసూయ అనిపించింది మాత్రం నిజం. ఈ దురదృష్ట జీవితానికి అదే చాలా అరుదు. సరే ! ఎలాగూ ఆ బంధాన్నుండి బయటికి రావడం జరిగింది . శర్మిలా నా మట్టుకు ఒక ముగిసిన అధ్యాయం.

చప్పున సృజన మోహం కళ్ళ ముందుకొచ్చింది. దాంపత్యం అనే సాకుతో సాంగత్యం అనే వాస్తవాన్ని జయించేసిందా ? లేదా సమాజపు కంచె, నైతికత సరిహద్దును దాటలేని వివేకమా ? అయితే నన్ను అల్లరి చేసిందెందుకు ?ఊరికే మాత్రం కాదు. అలా చూస్తే, గ్రూప్ లో తను ఎక్కువగా వచ్చేది కాదు. నెలకో, రెణ్ణెల్లకో ఒక రెండు ఫార్వర్డ్ లు, కామెంట్లు అంతే. నా దుస్తుల్ని గుర్తించి మెచ్చుకుంది అంటే నా సంగతి తెలిసినప్పటినుండి నన్ను ఫాలో చేస్తోందా? చివరికి నేను ఇక్కడికి వచ్చానన్న తరువాత మాట్లాడడానికి అవకాశం కోసం కాచుకుందా ? ఉదయ్ ఇంటి ఫంక్షన్ ను క్యాచ్ చేసుండచ్చా ? నా పైన తనకు ఆకర్షణ.... నాకున్నట్టు ? ఒంట్లోని రక్తమంతా ముఖంలోకి వచ్చినట్టయింది. నన్ను మెచ్చుకోని కారణాలంటూ లేవు.

లాస్ట్ బెంచుకు ఫస్ట్ బెంచ్ పైన క్రష్ ! నా ఆలోచనకు ఎందుకో నవ్వు రాలేదు. నా నిద్రను మాత్రం లాక్కునేంత ఆవరించేసింది.

★★★★★★★★★★★★★★

పొద్దున ఆరు గంటలకు ఫణిగాడు పోన్ చేసి “ సారీ రా ! ఈ రోజు ప్రోగ్రాం క్యాన్సల్. నాకు అర్జెంట్ పనుంది. సాయంత్రం దాకా తీరిక లేదు. ఏడు గంటల పైన సృజికి ఫోన్ చేస్తాను. ఏర్ పోర్ట్ వైపు వెళ్తున్నాను. రేపు రిసార్ట్ లో కలుద్దాం. బై” అని సుప్రభాతం పాడినప్పుడు, ఛ ! తనను దగ్గరినుండి చూడాలి, మనసారా కబుర్లు చెప్పే అదృష్టం తప్పిపోయిందే అనిపించి అసహాయత కమ్మింది. పది నిముషాల తరువాత సృజన కాల్. ఫణిగాడి మెసేజ్ చెప్పాను.

“ ఛ ! రేపు దొరకనీ చెప్తా వాడికి. సరే. మీ ప్రోగ్రామేమిటి ?”

“ చెప్పుకోదగ్గట్టు ఏం లేదు – మీ ఇంటికి వచ్చే ప్రోగ్రాం ఉండడం వల్ల మా కజిన్ కు రేపు వస్తానన్నాను.” నా గొంతులో మొహమాటం తొణికింది.

“ అలాగయితే స్నానం చేసి మా ఇంటికి రండి. జతగానే టిఫిన్ చేద్దాం”

“.... “ నేను వింటోంది నిజమేనా ?

“ హలో ! ఏంటి బదులే లేదు మీ దగ్గరినుండి ! మిమ్మల్నేం తినెయ్యను నేను . రండి”

ఆ రకమైన బలవంతానికి లొంగిపోయాను. లొకేషన్ షేర్ చేసింది. కాస్త కంగారనిపించినా ఉత్సాహం మళ్ళీ చిగురించింది. ఎలాగూ ఒక్కణ్ణే వెళ్తున్నా. ఏదైనా గిఫ్ట్ ?

ఇంత పొద్దున్నే ఏ కొట్టూ తెరచి ఉండదు. అప్పుడే గుర్తుకొచ్చింది. శర్మిలకు అని ఒక చీర తీసింది ఉంది. అమ్మకు నా గురించి తెలియదు కదా ! అందుకే కిట్ నుండి ఆ చీర పౌచ్ తీశాను. నెమలి పచ్చ రంగు, నీలం అంచు పట్టుచీర. సృజనకు నప్పుతుంది అనిపించి తీసి పెట్టుకున్నాను.

★★★★★★★★★★★★★★★

సృజన ఇంటిని చేరేప్పటికి ఎనిమిదిన్నరయింది. " హాయ్ ! రండి. నమ్మకం కలగడం లేదు. యు ఆర్ హియర్ " మెత్తటి కరచాలనంతో స్వాగతించింది. "ఫీల్ ఫ్రీ" అనడం మరచిపోలేదు. వంటింటి నుండి ఏదో స్వీట్ ఉడుకుతున్న పరిమళం. " ఇక్కడికే రండి" సృజన పిలుపు విని లోపలికి వెళ్ళాను. " టిపిన్ రెడి. ఇడ్లి, చట్నీ. ఉడుపి హోటల్నుండి వడ, సాంబార్ తెప్పించాను. మంచి కాంబినేషన్. మీ ఫేవరెట్ హల్వా ఎలాగూ ఉంది" నవ్వింది. " మీరు అనద్దు" అన్నాను. " మరి. ప్రేమతో అను అననా ?" కన్ను కొట్టి నవ్వింది. ఇంట్లో నేను అనుపమ్, అను. బయట దుబె. పులకలు లేచాయి. " ప్రేమతో అయితే సరే" అన్నాను. టిఫన్ ముగించేంతలో మా ఇద్దరి వ్యక్తిగత విషయాలన్ని బయటికి వచ్చాయి. ఇద్దరూ కలిసి వంట ముగించింది ఒక మధురమైన అనుభవం. నేను తెరచి ఉంచిన పుస్తకాన్నయ్యాను. "సుధీకి నన్ను ముట్టుకోవడానికి కూడా గిల్ట్. నా స్పర్శ అతడికి బాధ కలిగిస్తే అని నాకు మొహమాటం. ' సృజి. మిరుమిట్లు గొలిపే నీ అందం చూస్తుంటే నాకు బాధ కలుగుతుంది. ఇంకో పెళ్ళిచేస్కో' అని ఎగిరాడు. 'ఫిజికల్ ఇంటిమసి కోసమైతే నాకు అక్కర్లేదు' అనేశాను. బట్ వి ఆర్ గుడ్ ఫ్రెండ్స్. దట్ ఈస్ ఫైన్" కళ్ళలొ తడి కనిపించింది." నేను కూడా సామాన్యమైన ఆడదాన్ని. ఆశలు నన్ను కూడా సతాయించకుండా ఉండవు. ఇలా విరిసి అలా వాడిపోతాయి అంతే" నవ్వింది కన్నీళ్ళ మధ్య.

" ఐ క్యాన్ ఫీల్ యువర్ ఎగొని" ఆమె దుఃఖానికి వంత పలికాను. " హేం. మరచిపోతానేమో. నీకొక గిఫ్ట్" అంటూ చీర పౌచ్ ఇచ్చాను. దాని నేపథ్యాన్ని కూడా చెప్తూ "ప్రతి చీర పైనా దాన్ని కట్టుకునేవారి పేరు రాసుంటుంది. థ్యాంక్యూ" అంటూ చీరను విప్పి పైన వేసుకుని " నాకు నచ్చిన రంగు ఇది" అంటూ భుజాలు ఎగరేసింది.

" లెట్ మి కన్ఫెస్. నేను నిన్ను నిన్నటి నుండి చాలా మిస్సవుతున్నాను." మనసులోని మాట గొంతునుండి బయటకు రాక ఒక నవ్వు నవ్వి ఊరుకున్నాను.

★★★★★★★★★★★★★★★

"పది నిమిషాలు.. టేబల్ రెడి చేస్తాను– అప్పటిదాకా రేడియో వింటూ ఉండు" అంటూ ఒక అరచేతి వెడల్పు రేడియో ఆన్ చేసింది.

" లగ్ జా గలే కె ఫిర్ " పాట మంద్రంగా వినిపించింది.

నేననుకున్నదానికంటే ఎక్కువగా ఏమేమో జరుగుతోంది. సమాన దుఃఖితులు. ఒకరొకొకరు దగ్గరవ్వాలని గుంజుతున్న మనసులు. విశ్లేషణ ఎందుకు ? ఈ క్షణం మాది. అంతే. ముందేమవుతుందని ఖాతరు లేదు. నైసర్గిత

విపత్తు, ప్రమాదాలతో అమాయకుల చావులు, బాధలు, కంగారు పెట్టే షాకింగ్ వార్తలు. పారాణి ఆరక ముందే నవ దంపతుల దుర్మరణం, శవాలను చూడడానికి వెళ్లి శవాలయిన ప్రజలు, భూపతనంలో కనుమరుగైన అసంఖ్యాత ప్రజలు, ప్రవాహంలో కొట్టుకుపోయిన కుటుంబం,.. ఒకటా.. రెండా. అనిశ్చిత బ్రతుకుల్లో ఏదీ చెప్పి రాదు. అలాగే అవకాశం కూడా. మా కోరికలు అబద్ధంకావు– తప్పు ఒప్పు చాల వ్యక్తిగతం. మన సుఖ దుఃఖాలకు మనమే బాధ్యులం అయితే బాధలో ఎందుకు ఉండాలి? ఆహ్వానం వచ్చినప్పుడు అక్కర్లేదనే నాటకం ఎందుకు ? నాలోని నేను అతృప్తుడినై ఏం సాధించాలి ? ఎవరిని మెప్పించాలి? అలాగే మనసు నొప్పించని సృజి.... ఖర్మ అనుకుంటూ తెరచాటున ఏడవాలా? జీవితమంతా, భయపెట్టే భయానికి ఎందుకు భయపడాలి ? పాటకు సమాంతరంగా నా మనసు కూడా తర్కిస్తోంది.

★★★★★★★★★★

సృజన బలవంతానికి ఒక ముద్ద ఎక్కువే తిన్నాను.

"ఇక బయలుదేరుతాను" బలవంతంగా లేచాను.

"వద్దంటే ఉండిపోతావా"

ఒక క్షణం తబ్బిబ్బయినా " సీ యూ" అంటూ మర్యాదపూర్వకమైన హగ్ కు చేయి సాచాను.

నేననుకున్నదానికి వ్యతిరేకంగా కరచాలనం ! "థ్యాంక్యూ వెరిమచ్ ! రేపు సాయంత్రం మళ్ళీ కలుద్దాం. ఉదయ్ ఆతిథ్యంలో " నవ్వుతూనే వీడ్కోలు పలికింది.

ఆ క్షణం సిగ్గనిపించింది.

లాస్ట్ బెంచ్ అమ్మాయి ఉన్నట్టుండి ఫస్ట్ వచ్చినట్టూ, నేను ఫేల్ అయినట్టూ అనిపించి ఓడిపోయినట్టనిపించింది.

నవ్వు ముసుగుతోనే బయటకు నడిచాను.

ఆకాశంలో అప్పుడే ఉదయిస్తున్న ఇంద్రధనస్సు అందంగా ఉండింది. "సూర్యుడికిరణాలు చినుకుల ద్వారా ప్రసరించినప్పుడు వక్రీభవించి ఇంద్రధనస్సు ఏర్పడుతుంది" అని పాఠశాలలో చదివాము. ఇంద్రధనస్సున్న చోట సృజి నవ్వినట్టనిపించింది.

★★★★★★★★★★